thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 298 | కరీంనగర్ ఆదివారం, 4 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహారా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్ర హాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నం తా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.




హైదరాబాద్: హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల ఐకాస నేతలు, వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆరోపించారు. వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రశ్నిస్తే, నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలు, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన ఇవాళ అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే.. వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని కేటీఆర్ స్పష్టం చేశారు.




## గృహ జ్యోతి పథకంపై సభలో డిప్యూటీ సీఎం భట్టి క్లారిటీ

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇందిరమ్మ ఇళ్ళు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గ ృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ – గ ృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు. పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గ ృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. కొత్త దరఖాస్తులు, మార్పులు – చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 52.82 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గృహ జ్యోతి కోసం ఇప్పటి వరకు రూ.3,593 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**వ్యవసాయ రంగంపై..** వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ.. వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్ధరణ చేపడుతున్నామని చెప్పారు. సోయాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై..** డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, విచారణ పూర్తైన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.




ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు.

ఘటనా స్థలం నుంచి ఏకే–47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మ ృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పాముల్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపూర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు




# 117 మున్సిపాల్టీలు, ఆరు కార్పొరేషన్ల

# ఎన్నికలకు రంగం సిద్ధం!

## 10లోపు ఓటర్ల తుది జాబితా

## అధికారులతో కలిసి ఎన్నికల సంఘం కసరత్తు

హైదరాబాద్ : ఇటీవల పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎన్నికలపై దృష్టి సారించింది. జనవరి మూడోవారంలో 117 మున్సిపాల్టీలకు, ఆరు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీనికోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు కసరత్తు ప్రారంభించారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాపై ద ృష్టి సారించారు. ఈనెల 10లోపు ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను పూర్తి చేయనుంది. ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ చేయనుంది. పది రోజుల్లోనే ఎన్నికల ప్రక్రియను ముగించాలని ఎన్నికల సంఘం యోచిస్తున్నట్టు తెలిసింది. ఇదే అంశంపై మున్సిపల్ శాఖ అధికారులతో సమాలోచన లు చేసింది. దీంతో ఈ నెలాఖరులోపు కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్స్ కొలువుదీరనున్నారనే చర్చ జరుగుతోంది.

**గడువు ముగిసి ఏడాది...** రాష్ట్రంలో 26.01.2020న మున్సిపాల్టీల పాలకమండళ్లు కొలువుదీరాయి. వాటి కాలపరిమితి 26.01.2025తో ముగిసి దాదాపు ఏడాది కావొస్తున్నది. అయితే ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. మొత్తం 130 మున్సిపాల్టీలకు గడువు ముగిసింది. 12 మున్సిపాల్టీలను కొత్తగా ఏర్పాటు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 10న ముగియనుంది. ఇప్పుడు గ్రేటర్లో అదనంగా 27 మున్సిపాల్టీలను కలిపింది. వార్డుల విభజన కూడా జరిగింది. సరిహద్దులను ఖరారు చేసే పనిలో టౌన్ ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 300 డివిజన్ల హద్దులను ఖరారు చేయడం, ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ఏప్రిల్ మొదటివారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఏడాది కాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో కొత్త పనులకు అనుమతి లేకుండాపోయింది. అయితే కొనసాగుతున్న పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో పెండింగ్ పనులు ముందుకు పోవడం లేదు. ఫలితంగా మున్సిపాల్టీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి.

# బంగ్లాదేశ్‌లో భారత్ వ్యతిరేక కుట్రలు..

## యూరోపియన్ దేశాల నిధులు!

## భారత్ వేచి చూడదు.. గుణపాఠం తప్పదు!



బంగ్లాదేశ్‌ను భారత్‌కు వ్యతిరేకంగా మార్చేందుకు విదేశీ శక్తులు భారీగా నిధులు సమకూరుస్తున్నాయని నిఘా వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, భారత్ సరిహద్దుల జోలికి వస్తే "ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం" అనే మోదీ ప్రభుత్వ విధానాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరికలు జారీ అవుతున్నాయి.

**అమెరికా నిఘా మరియు సెయింట్ మార్టిన్ ద్వీపం:** చైనా, మయన్మార్ మరియు బంగ్లాదేశ్‌లను పర్యవేక్షించడానికి అమెరికా 'సెయింట్ మార్టిన్' ద్వీపంలో తన స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఈ ద్వీపంలోని ఒక లగ్జరీ రిసార్ట్‌ను అమెరికా సైన్యం తన క్యాంపుగా మార్చుకుంది. ఇటీవల అక్కడ అమెరికాకు చెందిన ఒక ఉన్నతాధికారి మర్మస్థితిలో మరణించడం బంగ్లాదేశ్ సైనిక వర్గాల్లో కలకలం సృష్టించింది.

**బంగ్లాదేశ్‌లో రాజకీయ చదరంగం:** బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న అశాంతిని అడ్డుపెట్టుకుని విదేశీ శక్తులు అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నాయి. విద్యార్థి పోరాటాలు: షేక్ హసీనాను గద్దె దించడానికి జరిగిన విద్యార్థి ఉద్యమం వెనుక విదేశీ శక్తుల హస్తం ఉందని ఇప్పుడు స్పష్టమవుతోంది.

**వీసా రద్దు డిమాండ్:** భారతీయులకు జారీ చేసిన పని వీసాలను రద్దు చేయాలని అక్కడ కొన్ని సంస్థలు డిమాండ్ చేయడం ఈ కుట్రలో భాగమేనని తెలుస్తోంది.

**పాకిస్తాన్ ISI మరియు ఐరోపా దేశాల ప్రమేయం:** రెండు వైపుల నుండి ముప్పు: భారత్‌ను ఇబ్బంది పెట్టేలా బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించడానికి పాకిస్తాన్ ఐఎస్ఐ ప్రయత్నిస్తోంది.

**ఐరోపా నిధులు:** బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక నిరసనలకు ఐరోపా దేశాల నుండి భారీగా నిధులు అందుతున్నాయని ఆధారాలు దొరికాయి. జమాత్–ఇ–ఇస్లామీ వంటి తీవ్రవాద సంస్థలకు అంతర్జాతీయ మద్దతు లభిస్తోంది.

**అధికార పోరు:** ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వంలో ముహమ్మద్ యూనస్ మద్దతుదారులకు మరియు జమాత్ సంస్థ మద్దతుదారులకు మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. దీనివల్ల బంగ్లాదేశ్ జాతీయ పౌర పార్టీకి చెందిన పలువురు నేతలు రాజీనామాలు చేస్తున్నారు.

**భారత్ హెచ్చరిక:** పొరుగు దేశంలో జరుగుతున్న ఈ మార్పులను భారత్ నిశితంగా గమనిస్తోంది.

**దూకుడుగా సమాధానం:** భారత అధికారులను బెదిరించేలా బంగ్లాదేశ్ మీడియాలో వస్తున్న వార్తలకు భారత్ తలొగ్గదు.

**ఖచ్చితమైన విధానం:** సరిహద్దు దాటి వచ్చే ఉగ్రవాదాన్ని లేదా దేశ భద్రతకు ముప్పు కలిగించే ఏ చర్యలనైనా భారత్ ఉక్కుపాదంతో అణిచివేస్తుంది. "జవాబు ఇవ్వడం మాకు హల్వా తినడం లాంటిది" అని, అవసరమైతే శత్రువుల స్థావరాల్లోకి వెళ్లి మరీ దెబ్బకొడతామని భారత్ స్పష్టం చేస్తోంది.

చురకలు

ఆదివారం 4 జనవరి 2026



# కొండగట్టు నాకు పునర్జన్మ ఇచ్చింది

మల్యాల: ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందరరేగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. "అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది" అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టు అగ్రనేత దేవా లొంగుబాటు

## మావోయిస్టు అగ్రనేత దేవా లొంగుబాటు.. భారీగా ఆయుధాలు, నగదు స్వాధీనం: డీజీపీ

హైదరాబాద్: మావోయిస్టు అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. "దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 %శ్రీఎస్త్ర%, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాదీనం చేసుకున్నాం. SLR 8, నాలుగు బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు.

హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. డివిజన్ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4లక్షలు, మిగతా సభ్యులకు రూ.లక్ష రివార్డు ఉంది. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని కోరుతున్నాం" అని డీజీపీ తెలిపారు.

# పాలమూరు' మోటార్‌ను కేసీఆర్ ఆన్ చేసిన తెల్లారే.. ఆఫ్ చేశారు: ఉత్తమ్

హైదరాబాద్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. "కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృషా? నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత – చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చింది" అని ఉత్తమ్ వివరించారు.

**ఏపీ తరలిస్తుంటే చూస్తూ కూర్చున్నారు..** "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చూస్తూ కూర్చుంది. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024–25 సీజన్‌లో కృషా? జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృషా? జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృషా? నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉంది" అని ఉత్తమ్ తెలిపారు.

# ఎమ్మెల్యే కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కిషన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమన్న కేంద్రమంత్రి.. ప్రధానమంత్రిపై వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ దీనిపై జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కోరారు.



# ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఉన్న తేడా.. ఉత్తమ్‌పై హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. "అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము." అని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.



# గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో మోసం చేసింది

హైదరాబాద్ : శనివారం అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేసిందని.. తమ ప్రభుత్వంలో భేషజాలకు వెళ్లకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించామని.. ఆగిపోయిన ఇళ్లకు నిధులిచ్చి పూర్తీ చేస్తున్నామని అన్నారు మంత్రి పొంగులేటి. గత పాలకులు పదేళ్లు కమిషన్ల కోసమే పనిచేశారని.. పదేళ్లలో ఇళ్ళు పూర్తీ చేసి ఉంటే పేదలకు ఇబ్బంది ఉండేది కాదని అన్నారు పొంగులేటి.

పదేళ్లు కమిషన్లు తీసుకొని అరకొర ఇళ్ళు ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చెంచులందరికీ మొదటి విడతలోనే ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు పొంగులేటి. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నామని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి సంబంధించిన ఇండ్ల నిర్మాణంలో రాజీపడం అని.. అర్హులందరికీ తప్పకుండా ఇండ్లు ఇస్తామని అన్నారు పొంగులేటి.

# ఇందుకే కమ్యూనిస్టులు ప్రజల ఆదరణ కోల్పోయారు: బండి సంజయ్




హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో ప్రధాని నరేంద్ర మోడీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. మోడీకి చిప్ దొబ్బిందని.. ఇకనైనా మైండ్ సెట్ మార్చుకుంటే బెటర్ అని కూనంనేని మాట్లాడారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా పెట్టారు. అసెంబ్లీలో ఇలాంటి మాటలకు స్థానం లేదని ఖండించారు. ఇలాంటి మాటలతోనే సమాజంలో కమ్యూనిస్టులు ప్రజల ఆదరన కోల్పోయారని అన్నారు. కూనంనేని సాంబశివ రావు తక్షణమే ఆయన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి.. ప్రధాని మోడీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం రాజకీయ ధూషణలకే పరిమితమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని విమర్శలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో అలాంటి వ్యాఖ్యలను అనుమతించడమే కాకుండా ఆ మాటలను ఆస్వాదిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. తక్షణమే ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఈ నెలలోనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్!



హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం సిద్ధమైంది. ఈ నెల 11 లేదా 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇదివరకే నిరయించిన సంగతి తెలిసిందే. ఎన్నికల సంఘం జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది. 10న తుది జాబితా వెలువరిస్తుంది. దాంతో 11వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఒకవేళ సంక్రాంతి పండగ, సెలవుల కారణంగా కుదరకపోతే 20న విడుదల చేస్తారు. దీనికి అనుగుణంగా, మిగతా ప్రక్రియ సజావుగా సాగేలా పురపాలక పట్టణాభివృద్ధిశాఖ సిద్ధమవుతోంది.



# వెనెజువెలాలో భారీ పేలుళ్లు

వెనెజువెలా రాజధాని కరాకస్‌లో శనివారం తెల్లవారుజాము న భారీ పేలుళ్లు సంభవించాయి. కరాకస్‌లోని దాదాపు ఏడుచోట్ల ఈ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించా యి. వెనెజువెలా నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి ఆ దేశ భూభాగంపై దాడులు చేపడతామని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న సమయంలో దేశ రాజధానిలోని పలు ప్రాంతాలలో బాంబు పేలుళ్లు జరగడంతో ఇది అగ్రరాజ్యం పనేనని స్థానిక అధికారులు అనుమానం వ్యక్తంచేశారు. ఈ దాడులను అమెరికా ధ్రువీకరించాల్సి ఉంది. వెనెజు వెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతు న్నాయని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ఆరోపిస్తుం డడంతో.. అక్కడి ప్రభుత్వాన్ని కూల్చడానికి ట్రంప్ కార్యవర్గం ప్రణాళికలు రచిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే అమెరికా కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది.

చురకలు



# అంధుల అక్షర శిల్పి బ్రెయిలీ - జనవరి 4... లూయీ బ్రెయిలీ జయంతి



జనవరి 4ను వరల్డ్ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటారు. అంధులకు చదువుకొనే అవకాశాన్ని కల్పించిన బ్రెయిలీ జననం మరణం రెండూ రెండు రోజుల తేడాతో జనవరి 4, జనవరి 6న జరుపుకుంటారు. కంటి చూపు లేకపోయినా..ముందు చూపు ఉన్న వ్యక్తి లూయీ బ్రెయిలీ. బ్రెయిలీ కనిపెట్టిన అంధుల లిపి ప్రస్తుతమున్న కంప్యూటర్ భాషకు వీలుగా రూపొందించ బడిందంటే ఆయన ముందుచూపు ఏమిటో అర్థమవుతుంది. బ్రెయిలీ, పేపర్ మీద ఎత్తు చుక్కల ఆధారంగా ఒక భాష రూపొందించారు. ఈ చుక్కలను స్పర్శించడం ద్వారా కనిపించక పోయినప్పటికీ ఏదైనా చదువవచ్చు. ఈ లిపి చూపు లేని వారికి రాయటంతో పాటు చదవడంకు కూడా సహాయ పడుతుంది. ప్రపంచ అంధులకు జ్ఞాన నేత్రాలను ప్రసాదించిన మహనీయుడు లూయీ బ్రెయిలీ. మానిక్ బారన్, సైమన్ రెనా బ్రెయిలీ దంపతులకు లూయీ బ్రెయిలీ 1809 జనవరి 4న పారిస్ లోని క్రూవే గ్రామంలో జన్మించారు. బాల్యంలోనే ప్రమాదవశాత్తు రెండు కళ్ళను కోల్పోయారు. పారిస్‌లో 1784లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలకు బ్రెయిల్ చదువు కోవడానికి వెళ్ళారు. బ్రెయిల్ అసాధారణ ప్రతిభ సామర్థ్యాలు గల వ్యక్తిగా రాణించి, అప్పటికి అమలులో ఉన్న "లైన్ టైపు" పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమించబడ్డారు. పగలు విద్యార్థులకు బోధిస్తూ, రాత్రులు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీ కోసం అసాధారణ ప్రతిభ కలిగిన వ్యక్తిగా విశేష కృషి చేశారు. అందు కోసం ఒక ప్రత్యేక లిపిని కనుగొని దానికి "బ్రెయిలీ లిపి" అని నామకరణం చేశారు. అంధులు తేలికగా చదవగలిగే రాయగలిగే లిపిని తయారు చేయడానికి కృషి చేశారు. అంధులకు పుస్తకాలు ప్రింటుచేయడానికి అంతవరకు ఉన్న విధానాలు బ్రెయిలుకు లోపభూయిష్టంగా కనబడ్డాయి. అంధులకు చూసే అవకాశం లేదు. కనుక ఆ ప్రింటింగు విధానం స్పర్శపై ఎక్కువగా ఆధారపడి వుండాలని గ్రహించారు. ఆ అక్షరాలు నున్నగా కాకుండా చుక్కలు చుక్కలుగా వుండాలని భావించారు. ఒక గీతగా కాకుండా, చుక్కలు చుక్కలుగా వుంటే చదవటం తేలిక అని బ్రెయిల్ నిశ్చయానికి వచ్చారు. 1821 లో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి, తన సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు 12 ఉబ్బెత్తు చుక్కలతో సంకేత లిపిని తయారు చేసారు. దీని గురించి తెలుసుకున్న బ్రెయిలీ 12 చుక్కలను ఆరు చుక్కలకు తగ్గించి అవసరమైన రీతిలో వాటిని పేర్చుతూ అక్షరాలను, పదాలను అంకెలను, సంగీత చిహ్నాలను రూపొందించారు. 20 సంవత్సరాల యువకుడైన బ్రెయిల్ తన నూతన పద్ధతి సిద్ధాంతీకరించాడు. 5 సంవత్సరాల పరిశోధనలో బ్రెయిల్ తన పద్ధతిలో సంపూర?త సాధించారు. ఆరు చుక్కలను వివిధ రకాలుగా ఉపయోగించడం వల్ల బ్రెయిలీ మొత్తం అక్షరాలను రూపొందించారు. ఇది విప్లవా త్మకమైన మార్పు. ఈ విధంగా మొత్తం భాషకు 250 గుర్తులు ఈ ఆరు చుక్కలలో బ్రెయిల్ రూపొందించారు. ఈ రకంగా గ్రుడ్డివారు బ్రెయిలులో వ్రాయగలరు. చదవగలరు. వారికి ఇతరుల సహాయం అక్కరలేదు. ఇంగ్లీషు, తెలుగు, భాషలన్నీ ఎడంనుండి కుడికి వ్రాస్తే, బ్రెయిల్‌లో కుడినుండి ఎడమకు వ్రాయడం జరుగుతుంది. బ్రెయిలులో టైపురైటర్లు కూడా రూపొందించడం జరిగింది. సంగీతాన్ని కూడా తన లిపిలో వ్రాయడం బ్రెయిలీ కృషికి నిదర్శనం. బ్రెయిలీ లిపిని మరింత ముందుకు తీసుకెళ్ళే కృషిలో భాగంగా లెక్కల్ని అభ్యసించడానికి, సంగీతాన్ని నేర్చుకోవడానికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దారు. 1829 లో 'మెథడ్ ఆఫ్ రైటింగ్, మ్యూజిక్ అండ్ ప్లైన్ సాంగ్స్ బై మీన్స్ ఆఫ్ డాట్స్ ఫర్ యూస్‌బై ది బ్లైండ్ అండ్ ఎరేంజ్‌డ్ ఫర్ దెమ్' అనే పుస్తకాన్ని లూయీ బ్రెయిలీ ప్రచురించారు. 1839లో డాట్స్‌తో ముద్రణ చేసే విధానం గురించి కూడా పుస్తకాల్ని ప్రచురించారు. యూరప్‌లో 1873లో, యుఎస్‌ఏలో 1883లో బ్రెయిలీలిపి వాడుకలో వచ్చింది. మొదటిసారి ఇంగ్లిష్ భాషలోకి బ్రెయిలీని 1932లో ప్రవేశపెట్టారు. అంధులకోసం అవిశ్రాంత కృషి చేసిన లూయీ బ్రెయిలీ జనవరి 6,1852 తన 43 సంవత్సరాల వయస్సులో క్షయ వ్యాధికి గురై మరణించారు. 19 శతాబ్దంలో కనిపెట్టిన ఆరు చుక్కల అంధుల లిపిని నేటికి ప్రపంచంలోని అన్ని దేశాల ఆంధులు విద్యావంతులుగా రాణించడానికి దోహదం చేస్తున్నాయి. బ్రెయిలీ లిపిలో అనేక పుస్తకాలు నేడు అందుబాటులోకి వస్తున్నాయి. లెబ్రరీల్లోనూ ఈ పుస్తకాలు చోటు చేసుకుంటున్నాయి. లూయిస్ మరణానంతరం లూయీ బ్రెయిలీ పేరు మీద స్టాంపులు, కరెన్సీ రూపొందించారు. పలు విద్యాసంస్థలకు, సిటీలకు ఆయన పేరు పెట్టుకున్నారు. భారతదేశం రెండు రూపాయల నాణెం మీద, యుఎస్ డాలర్ మీద లూయీ బ్రెయిలీ ముఖచిత్రాన్ని ముద్రించారు. ఫ్రాన్స్, జర్మనీ దేశాలు ప్రపంచ వ్యాప్తంగా చెల్లుబాటయ్యే పోస్టల్ స్టాంప్‌లను కూడా విడుదల చేశాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# సాటిలేని మేటి చిత్రకారుడు పి. టి.రెడ్డి

## జనవరి 4...పాకాల తిరుమల్ రెడ్డి జయంతి




పాకాల తిరుమల్ రెడ్డి అంటే చాలామందికి తెలియక పోవచ్చు.. కాని. పి.టి.రెడ్డి అంటే చిత్రకళా ప్రపంచంలో తెలియనివారు బహుశా ఉండరేమో. పాకాల తిరుమల్ రెడ్డి (జనవరి 4, 1915 – అక్టోబర్ 21, 1996) చిత్రకళా రంగంలో పి.టి.రెడ్డి గా చిరపరిచితుడు. అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన చిత్రకారుల్లో పి.టి.రెడ్డి ముఖ్యుడు. ఆరు దశాబ్దాలుగా చిత్రకళా రంగంలో అలుపెరుగని కృషి చేసిన గొప్ప చిత్రకారుడు ఆయన. మరణించే వరకు కుంచెలను విశ్రాంతి ఈయని తెలంగాణ గర్వించ దగిన చిత్ర కారుడు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం అమృతా షేర్గిల్, రవీంద్రనాథ్ ఠాగూర్లతో సమానంగా ప్రథమశ్రేణి చిత్రకారుడుగా గుర్తింపు పొందిన పి.టి.రెడ్డి భారతీయ చిత్రకళా రంగంలో ప్రథమశ్రేణి చిత్ర కారుడుగానే గుర్తింపు కలిగి ఉన్నాడు. చిత్ర శిల్పకళలో తన జీవిత సర్వస్వం ధారపోసిన నిత్యకృషీ వలు డాయన. సుమారు ఐదున్నర దశాబ్దాల కళాజీవితపు వెలుగు నీడలలో తనను ప్రభావితం చేసిన అనేక సమకాలీన సంఘటనలకు తన చిత్రాలతో ప్రాణంపోసిన కళాకారుడు పి.టి. రెడ్డి. అన్ని తరగతుల ప్రేక్షకుల కళాభిజ్ఞతకు అనుగుణంగా చిత్రాలను, శిల్పాలను సృజించాడు. వాటిలోని మంచి చెడులను, తారతమ్య వివక్షతతో వీక్షించి, తెలుగు జీవితానికి అన్వయించే రీతిలో రంగుల మేలు కలయికతో, రమణీ యతను, సృజనాత్మకతను సమా నంగా మేళవించిన మేటి చిత్రకా రుడు పి.టి.రెడ్డి. నిత్య జీవితంలో తారసపడే అనేక సంఘటనల ఆధారంగా వేసిన చిత్రాలను, గ్రామీణ జీవితానికి అద్దంపట్టే చిత్రాలుగా రూపొందిం చడం ఆయన ప్రత్యేకత. ప్రత్యేక తెలంగాణ పోరాటం సుదీరంగా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయన గీసిన చిత్రాలు ప్రశంసనీయమైనవి. కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామంలో 1915, జనవరి 4 న జన్మించాడు. 1942లో బొంబాయి సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి చిత్రకళల మొదటి ర్యాంకుతో డిప్లొమా పొందాడు. దేశంలోని అన్ని ముఖ్య పట్టణాల లోన కాక ఆస్ట్రేలియా, యు.కె, జపాన్, పశ్చిమ జర్మనీ తదితర విదేశాల్లో సైతం చిత్రకళా ప్రదర్శనలు నిర్వ హించాడు. తనతో భావ సారూ ప్యత కలిగిన నాటి యువ చిత్ర కారులు మాజిద్, ఎం. ఏ. భోస్లే, బాప్టిస్టా, ఎం.వి, కులకరి?లతో కలిసి "ది కాంటెంపరరీ గ్రూప్ ఆఫ్ పెయింటర్స్" అనే సంస్థను కూడా స్థాపించి నిరంతరం చిత్రకళా కార్యక్రమాలను నిర్వహించేవాడు. పి.టి.రెడ్డి అనేక పదవులు కూడా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన చిత్రకారుడుగా ఆయన చేసిన సేవలు చెప్పుకోదగినవి. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ విశిష్ట సభ్యునిగా, కార్యదర్శిగా, అధ్యక్షు డిగా అనేక హోదాల్లో పని చేసాడు. అత్యంత ప్రతిషా'త్మకమైన అవార్డు లెన్నో అందు కున్నాడు. హైదరా బాదు నారాయణ గూడ లోని తన నివాసాన్ని ఒక పెద్ద చిత్రకళా ప్రదర్శనా నిలయంగా తీర్చిదిద్దిన కళా దర్శకుడు పి.టి.రెడ్డి. జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో ప్రదర్శనలలో పి.టి.రెడ్డి చిత్రాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ప్రముఖంగా బకింగ్ హాం పేలస్, లండన్, న్యూఢిల్లీ నందలి రాష్ట్రపతి భవన్, ఎంబసీ ఆఫ్ జి.డి.ఆర్., పార్లమెంట్ హౌస్ ఇంకా డిల్లి కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, నేషనల్ గేలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్,కేంద్ర లలితకళా అకాడమీ న్యూఢిల్లి, కర్నాటక, కాశ్మీర్, ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ లతో పాటు జే.జే. స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ బొంబాయి, అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కలకత్తా, హైదరాబాద్ స్టేట్ మ్యూజియం, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హైదరా బాద్, సాలార్ జంగ్ మ్యూజియం, ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్అండ్ క్రాఫ్ట్స్. న్యూఢిల్లి, టాటా ఇన్స్టి ట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ బొంబాయి మరికొన్ని యునైటెడ్ కింగ్ డం, అమెరికా, యుగోస్లో వియా, పిలిపీన్స్, ఫ్రాన్స్, స్విడ్జ ర్లాండ్, జర్మనీ ఆస్ట్రేలియా తదితర దేశాలనందు వివిధ ప్రైవేట్ వ్యక్తుల సేకరణలో కూడా ఆయన చిత్రాలు వున్నాయి. కళ ప్రజల కోసం అని భావించి, ఎనభై ఏళ్ళ ప్రస్థానంలో అనితర సాధ్యమైన కృషి, పట్టుదలతో తెలుగు చిత్రకళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన అసమాన ప్రతిభాశాలి 1996, అక్టోబర్ 21 న మరణించాడు. పి.టి.రెడ్డి భార్య ప్రముఖ రచయిత్రి పి.యశోదారెడ్డి. పి.టి.రెడ్డిని 1947లో ప్రేమ వివా హం చేసుకున్న ఆమె, తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే సూర్తే. ఆమె కూడా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించేది. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటి లోని కళానైపుణ్యాన్ని, వైభవాన్ని ఆమె గుర్తించగలిగేది. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఆవిష్కర్తల ప్రేరణ కర్త గోపాలస్వామి దొరస్వామి నాయుడు

## జనవరి 4... భారతదేశపు ఎడిసన్ - గోపాలస్వామి దొరస్వామి వర్ధంతి



గోపాలస్వామి దొరస్వామి నాయుడు (జి.డి. నాయుడు) భారతదేశపు సాంకేతిక రంగానికి ప్రేరణాత్మకమైన వ్యక్తి. ఆయన అనేక ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానంలో చేసిన ప్రయోగాలు, పరిశ్రమల అభివృద్ధికి చేసిన కృషి కారణంగా "భారతదేశపు ఎడిసన్" అనే బిరుదును పొందారు.

**తొలినాళ్లు...** 1904 మార్చి 23న తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జన్మించిన నాయుడు, ఒక సాధారణ కుటుంబానికి చెందినవారు. చిన్నప్పటినుంచే సాంకేతికత పట్ల ఆయనకు ఆసక్తి ఉండేది. ఆయన అధికారిక విద్యను మూడవ తరగతి వరకు మాత్రమే కొనసాగించారు. కానీ, సాంకేతికతను స్వయంగా అధ్యయనం చేయడం ద్వారా పరిశోధనలు ప్రారంభించారు. ఆయన తన సాధారణ జీవన శైలిని మార్చి పెద్ద ఆవిష్కర్తగా ఎదిగారు.

**ప్రముఖ ఆవిష్కరణలు...** జి.డి. నాయుడు అనేక రంగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన చేసిన కొన్ని ప్రముఖ ఆవిష్కరణలు:

**విద్యుత్ మోటారు:** భారతదేశంలో విద్యుత్ మోటార్లను తయారు చేసిన తొలి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. ఈ ఆవిష్కరణ పరిశ్రమలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పాదకతను అందించింది.

**ఎలక్ట్రిక్ వాహనాలు:** నాయుడు భారతదేశంలో తొలి ఎలక్ట్రిక్ కారును రూపొందించారు, ఇది స్వదేశీ టెక్నాలజీకి అద్భుతమైన నిదర్శనంగా నిలిచింది.

**రైసింగ్ మోటార్స్:** ఆయన స్థాపించిన రైసింగ్ మోటార్స్ కంపెనీ విద్యుత్ పరికరాలు, మోటార్లు, జనరేటర్లు తయారీలో అగ్రగామిగా నిలిచింది.

**గృహోపకరణాలు:** సాధారణ ప్రజల కోసం అనేక ఉపయోగకరమైన గృహోపకరణాలను తయారు చేశారు.

**కెమెరాల రూపకల్పన:** సినిమాటోగ్రఫీ, ఫొటోగ్రఫీ రంగాల్లో నాయుడు తయారు చేసిన కెమెరాలు అత్యున్నత ప్రమాణాలను చేరుకున్నాయి.

**పరిశోధనల ప్రోత్సాహం:** జి.డి. నాయుడు విద్యారంగానికి మరింత ప్రాధాన్యం ఇచ్చారు. కోయంబత్తూరులో స్థాపించిన జి.డి. నాయుడు రీసెర్చ్ లాబొరేటరీ సాంకేతిక పరిజ్ఞానంలో కీలకంగా మారింది. యువ శాస్త్రవేత్తలకు, ఇంజనీరింగ్ విద్యార్థులకు అనేక అవకాశాలను కల్పించారు.

**సంఘసేవ:** పారిశ్రామికవేత్తగా సంపాదించిన ఆదాయాన్ని నాయుడు ప్రజల సేవకు వినియోగించారు. పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించారు.

కోయంబత్తూరులో ఒక ఇంజనీరింగ్ కళాశాల స్థాపించారు, ఇది నేటికీ సాంకేతికతకు ప్రాముఖ్యతనిచ్చే కేంద్రంగా ఉంది. పేద ప్రజల కోసం సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

**గౌరవాలు:** జి.డి. నాయుడు చేసిన కృషి భారతదేశం లోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. సాంకేతిక ఆవిష్కరణలపై ఆయన చూపిన దృష్టి, శ్రద్ధకు అనేక గౌరవాలు లభించాయి.

ఆయనకు "భారతదేశపు ఎడిసన్" అనే బిరుదు ఇచ్చి ప్రపంచం గుర్తించింది. జి. డి. నాయుడు జనవరి 4, 1974న మరణించారు. గోపాలస్వామి దొరస్వామి నాయుడు జీవిత చరిత్ర ప్రతి వ్యక్తికి సూర్తేనిచ్చే పాఠంగా ఉంటుంది. ఆయన కృషి, ఆవిష్కరణలు భారతదేశ సాంకేతిక రంగానికి ప్రగతిపథం చూపించాయి.

తన సరళత, సేవామూర్తిగా వ్యవహరించడం, సాంకేతికతపై ఉన్న అంకితభావం కారణంగా ఆయన పేరు శాశ్వతంగా చిరస్మరణీయంగా ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# మానవ మనస్సు అంతర్భాగం: హిప్నాటిజం శాస్త్రీయ ప్రయాణం

## మనో విజ్ఞానంలో కీలక అధ్యాయం: హిప్నాటిజం - జనవరి 4... ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా మానవ మనస్సు శక్తిపై శాస్త్రీయ అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ హిప్నాటిజం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనిషి ఆలోచనలు, భావాలు, ప్రవర్తనల వెనుక పనిచేసే అవచేతన శక్తిని గుర్తించి, దాన్ని సానుకూల మార్పులకు వినియోగించు కోవచ్చనే భావనను సమాజానికి చేర వేయడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. సాధారణంగా హిప్నాటిజం అంటే మాయాజాలం, వశీకరణ, లేదా వేదికలపై చేసే వినోద కార్యక్రమాలుగా ప్రజల్లో అపోహలు ఉన్నాయి. అయితే ఆధునిక మానసిక శాస్త్రం స్పష్టంగా నిర్ధారించిన వాస్తవం ఏమిటంటేహిప్నాటిజం అనేది పూర్తిగా శాస్త్రీయమైన మానసిక స్థితి, ఇందులో వ్యక్తి అప్రమత్తంగానే ఉండి, అత్యంత ఏకాగ్రతతో తన అవచేతన మనస్సుపై దృష్టి కేంద్రీకరిస్తాడు. హిప్నాటిజం చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే, ఇది ఆధునిక కాలానికి చెందిన ప్రక్రియ మాత్రమే కాదని తెలుస్తుంది. భారతీయ యోగ, ధ్యాన సంప్రదాయాల్లో కనిపించే ధారణ, ధ్యానం, సమాధి వంటి భావనలు హిప్నాటిక్ స్థితికి సమీపంగా ఉంటాయి. ఉపనిషత్తులు, యోగసూత్రాలు మనస్సు నియంత్రణ ద్వారా శరీర%--%మనో సమతుల్యత సాధించవచ్చని పేర్కొన్నాయి. ప్రాచీన ఈజిప్టు నాగరికతలో దేవాలయాల్లో 'స్లీప్ టెంపుల్స్' అనే విధానం ద్వారా మానసిక, శారీరక సమస్యలకు చికిత్స చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. గ్రీకు వైద్యుడు హిపోక్రటీస్ కూడా మనస్సు ఆరోగ్యం శరీర ఆరోగ్యానికి కీలకమని వివరించాడు. ఆధునిక హిప్నాటిజానికి పునాది వేసినవారిగా 18వ శతాబ్దానికి చెందిన ఫ్రాంజ్ ఆంటన్ మెస్మర్ పేరు ప్రాధాన్యంగా చెప్పుకోవాలి. ఆయన ప్రతిపాదించిన 'మెస్మరిజం' సిద్ధాంతం తొలుత వివాదాస్పదమైనప్పటికీ, తదుపరి కాలంలో శాస్త్రీయ పరిశోధనలకు దారి చూపింది. 19వ శతాబ్దం చివరి నాటికి హిప్నాటిజం వైద్య, మానసిక శాస్త్ర రంగాల్లో అధ్యయన అంశంగా మారింది. సిగ్మండ్ ఫ్రాయిడ్ తన ప్రారంభ దశలో హిప్నాసిస్‌ను ఉపయోగించి మానవ అవచేతనాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. తరువాత కాలంలో క్లినికల్ సైకాలజీ, న్యూరోసైన్స్ రంగాల్లో జరిగిన పరిశోధనలు హిప్నాటిక్ స్థితిలో మెదడులో జరిగే మార్పులను స్పష్టంగా నిరూపించాయి. మెదడు తరంగాల్లో ఆలా?ఫ, థీటా తరంగాలు పెరగడం, ఒత్తిడి హార్మోన్లు తగ్గడం వంటి అంశాలు ప్రయోగాల ద్వారా వెల్లడయ్యాయి. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ ప్రకారం, సాధారణ జనాభాలో సుమారు 10 నుంచి 15 శాతం మంది హిప్నాటిజానికి అత్యంత స్పందన చూపిస్తే, 60 నుంచి 70 శాతం మంది మోస్తరు స్థాయిలో స్పందిస్తారు. ఆధునిక వైద్యరంగంలో హిప్నాటిజం ఒక సహాయక చికిత్సా పద్ధతిగా గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాలు దీర్ఘకాలిక నొప్పి నియంత్రణలో హిప్నోథెరపీ 30 నుంచి 50 శాతం వరకు ఉపశమనాన్ని ఇస్తుందని సూచిస్తున్నాయి. పొగత్రాగడం మానేయడంలో, బరువు నియంత్రణలో, ఆందోళన రుగ్మతలు, భయాలు, నిద్రలేమి వంటి సమస్యల్లో హిప్నాటిజం ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని యూరోపియన్ దేశాల్లో దంత చికిత్సల సమయంలో నొప్పి నివారణకు హిప్నాటిక్ పద్ధతులు వినియోగిస్తున్నారు. అమెరికాలో ప్రతి సంవత్సరం వేలాది మంది లైసెన్స్ పొందిన హిప్నోథెరపిస్టుల ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం సందరేగా ప్రధానంగా చెప్పాల్సిన అంశయహిప్నాటిజం ద్వారా వ్యక్తి తన నియంత్రణ కోల్పోతాడన్న భ్రమ పూర్తిగా తప్పు. హిప్నాటిక్ స్థితిలో ఉన్న వ్యక్తి తన విలువలకు, నైతికతకు విరుద్ధమైన పనులు చేయడు. ఇది బలవంతపు ప్రక్రియ కాదుబీ పరస్పర సహకారంపై ఆధారపడిన మానసిక విధానం. హిప్నోటిస్ట్ సూచనలు ఇస్తాడు కానీ వాటిని అంగీకరించాలా వద్దా అన్న నిర?యం వ్యక్తిదే. అందుకే శాస్త్రీయ హిప్నాటిజాన్ని వినోద ప్రదర్శనలతో సమానంగా చూడటం తగదు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య నిపుణులు హిప్నాటిజం ఉపయోగాలు, పరిమితులు, నైతిక ప్రమాణాలపై ప్రజలకు వివరిస్తారు. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యల నేపథ్యంలో అవచేతన శక్తిని సానుకూలంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. భారతదేశంలో హిప్నాటిజంపై ఆసక్తి క్రమంగా పెరుగుతున్నా, సరైన నియంత్రణ, శాస్త్రీయ అవగాహన లోపిస్తున్నాయి. అర్హత లేని వ్యక్తులు చేసే ప్రదర్శనలు హిప్నాటిజంపై అపోహలను మరింత బలపరుస్తున్నాయి. అందుకే హిప్నాటిజాన్ని వైద్య, మానసిక చికిత్సల కోసం వినియోగించేటప్పుడు శిక్షణ పొందిన, లైసెన్స్ ఉన్న నిపుణుల సేవలు తీసుకోవడం అత్యవసరం. ప్రభుత్వం, వైద్య మండళ్లు ఈ రంగంపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం మనిషి అంతర్గత శక్తిని గుర్తు చేసే ఒక ఆలోచనాత్మక సందరే. మనస్సు అనేది కేవలం ఆలోచనల సమాహారం కాదు, అపార సామర్థ్యాల నిలయం. ఆ సామర్థ్యాన్ని భయం లేకుండా, అపోహలు తొలగించి, శాస్త్రీయ దృష్టితో వినియోగించుకుంటే వ్యక్తిగత ఆరోగ్యం మెరుగు పడుతుంది, సమాజం మానసికంగా మరింత బలపడుతుంది. అవచేతనాన్ని అర్థం చేసుకోవడం ద్వారా స్వీయ అవగాహనకు దారి తీసే ఈ ప్రయాణానికి ప్రపంచ హిప్నాటిజం దినోత్సవం ఒక ప్రేరణగా నిలుస్తోంది.


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# చురకలు
## సంపాదకీయం

## కొత్త ఏడాది కొత్త ప్రయోగం.. బీఎండబ్ల్యూ, బెంజ్ ప్లాన్ అదుర్స్!

సాధారణంగా కొన్ని కొన్ని బ్రాండ్స్ కొన్ని కొన్ని ఉత్పత్తులకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఆ బ్రాండ్స్ ఏదైనా ఒక మార్పు తీసుకురావాలని ఆలోచిస్తే మాత్రం అందులో సక్సెస్ అవుతారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతాయి. ఇక అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న బ్రాండ్లు మాత్రం వేరే రంగంలోకి అడుగుపెడితే కచ్చితంగా సక్సెస్ అవుతాయని ఇప్పటికే ఎన్నో సంస్థలు నిరూపించాయి కూడా.. ఉదాహరణకు రిలయన్స్ వంటి సంస్థను మనం తీసుకున్నట్లయితే ఒక్క రంగంలోనే కాకుండా అన్ని రంగాలలో కూడా రిలయన్స్ తమ హస్తం వేసి సత్తా చాటుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న సంస్థగా పేరు సొంతం చేసుకుంది. ఇకపోతే బిఎండబ్ల్యూ, బెంజ్ వంటి లగ్జరీ బ్రాండ్ల విషయానికి వస్తే ముందుగా మనకు కార్లు మాత్రమే గుర్తుకొస్తాయి. పైగా ఈ సంస్థలు కార్లు మాత్రమే అమ్ముతాయని అందరికీ తెలుసు. అయితే ఇప్పుడు కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలు చేస్తూ తమ బ్రాండ్ ను మరింత విస్తరించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయి. తాజాగా కొత్త సంవత్సరం సందరర్గా ఈ బీఎండబ్ల్యూ, బెంజ్ సంస్థలు ఇండియాలో రియల్ ఎస్టేట్ ప్రారంభించబోతున్నాయి. ఇప్పటివరకు రోడ్లపై మెరిసిన ఈ లగ్జరీ కార్ల బ్రాండ్ ఇప్పుడు ఏకంగా భూములపై తమ ముద్ర వేయడానికి సిద్ధం అవుతున్నాయి. తమ కార్లలాగే సంపన్న వర్గాలను ఆకర్షించడానికి ఈ కంపెనీలు బ్రాండెడ్ రెసిడెన్స్ ను నిర్మించేందుకు ఏర్పాటు చేస్తూ ఉండడం గమనార్హం. అంతేకాదు అందుకు తగ్గట్టుగా అడుగులు కూడా వేసాయి. ఇప్పటికే గురుగ్రామ్ లో మెర్సిడెస్ బెంజ్ తన తొలి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు కోసం పలువురు ప్రముఖ డెవలపర్లతో చర్చలు కూడా జరుపుతున్నట్లు సమాచారం. అంతేకాదు దుబాయ్లో మెర్సిడెస్ బెంజ్ ప్లేసెస్ పేరుతో భారీ టవర్లను కూడా ఈ సంస్థ నిర్మిస్తోంది. కేవలం రియల్ ఎస్టేట్ లగ్జరీ ఇల్లు మాత్రమే కాకుండా తమ బ్రాండ్ విలువను ప్రతిబింబించే జీవనశైలిని అందించడమే ఈ ప్రాజెక్టు యొక్క ప్రధాన ఉద్దేశం. ఇకపోతే మెర్సిడెస్ బెంజ్ మాత్రమే కాకుండా బిఎండబ్ల్యూ గ్రూప్ కూడా ఇండియా రియల్ ఎస్టేట్ మార్కెట్ పై దృష్టి సారించింది. 2026 చివరి నాటికి దేశంలో లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది అనే అంచనాలతోనే ఇళ్ల నిర్మాణంలో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా కార్ల తయారీలో తాము పాటించే కచ్చితత్వం, టెక్నాలజీ, ప్రీమియం లుక్ ను ఈ భవనాలలో కూడా చూడవచ్చని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. బిఎండబ్ల్యూ బెంజ్ మాత్రమే కాకుండా ఇటాలియన్ కార్ల దిగ్గజం లంబోర్గిని కూడా ముంబై, చెన్నై వంటి నగరాలలో లగ్జరీ హోమ్స్ నిర్మించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు అటు మార్కెట్ వర్గాలు కూడా చెబుతున్నాయి.. రియల్ ఎస్టేట్ రంగాలు ఒకప్పుడు స్టార్ హోటల్స్ తో మాత్రమే ఒప్పందాలు కలిగి ఉండేవి . అయితే ఇప్పుడు ఆటోమొబైల్ బ్రాండ్లు కూడా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టడంతో ప్రపంచ స్థాయిలో రియల్ ఎస్టేట్ ముఖచిత్రం మారబోతోంది అనే కామెంట్లు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇక మునుముందు రియల్ ఎస్టేట్ కి మరింత డిమాండ్ పెరిగి భూముల విలువలు మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నట్లు సమాచారం.

## విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్ - జనవరి 4... సైన్స్ పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ జయంతి



అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వశాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లోగల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వవిద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచేవారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీ లో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారుచేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, FLUXIONS యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు - ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగిపోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి.

**(1).మొదటి సూత్రము...** "బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము... "ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3).న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది.మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటినుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు. తరువాత కూడా ఎన్నో మైలురాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## అంధులకు సాధికారత పై అవగాహన కల్పించాలి - జనవరి 4.. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం




ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఈ దినోత్సవం బ్రెయిలీ లిపి ద్వారా అంధులకు అందుతున్న విద్య, సమాచారానికి గౌరవం చాటడమే కాకుండా, దృష్టి లోపం ఉన్న వ్యక్తుల హక్కులు, సాధికారతపై అవగాహన పెంచే రోజు. ఈ తేదీ, బ్రెయిలీ లిపిని అభివృద్ధి చేసిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఎంచుకున్నారు.

**బ్రెయిలీ లిపి ... స్పర్శ ద్వారా చదువు...** బ్రెయిలీ అనేది స్పర్శ ఆధారిత లిపి. ఇది దృష్టి లోపం ఉన్న వ్యక్తులు పుస్తకాలు చదవడం, వ్రాయడం, మరియు సమాచారాన్ని స్వీకరించడం చేయడానికి రూపొందించ బడింది.

**లిపి యొక్క ప్రత్యేకతలు...** ఆరు చుక్కల వ్యవస్థ: ప్రతి అక్షరం, సంఖ్య, ప్రత్యేక చిహ్నాన్ని 1-6 మధ్యలో ఉండే చుక్కల సముదాయాల ద్వారా సూచిస్తారు.

స్పర్శ సౌలభ్యం: ఈ చుక్కల పద్ధతిని వేళ్లతో స్పర్శించి అర్థం చేసుకోవడం ద్వారా అంధులు జ్ఞానాన్ని పొంద గలుగుతారు.

వినియోగం: ప్రపంచ వ్యాప్తంగా పుస్తకాలు, పత్రికలు, మరియు డిజిటల్ పరికరాల్లో బ్రెయిలీ అనుసరిస్తారు.

**లూయిస్ బ్రెయిలీ – అంధులకు ఆశాకిరణం...** జీవితం పరిచయం: లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4న ఫ్రాన్స్‌లో జన్మించారు. చిన్నతనంలోనే జరిగిన ప్రమాదంతో ఆయన రెండు కళ్ల చూపును పూర్తిగా కోల్పోయారు. చెడు పరిస్థితుల మధ్య కూడా, విద్యను కలలుగంటూ, అంధుల కోసం ప్రత్యేకమైన లిపిని రూపొందించారు.

**బ్రెయిలీ లిపి ఆవిష్కరణ:** 1824లో, 15 ఏళ్ల వయస్సులోనే బ్రెయిలీ ఈ లిపిని అభివృద్ధి చేశారు. నైట్ రైటింగ్ అనే పద్ధతిని ప్రేరణగా తీసుకుని, దాన్ని అంధుల అవసరాలకు తగినట్లు మార్చి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచారు.

**ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ ప్రాముఖ్యత...** అవగాహన పెంపు: అంధుల హక్కులు, సమస్యలు, వారికి అందించాల్సిన సహాయం వంటి అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చలు జరగడానికి ఈ రోజు వేదికగా నిలుస్తుంది.

**విద్యలో సమానత్వం:** బ్రెయిలీ లిపి ద్వారా అంధులు కూడా సాధారణ వ్యక్తుల మాదిరిగా చదవడం, వ్రాయడం, విజ్ఞానాన్ని పొందడం సాధ్యమవుతోంది.

**సాంకేతికత మరియు బ్రెయిలీ:** ఆధునిక యంత్రాలు, మొబైల్ ఫోన్లు, మరియు కంప్యూటర్లలో బ్రెయిలీ లిపి వినియోగాన్ని పెంపొందించేందుకు వివిధ సాంకేతిక అభివృద్ధులు జరుగుతున్నాయి.

**సమాజంలో సమాన అవకాశాలు:** బ్రెయిలీ లిపి ద్వారా అంధులు ఉపాధి, స్వతంత్ర జీవనానికి అవసరమైన సాధనాలను పొందుతున్నారు.

**మనం ఏమి చేయవచ్చు?**

**బ్రెయిలీ గురించి అవగాహన:** బ్రెయిలీ లిపి ఎలా పనిచేస్తుందో నేర్చుకుని, దాని ప్రాముఖ్యతను ఇతరులకు చెప్పడం.

**అంధులకు సహాయం:** బ్రెయిలీ పుస్తకాలు, పత్రికలు, లేదా డిజిటల్ పరికరాలను అందించేందుకు సహాయ పడడం.

**సాంకేతికతను ఉపయోగించడం:** బ్రెయిలీకి అనుకూలంగా రూపొందించిన పరికరాలను ప్రోత్సహించడం.

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం అనేది బ్రెయిలీ లిపి గొప్పతనాన్ని గుర్తు చేసుకోవడమే కాకుండా, దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సహకారం అందించేందుకు మన బాధ్యతను నెరవేర్చే రోజు. అంధుల స్వతంత్ర జీవితం కోసం, బ్రెయిలీ లిపి ఆకాశమంతటి ఆశను అందించింది. ఈ ఆశను కొనసాగించేందుకు మనందరం కృషి చేద్దాం!

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## భారతీయ నాట్య సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన కోరాడ నరసింహారావు - జనవరి 4...కోరాడ నరసింహారావు వర్ధంతి




కూచిపూడి నాట్యం భారతదేశ ప్రసిద్ధ శాస్త్రీయ నృత్య రీతులలో ఒకటి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృషా? జిల్లా కూచిపూడి గ్రామంలో ఉదవించింది. ఈ నాట్యరూపం ఆధ్యాత్మికత, నాట్యకళ, నాటకరంగం, సంగీతం, అభినయాన్ని సమ్మిళితం చేస్తూ ఒక సంపూర? కళారూపంగా ప్రసిద్ధి చెందింది. కూచిపూడి నాట్యం 16వ శతాబ్దంలో సిద్ధాంతానికి పునాది వేసిన సిద్ధేంద్ర యోగితో ప్రారంభమైంది. ఆయన కూచిపూడి నాట్యానికి దశదిశా చూపించారు. ఇది తొలుత దేవతారాధనకు సంబంధించి గూఢమైన భక్తి భావంతో మధురమైన కథలను చెప్పే పద్ధతిగా అభివృద్ధి చెందింది. కోరాడ నరసింహారావు కూచిపూడి నాట్య ప్రపంచంలో ఒక మరిచి పోలేని మహా వ్యక్తి. నాట్య రంగంలో శ్రద్ధ, నైపుణ్యం, కృషితో ఆయన కూచిపూడి నాట్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషించారు. కూచిపూడి నాట్యం భారతీయ సాంప్రదాయ కళల పటంలో ఒక శ్రేష'మైన స్థానాన్ని పొందడానికి నరసింహారావు గారి కృషి ప్రధాన కారణం.

**జీవితం, కళా ప్రస్థానం...**

**బాల్యం మరియు శిక్షణ:** కోరాడ నరసింహారావు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని పవర్‌పేట ప్రాంతంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయన నాట్యకళ పట్ల అత్యంత మక్కువ కలిగిన వ్యక్తి. ఆయన లోని నాట్య నైపుణ్యాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, ప్రముఖ కూచిపూడి గురువులైన వేదాంతం వెంకట నాగచలపతి వద్ద శాస్త్రీయ నృత్య శిక్షణ కోసం ప్రోత్సహించారు.

**కళాకారుడిగా ఎదుగుదల:** తన గురువు వద్ద నాట్య శిక్షణ తీసుకున్న నరసింహారావు, కూచిపూడి నాట్యంలో అదుతేమైన అభినయంతో, నాటకా త్మకతతో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు. ఆయన ప్రదర్శనలు కేవలం భారతదేశం లోనే కాకుండా ప్రపంచం లోని అనేక దేశాల్లో ప్రేక్షకులను కట్టిపడేశాయి.

**గురువుగా మార్పు:** కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, నరసింహారావు తన శ్రేష'మైన నాట్య ప్రావీణ్యాన్ని శిష్యులకు అందించారు. ఆయన శిక్షణ పద్ధతులు శాస్త్రీయంగా ఉండటంతో పాటు, భావోద్వేగాలను అవగాహన చేసుకోవడంలో సహాయ పడేవి. ఆయన విద్యార్థులలో అనేకమంది ప్రసిద్ధ నాట్యకారులుగా ఎదిగారు. కోరాడ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రముఖుల సమక్షంలో నాట్యం చేయడమే కాక 23 దేశాల్లో కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. భారతదేశ మొట్టమొదటి మిస్ ఇండియా 'పద్మభూషణ్' ఇంద్రాణి రెహమాన్, పద్మ విభూషణ్ యామిని కృష?మూర్తి, వైజయంతి మాల, రీటా చటర్జీ, గోపీకృష?, హేమమాలిని, శాంతారామ్‌లకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు.

**నాట్యరంగానికి నరసింహారావు కృషి...**

**శిక్షణా మార్గదర్శనం:** నరసింహారావు కూచిపూడి నాట్యం లోని హావభావాలను, కవిత్వ సౌందర్యాన్ని, శాస్త్రీయ మూలాలను విద్యార్థులకు నేర్పుతూ, వారి నైపుణ్యాన్ని మెరుగు పరిచారు.

**ప్రచారం:** ఆయన కూచిపూడి నాట్యాన్ని ప్రపంచంలో గుర్తింపునకు నాంది పలికారు. పలు అంతర్జాతీయ నాట్య సమితులు, కళా వేదికలలో ఆయన ప్రదర్శనలు కూచిపూడికి విశ్వవ్యాప్త గుర్తింపునిచ్చాయి.

**సాహిత్య రచన:** నరసింహారావు కూచిపూడి నాట్య ప్రదర్శనలకు సంబంధించిన అనేక కథలను, సంగీత తాళాలను, నృత్య శైలులను పునరావిష్కరించారు. ఈ రచనలు నాట్యకారులకు, పరిశోధకులకు ఒక మైలురాయి అయ్యాయి.

**సాంప్రదాయానికి నవీనత:** కూచిపూడి నాట్యాన్ని ఆధునిక యుగానికి అనుగుణంగా మార్చడంలో ఆయన చేసిన ప్రయోగాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. సాంప్రదాయ శైలిలో ఆధునిక భావాలను చేర్చడంలో ఆయన ముందంజలో ఉన్నారు.

**ప్రధాన కృషి...** భామాకలాపం: నాట్యంలో సత్యభామ పాత్రను ఆయన పునఃరూపకల్పన చేసి, కళాత్మకతతో నింపారు.

**గజేంద్ర మోక్షం:** ఈ నాట్యంలో భావోద్వేగ ప్రదర్శన ద్వారా ప్రేక్షకుల మనస్సులో ఆయన చెరగని ముద్ర వేశారు.

**రాధా కృష లీలలు:** కృషు?ని జీవితంలోని మధుర క్షణాలను కూచిపూడి నాట్య రూపంలో ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు పొందారు.

**పురస్కారాలు, గౌరవాలు... పద్మశ్రీ అవార్డు:** భారత ప్రభుత్వం నాట్య రంగానికి ఆయన చేసిన సేవలను గౌరవించి ఈ ప్రతిష'త్మక పురస్కారాన్ని అందజేసింది. సంగీత నాటక అకాడమీ అవార్డు: నాట్య కళకు చేసిన విశేష కృషికి ఈ అవార్డు అందుకున్నారు. కళారత్న: ఆయన జీవితకాల సాఫల్యాన్ని గౌరవిస్తూ ఈ బహుమతి ప్రదానం చేశారు.

**నరసింహారావు ప్రత్యేకతలు...**

**శాస్త్రీయత:** నాట్యంలోని శాస్త్రీయ తత్వాలను ప్రతిరూపింపజేసే విధంగా ఆయన శిక్షణ ఇచ్చారు.

**సమర్పణ:** కూచిపూడి నాట్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం కోసం చేసిన నిరంతర కృషి.

**వారసత్వ నిర్మాణం:** అనేకమంది విద్యార్థులను ప్రపంచస్థాయి నాట్యకారులుగా తీర్చిదిద్దారు కోరాడ నరసింహారావు కూచిపూడి నాట్యకళకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన ప్రేరణ, కృషి, నాట్యానుభవం కేవలం కూచిపూడి నాట్యకారులకు మాత్రమే కాదు, భారతీయ సాంప్రదాయ కళారంగానికే స్ఫూర్తిగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు



## నూతన ఏడాది.. భవితకు వేద్దాం పునాది

మిర్యాలగూడ : మానవాళి ప్రకృతి నియమాలు పాటిస్తే సకల జీవజాతి మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లదని ఆధ్యాత్మిక సూత్రం చెబుతోంది. ఈ ఆధునిక రోజుల్లో ఈ సూత్రాన్ని ఎక్కడో ఒకచోట్ల మినహా మిగతా అంతా పూర్తిగా విస్మరించారు. అటు రైతులు, ఇటు మహిళల్లో మార్పు వస్తేనే మళ్లీ ప్రకృతిని కాపాడుకోవడం సాధ్యం. వీళ్లే యువత, చిన్నారులకు మళ్లీ పాత పాఠాలు చెప్పాలి. నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా ప్రతి ఒక్కరు పర్యావరణానికి మేలు చేసేలా సంకల్పం తీసుకుందాం.

**ప్రకృతికి బహుమతులివ్వాలి..**

ఈ రోజుల్లో ఏ మంచి పని తలపెట్టాలన్నా మహిళా శక్తి అవసరమైంది. మహిళలు సంఘాల పేరుతో పొదుపు మంత్రం పాటించినట్టే భావి తరాలకు జీవం పోసే తల్లులుగా అవతరించాలి. అన్ని కాలాల్లో ఇంటి పెరట్లో కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచాలి. వాటి ఫలాలూ



సేంద్రియపూరితంగానే ఉండాలి. వాడిన తర్వాత భూమిలో కలిసిపోయేదైతేనే ఇంటికి తీసుకురావాలి.

**సేంద్రియ వ్యవసాయమే మేలు..**

ఉమ్మడి జిల్లా లో సుమారు 11 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో పంటల్ని సాగు చేస్తున్నారు. వరి, పత్తి, మిరప తోటల్లో అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువుల్ని అవసరానికి మించి ఎక్కువ వాడుతున్నారు. ఈ ప్రభావం వల్ల భూమి కలుషితమై భూసారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణం కాలుష్యం సైతం పెరుగుతుంది. సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి.

**పిల్లలూ.. మీరే భావి ప్రకృతి ప్రేమికులు..**

పిల్లలకు పండగొచ్చిందంటే వారి ఆనందానికి హద్దులుండవు. పుట్టిన రోజులు, పండగ రోజుల్లో అదే ఆనందంతో స్కూలు, ఇళ్లలో మొక్కలు పెంచాలి. ఇలా ప్రతి ఇంటా మొక్కలనే ముద్దొచ్చే బిడ్డలుగా ప్రకృతి ఒడిలో నాటాలి. సంతోషాన్ని జీవితాంతం పంచుకోవాలి.

## ఆర్పీలకు వేతన వెతలు

సూర్యాపేట : పురపాలికల్లోని మహిళలకు ప్రభుత్వ పథకాల అమలులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల్లో పనిచేస్తున్న ఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లదే కీలకపాత్ర. మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించాలన్నా..ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చాలన్నా.. వీరి చొరవ అవసరం. ఇలా కీలకంగా వ్యవహరిస్తున్న ఆర్పీలకు నాలుగు నెలలుగా వేతనాలు అందలేదు. ఇచ్చేదే తక్కువ, అది కూడా నెలనెలా అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పెండింగ్ వేతనాలు ఇప్పించాలని మెప్మా అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదు.



**నాలుగు నెలలు.. రూ.1.32 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల పరిధిలో 552 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పనిచేస్తున్నారు. 20 నుంచి 25 గ్రూపులకు ఓ సమాఖ్య ఉంటుంది. సమాఖ్య కింద ఆర్పీ పని చేస్తారు. మహిళా సంఘాల సమావేశాల నిర్వహణ, పుస్తకాలు రాయడం, రుణాలు ఇప్పించటం, తిరిగి రుణ వాయిదాలు చెల్లించేలా చూడటం వీరి బాధ్యత. మహిళా సమాఖ్య, మెప్మాకు మధ్య వారధిగా నిలుస్తారు. వీరికి నెలకు రూ.6వేల వేతనం చెల్లిస్తారు. ఈ వేతనాలను మహిళా సమాఖ్య ఖాతాలో జమ చేసిన తర్వాత తీసుకుంటారు. దీంతోపాటు సమాఖ్య లాభాల్లో ఉంటే నెలకు రూ.2వేలు అదనంగా వేతనం తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో 552 మందికి ఆగస్టు నుంచి నవంబరు వరకు వేతనాలు రావడం లేదు. ఒక్కో ఆర్పీకి నాలుగు నెలలకు రూ.24 వేలు రావాల్సి ఉంది. ఈ లెక్కన మొత్తం రూ.1,32,48,000 వేతనం చెల్లించాలి. వేతనాల విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని మెప్మా జిల్లా ఇన్‌ఛార్జీ పీడీ హన్మంతరెడ్డికు తెలిపారు.

## 'గుట్ట'క్కున మింగేస్తున్నారు!

అశ్వారావుపేట : మట్టి తవ్వకాలు యథేఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు మిన్నకుంటున్నారు. విలువైన మట్టి ప్రైవేటు వ్యక్తులపాలవుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అశ్వారావుపేట మండలంలో కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతంలో పట్టపగలు మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. రాత్రి సమయాల్లోనే కాదు పగలు సైతం అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. నాలుగు రోజులుగా అశ్వారావుపేటకు చెందిన ఒక పొక్లెయిన్ యజమాని రామన్నగూడెం సమీపంలోని గుట్ట వద్ద తవ్వకాలు జరిపి వందల సంఖ్యల ట్రక్కుల్లో గ్రావెల్‌ను మండల కేంద్రానికి తరలిస్తున్నారు. అనంతారం, వినాయకపురం, నారాయణపురం, అల్లిగూడెం, నారంవారిగూడెం, తిరుమలకుంటలో ఎర్రమట్టి, గ్రావెల్ తవ్వకాలు ప్రతిరోజూ జరుగుతున్నాయి. నిఘా పెడుతున్నామని అధికారులు చెప్పటం మినహా క్షేత్రస్థాయిలో అక్రమార్కులను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

సాధారణంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే గనులు, రెవెన్యూశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. తవ్వకాలు చేపట్టే ప్రాంతాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలి. ఎంత లోతు తవ్వాలి, ఎన్ని ఘనపు అడుగుల మేరం తవ్వకాలు చేపట్టవచ్చు అనేది నిర్ధారిస్తారు. ఆ మేరకు రుసుము కట్టిస్తారు. తరువాతే తవ్వకాలకు అనుమతిస్తారు. కానీ ఇక్కడ అలాంటివేమీ లేకుండా పొక్లెయిన్లు ఏర్పాటు చేసి మరీ వందలాది ట్రాక్టర్లలో మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ట్రక్కు గ్రావెల్, మట్టిని రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు విక్రయించి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు.అనధికార గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. నిఘాను బలోపేతం చేస్తాం. కేసులు నమోదు చేసి అక్రమ దందాను అడ్డుకుంటాం.

రామకృష?, తహసీల్దార్, అశ్వారావుపేట

# మేడారం మెరిసేలా..



తాడ్వాయి : వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దశాబ్దాల క్రితం నాటి ఈ ప్రాంగణ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.101 కోట్లు మంజూరు చేయగా రోడ్లు, భవనాల శాఖ అక్టోబరు మొదటివారంలో పనులు ప్రారంభించింది. ప్రస్తుతం మహాజాతర సమీపిస్తుండటం, ఇప్పటికే భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. జనవరి 5 నాటికి పనులన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

**రెండు రోజుల్లో పూర్తి**

గత నెల 24న పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల నిర్మాణం పూర్తి చేసిన సంగతి తెలిసిందే. సమ్మక్క, సారలమ్మ గద్దెలను యథావిధిగా కొనసాగిస్తూ మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. సారలమ్మ గద్దె పనులు తుదిదశకు చేరగా, సమ్మక్క గద్దె పనులే కొనసాగుతున్నాయి. వీటి చుట్టూ గ్రిల్స్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి.

**రాతి స్తంభాల్ని నిలబెట్టి..**ప్రాంగణానికి ఎనిమిది ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా 16 రాతి పిల్లర్లను నిలబెట్టారు. 49 చిన్న పిల్లర్లు వీటి మధ్యలో 48 ప్యానళ్లు అమర్చుతున్నారు. చిన్న పిల్లర్లపై బీములు అమర్చే పనులు ప్రారంభించారు. ఈ పనులు కూడా ఈనెల 5 నాటికి పూర్తయ్యేలా ప్రణాళికతో సాగుతున్నారు. గద్దెల ప్రాంగణంలో గతంలో ఉన్న ఫ్లోరింగ్ వల్ల వేసవిలో ప్రాంగణంలో కాలుపెట్టాలంటేనే భక్తులు, అధికారులు జంకేవారు. పునర్నిర్మాణంలో భాగంగా ఎండ వేడిని గ్రహించి భూమిలోకి పంపే నాపరాళ్లను ఇక్కడ పరుస్తున్నారు. నేటితో ఫ్లోరింగ్ పని పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**త్వరలో ముఖ్యమంత్రి రాక?**

గద్దెల పునర్నిర్మాణం పనులు పూర్తయిన వెంటనే మేడారానికి రావాలనే ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు తెలిసింది. యంత్రాంగం జనవరి 5 నాటికి పూర్తి చేస్తే 6 లేదా 10న ముఖ్యమంత్రి పర్యటన ఉండే అవకాశముందని అధికారులు చర్చించుకొంటున్నారు.

**16 అడుగుల వెడల్పుతో..**

రెండు దశాబ్దాల క్రితం గద్దెల చుట్టూ వెదురుబొంగులతోనే రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసేవారు. ఈ ప్రాంగణం చుట్టూ జాతరకు వచ్చిన ఎడ్లబండ్లు, భక్తులు ప్రదక్షిణలు చేసేవాళ్లు. కాలక్రమేణా ప్రాంగణం చుట్టూ వివిధ రకాల నిర్మాణాలు చేపట్టడంతో ఆ అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రాంగణం చుట్టూ ఎంతో సౌకర్యవంతమైన 16 అడుగుల వెడల్పుతో సిమెంటు రహదారి నిర్మించారు.

## మెరుగైన విద్య.. ఉత్తమ ఫలితాలు



ములుగు : విద్యాశాఖలో ఈ ఏడాది శుభ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇంటర్మీడియట్ హాజరు శాతం పెంచేందుకు ముఖ గుర్తింపు హాజరు విధానం.. జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరయ్యేలా ముఖ గుర్తింపు హాజరు సతాలీతాలిచ్చాయి. ఇంటర్మీడియట్, పదో తరగతి, ఎంబీబీఎస్ వార్షిక పరీక్షల్లో 2025లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్రంలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి భేష్ అనిపించుకుంది. పదో తరగతి వార్షిక పరీక్షల్లో గతంలో 13వ స్థానంలో ఉన్న ములుగు జిల్లా ఎనిమిదో స్థానానికి చేరుకుంది. గతంలో ఎప్పుడు లేని విధంగా జూనియర్ కళాశాలకు సుమారు రూ.కోటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో తాత్కాలిక మరమ్మతులు, ఇతర అవసరాలకు ఉపయోగించారు.

**గిరిజన యూనివర్సిటీకి కొత్త రూపు**

ములుగులో సుమారు రూ.900 కోట్లతో ప్రారంభించిన గిరిజన యూనివర్సిటీకి కొత్త వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించారు. రూ.20 కోట్లతో యూనివర్సిటీకి కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. బీఏ ఇంగ్లిష్ ఆనర్స్, బీఏ ఎకనామిక్స్ కోర్సులను ప్రారంభించిన మొదటి సంవత్సరంలో ప్రవేశాలు తక్కువగా ఉన్నప్పటికీ 2025లో పెరిగాయి. వైస్ ఛాన్సలర్ వైఎల్ శ్రీనివాస్ నియామకంతో కొత్త కోర్సులకు రూపకల్పన చేస్తున్నారు. దీంతో పాటు సమ్మక్క–సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి నూతన లోగోను తయారు చేసి కేంద్ర మంత్రి ఆవిష్కరించారు.

**ఉచిత విద్యుత్తు సౌకర్యం..**

జిల్లాలోని 356 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించింది. దీంతో పాఠశాలలకు విద్యుత్తు భారం తగ్గింది. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 10 కొత్త పాఠశాలలను ప్రారంభించారు. ములుగు మండలంలో 3, ఏటూరునాగారం 3, వెంకటాపూర్‌లో 4 నాలుగు పాఠశాలలు నూతనంగా ప్రారంభమయ్యాయి. మూతపడిన 5 పాఠశాలలను మళ్లీ తెరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా ఐఐటీ, జేఈఈ, తదితర కోర్సుల్లో శిక్షణ ప్రారంభించారు. జిల్లాలో 8 ప్రి ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట ప్రారంభించిన మెడికల్ కళాశాలకు 2025 విద్యా సంవత్సరానికి శాశ్వత ప్రిన్సిపల్‌ను నియమించారు. రెండో ఏడాది మరో 50 మంది విద్యార్థులు కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. విద్యార్థులకు కళాశాల నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(టీచింగ్ ఆసుపత్రికి)కి వెళ్లేందుకు ప్రత్యేక బస్సును కొనుగోలు చేసి కేటాయించారు.

## సర్పంచుల్లో ఉత్సాహం.. చెక్ పవర్ ఆలస్యం

జనగామ : గ్రామ పంచాయతీల్లో రెండేళ్ల తర్వాత కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. సర్పంచి, ఉప సర్పంచులు బాధ్యతలు స్వీకరించారు. అయితే వారికి చెక్ పవర్ రావడానికి మరికొన్ని రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి పేర్లతో జాయింట్ చెక్ పవర్ ఇచ్చింది. ఆ అధికారాన్ని ప్రస్తుతం సర్పంచి, ఉప సర్పంచి పేరిటా బదిలీ చేయాలి. పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులను అభివృద్ధి పనులు ఇతరత్రా ఖర్చులకు డ్రా చేయాలంటే వారి సంతకాలు, ఆధార్, పాన్‌కార్డు ఫోన్ నంబర్, వేలిముద్ర వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఆదేశాలు రాకపోవడంతో ఈ ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల ఇలా..

కేంద్ర ప్రభుత్వం పంచాయతీ ఖాతాల్లోకి నేరుగా నిధులు విడుదల చేస్తోంది. ప్రతి మూడు లేదా ఆరు నెలలకోసారి అవి అందుతాయి. ఈ ఆర్థిక లావాదేవీల నిర్వహణకు కేంద్రం పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీఎఫ్ఎంఎస్) అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సర్పంచి, ఉప సర్పంచి వేలిముద్రల ఆధారంగా డిజిటల్ కీ తయారు చేస్తారు. ఆ కీని ఉపయోగించి పనులు చేసిన వారి బ్యాంకు ఖాతాల్లోకి నిధులను నేరుగా చెల్లించే సదుపాయం ఉంది. గతంలో డిజిటల్ కీ తయారీ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. ప్రస్తుతం కీ బాధ్యతను ఏజెన్సీ అప్పగిస్తారా లేక డీపీఎం, ఈ పంచాయతీ ఆపరేటర్ల ద్వారా చేస్తారా? అనేది స్పష్టత లేదు.




జిల్లా: జనగామ

సర్పంచులు: 280

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విధంగా..

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నెలనెలా నిధులను విడుదల చేయాలి. వీటిని డ్రా చేయడానికి ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐఎఫ్ఎంఎస్) అమల్లో ఉంది. నిధులను డ్రా చేయడానికి డిజిటల్ కీ అవసరం లేకపోయినా.. గ్రామ పంచాయతీ కార్యదర్శి చెక్ రాసి.. సర్పంచి, ఉప సర్పంచి సంతకాలను ట్రెజరీ అధికారులకు పంపాల్సి ఉంటుంది. డిజిటల్ సంతకాలు సక్రమంగా ఉంటే బిల్లు పాసు అవుతుంది. ఆదేశాలు రాలేదు.. – ఎన్ వసంత, జిల్లా పంచాయతీ అధికారిణి(ఎఫ్ఏసీ) పంచాయతీల్లో చెక్ పవర్ సర్పంచి. ఉప సర్పంచి పేరిట బదిలీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పీఎఫ్ఎంఎస్, సంబంధించిన డిజిటల్ కీ తయారికి చర్యలు తీసుకుంటాం.

## డబ్లింగ్ పనులు చకచకా..!

రామాయంపేట: ఏళ్లుగా ఎదురుచూస్తున్న మేడ్చల్–ముద్కేడ్ రైల్వే డబ్లింగ్ పనులు జిల్లాలో జరుగుతున్నాయి. దీంతో పాటు మహబూబ్‌నగర్–డోన్ ప్రాజెక్టులకు కలిపి 2023లో కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ రూ.5,655.4 కోట్లను డబ్లింగ్, విద్యుత్తు లైన్ పనుల కోసం మంజూరు చేసింది. ఇందులో 60 శాతానికి పైగా నిధులు మేడ్చల్–ముద్కేడ్ మార్గానికి వెచ్చించనున్నారు.

**భూసేకరణ పూర్తి**

డబ్లింగ్ పనులకు గతంలోనే భూసేకరణ పూర్తయింది. జిల్లాలో మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి రామాయంపేట మండలం అక్కన్నపేట వరకు మనోహరాబాద్, బ్రహ్మణపల్లి, స్టేషన్‌మాసాయిపేట, శ్రీనివాసనగర్, వడియారం(చేగుంట), మీర్జాపల్లి, అక్కన్నపేట రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం మనోహరాబాద్ నుంచి స్టేషన్‌మాసాయిపేట మార్గంలో అక్కడక్కడ సింగిల్‌ట్రాక్ పక్క నుంచి మట్టి తీస్తూ చదును చేస్తున్నారు.

**సింగిల్‌లైన్‌తో సమస్య**

ప్రస్తుతం సింగిల్‌లైన్‌తో ఉండటంతో రైళ్లు నిత్యం ఆలస్యం అవుతున్నాయి. సికింద్రాబాద్, కాచిగూడ నుంచి నిజామాబాద్, నాందేడ్, ముద్కేడ్, నాగర్‌సోల్, గుజరాత్, జైపూర్, హరియాణా తదితర చోట్లకు నిత్యం 40 వరకు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటితో పాటు అదనంగా మరో ఐదు గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తున్నప్పుడు ప్యాసింజర్లను స్టేషన్లలోనే గంట పాటు



కూడా నిలిపివేస్తున్నారు. రెండు లైన్లుంటే ఎలాంటి సమస్యలుండవు. జిల్లాలో వడియారం స్టేషన్‌లోనే ఒక్కోసారి మూడు రైళ్లు క్రాసింగ్ కోసం నిలిపివేస్తుంటారు. దీనివల్ల ప్రయాణికులు సమయానికి గమ్యస్థానానికి చేరుకోలేకపోతున్నారు.

**ఎంఎంటీఎస్ పొడిగించే అవకాశం**వాస్తవానికి 2024 మార్చి వరకే పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఈ మార్గంలో నిజామాబాద్ జిల్లా నవీపేట నుంచి నిర్మల్ జిల్లా బాసర మధ్యలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. జిల్లాలో కూడా వేగంగా చేపడితే త్వరగా పూర్తవుతుంది. ప్రస్తుతం సికింద్రాబాద్, కాచిగూడ నుంచి మేడ్చల్ వరకు వచ్చే ఎంఎంటీఎస్ రైళ్లను వడియారం వరకు పొడిగించే అవకాశం ఉంది. డబ్లింగ్ పనులు జరుగుతున్నందున ప్రస్తుతమున్న రైల్వేట్రాక్ వెంట ఇనుపకంచె ఏర్పాటు చేశారు.

## పరిహారంపై సందిగ్ధం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ప్రమాదంలో మృతిచెందిన 54 మంది కార్మికులు, సిబ్బందికి రూ.కోటి చొప్పున పరిహారం పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ప్రమాదంలో మృతిచెందిన ఒక్కో కుటుంబానికి నిబంధనల ప్రకారం రూ.42 లక్షల చొప్పున అందించామని రెండు రోజుల కిందట పరిశ్రమ ప్రతినిధులు ప్రకటించారు. మిగిలిన పరిహారం ప్రభుత్వం అందించాలని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీంతో ఒక్కో బాధిత కుటుంబానికి రూ.58 లక్షల పంపిణీపై సందిగ్ధం నెలకొంది.

**ప్రమాద సమయంలో..**

గతేడాది జూన్30వ తేదీన సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో డ్రయ్యర్ పేలి 46 మంది కార్మికులు మృతిచెందగా.. మరో ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. ఇటీవలే ఆచూకీ లభించని కార్మికుల మరణ ధ్రువీకరణ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతిచెందినట్లు నిర్ధారించినట్లయింది. గతేడాది జులై 1వ తేదీన సంఘటన స్థలానికి వచ్చి.. ప్రమాద తీవ్రతను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మృతిచెందిన ఒక్కో కార్మిక కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించే ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. జులై 2వ తేదీన కర్మాగారాన్ని సందర్శించిన సిగాచీ ఇండస్ట్రీస్ ఎండీ అండ్ సీఈవో అమిత్‌రాజ్ సిన్హా బాధితులందరికీ కంపెనీ అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు న్యాయం చేస్తామని ప్రకటించారు. దీంతో పాటు మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని సిగాచీ యజమాన్యం స్టాక్ ఎక్స్ఛేంజీకి లేఖ రాసింది.

**నిర్లక్ష్యమే కారణమని తేల్చిన విచారణ కమిటీలు**

పరిశ్రమలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీతో పాటు సాంకేతిక కమిటీలు తేల్చాయి. ఇటీవల ప్రభుత్వానికి నివేదికలను అందించాయి. బాధితులకు పరిహారం అందించడంలో జరుగుతున్న జాప్యంపై పీపుల్ ఫర్ సైంటిస్ట్ అనే సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త బాబూరావు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది. ఈ విచారణ సందర్భంగానే కర్మాగారం యాజమాన్యం ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.42 లక్షలు అందించామని వెల్లడించింది. మిగిలిన పరిహారం సొమ్ము ప్రభుత్వమే చెల్లించాలని తెలపడంపై బాధిత కుటుంబాలతో పాటు ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఐ.. ప్రత్యేకావసరాలకూ సై!

మంచిర్యాల : అన్నీ సవ్యంగా ఉన్న పిల్లలకు పాఠాలు చెప్పడమే ఉపాధ్యాయులకు కష్టమైన పని.. అలాంటిది బుద్ధిమాంద్యం, అంధ, మూగ, చెవిటి వంటి ప్రత్యేకావసరాల పిల్లలకు బోధన చేయడమంటే ఎంతో ఓపిక ఉండాలి.. విషయం గమనించిన కలెక్టర్ రాజర్షిషా తన నిధులను వెచ్చించి గొప్ప మనసు చాటుకున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) బోధన కోసం రూ.4.90 లక్షల విలువైన పరికరాలు ఇప్పించారు. ఆదిలాబాద్ డైట్ కళాశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో 25 మంది చెవిటి, మూగ, సెరిబ్రల్ పాల్సి, సికిల్‌సెల్, ఎంఆర్, మల్టీ డిజెబులిటీ(ఎండీ) వంటి ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వారి కోసం ఇద్దరు విలీన విద్య రిసోర్సుపర్సన్లు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను కళ్లారా వీక్షించారు. ఏఐ బోధన ఉపయుక్తంగా ఉంటుందని ఈ నెల 12వ తేదీన ఆయా పరికరాలను సమకూర్చారు.ఒకేసారి అందరూ వింటున్నారు..!

ఏఐ పరికరాలు అందుబాటులోకి రావడంతో ఒకేసారి గ్రూప్ హియరింగ్ హెడ్స్‌తో పాఠాలు వింటున్న పిల్లలు..

**బోధన సులువు..**ట్రెస్టిల్, కోబో టాబ్లెట్, ఆర్‌బిట్ రీడర్ 2.0 సెల్, డిజిటల్ స్పీచ్‌ట్రైనర్, గ్రూప్ హియరింగ్ కిట్స్, ఏఏసీ కిట్స్, డిజిటల్ స్పీచ్ థెరపీ పరికరాలు, ల్యాప్‌టాప్, స్కానర్ వంటివి ఏఐ ల్యాబ్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యసన, కమ్యూనికేషన్ సామర్థ్యాల పెంపునకు ఏఐ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతోందని రిసోర్స్‌పర్సన్ పుష్పవేణి చెబుతున్నారు. స్కానర్, ల్యాప్‌టాప్ సాయంతో అంధ విద్యార్థులు తమంతట తామే పాఠాలు వినగల్గుతున్నారని పేర్కొన్నారు.

మార్పు కనిపిస్తోంది.. విజయ, పోషకురాలు, తాటిగూడ

చురకలు



# ముసి ముసి నవ్వేలా.. మూసీ మురిసేలా

హైదరాబాద్ : కొత్త ఏడాదిలో మూసీ నది స్వరూపం మారబోతోంది. సుమారు రూ.5,500కోట్లతో మొదటి దశలో భాగంగా మూసీని అభివృద్ధి చేసేట్లు డీపీఆర్ (పూర్తిస్థాయి అభివ ృద్ధి నివేదిక) రూపుదిద్దుకుంటోంది. నదికి ఇరువైపులా 50మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్‌ను వదిలేసి.. నదీ గరరే నుంచి బఫర్ జోన్ వరకు చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో డిజైన్ల ఖరారు తుది దశలో ఉందని, ఆ పనులు పూర్తవగానే.. డీపీఆర్‌ను విడుదల చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**మీదే ఆలస్యమంటున్నారు..**"మూసీ అభివృద్ధికి నిధులు సమకూర్చేం దుకు ఏడీబీ(ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) సిద్ధంగా ఉంది. డీపీఆర్



ఇవ్వగానే.. నిధులు మంజూరు చేస్తామంటున్నారు. ఆలస్యమంతా కన్సల్టెన్సీ వైపు నుంచే. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రక్రియను తుది దశకు తీసుకొ చ్చాం. మూసీ మొదటి దశకు సంబంధించిన డీపీఆర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం. బాపూఘాట్ త్రివేణి సంగమం వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ఎత్తైన గాంధీ విగ్రహం, చుట్టూ ఆకట్టుకునే నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర?యించింది. వాటి కోసం రక్షణశాఖ నుంచి 95 ఎకరాల భూములను తీసుకోవాల్సి ఉ ంది. సోమవారం రక్షణశాఖ అధికారులు నగరానికి వచ్చి.. మేం అడిగిన భూములను పరిశీలిం చారు."అని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# గుత్తేదారులకు నోటీసులు

గోదావరిఖని : రామగుండం నగరపాలిక ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిరీ?త గడువులోగా పూర్తి చేయని గుత్తేదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. పనులు పూర్తి చేయాలని లేకపోతే సంబంధిత గుత్తేదారులను బ్లాక్‌లిస్టులో చేర్చి భవిష్యత్తులో ఎలాంటి టెండర్లలో పాల్గొనకుండా చర్యలు తీసుకొంటామని స్పష్టం చేస్తున్నారు. మల్కాపూర్ శివారులో జంతు వధశాల అభివృద్ధి పనుల్లో జాప్యం వహిస్తున్న గుత్తేదారుకు మంగళవారం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ నోటీసులు జారీ చేశారు.

రామగుండం నగరపాలక ప్రాంతంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనుల్లో జాప్యానికి గుత్తేదారులు, అధికారుల సమన్వయలోపం కారణంగా భావిస్తున్నారు. జంతువధశాల అభివ ృద్ధిలో భాగంగా గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో రెండు మార్లు ఏర్పాటు చేసిన గ్రిల్స్‌తో పాటు సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో తాజాగా గ్రిల్స్ సిద్ధం చేసినప్పటికీ ఏర్పాటు చేయడంలో జాప్యం నెలకొంటుంది.

'అమృత్' నిధులతో గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లో ఉపరితల మురుగు కాలువ నిర్మాణం చేపట్టిన గుత్తేదారు అర్ధాంతరంగా పనులు ఆపేశారు.



దీంతో కాలువ సమీపంలో నివాసముండే వారు దుర్గంధంతో పాటు కాలువ ఎప్పుడు కూలుతుందో తెలియని భయంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులది ఇదే పరిస్థితి. మార్కండేయకాలనీ ప్రధాన మురుగు కాలువ నిర్మాణ పనులను ఓ గుత్తేదారునకు అప్పగించినప్పటికీ పనులు చేపట్టకపోగా టెండరు రద్దు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సుమారు రూ.2 కోట్లతో హిందూ శ్మశాన వాటిక అభివ ృద్ధికి నగరపాలిక చర్యలు తీసుకున్నప్పటికీ కేవలం రోడ్డు తవ్వి, మట్టి, కంకర పోసి వదిలేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నగరపాలిక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# అఘాయిత్యానికి వెలకట్టారు!

చందుర్తి : మానసిక స్థితి సరిగా లేని మహిళపై అయిదు గురు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడగా కుల పెద్దలు పంచాయితీ నిర్వహించి డబ్బులతో రాజీ కుదిర్చిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ గ్రామానికి చెందిన వివాహిత(30) మానసిక స్థితి సరిగా ఉండదు. భర్త మరో వివాహం చేసుకుని వేరుగా ఉంటుండగా ఆమె గ్రామంలోనే ఒంటరిగా నివసిస్తోంది. ఇటీవల కడుపు నొప్పి, వాంతులు, అనారోగ్యంతో బాధపడగా సమీప బంధువులు చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి



ఆమె నాలుగు నెలల గరరేతో ఉన్నట్లు తెలిపారు. విషయం భర్తకు తెలియడం తో వివాహితను తీవ్రంగా మందలించి ఆరా తీయగా తనపై అఘాయిత్యం చేసిన కొందరి పేర్లు చెప్పింది. తర్వాత ఆమె ఫోన్ కాంటాక్టులోని నంబర్ల ఆధారంగా అయిదుగురు అఘాయిత్యానికి పాల్పడినట్లు అనుమానించారు. ఆమె భర్త కుల పెద్దల దృష్టికి తీసుకెళ్లగా అనుమానితులను పిలిచి వారం రోజుల కిందట పంచాయితీ నిర్వహించారు. వారు రూ.50 వేల చొప్పున రూ.2.50 లక్షలు చెల్లిస్తామని ఒప్పుకొన్నారు. వివాహితకు భర్త కరీంనగర్‌లోని ఆస్పత్రిలో గరవిచ్ఛిత్తి చేయించినట్లు సమాచారం. చందుర్తి పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# పైరసీ వీరులు.. ఖాతాల్లో డబ్బున్న పేదలు!




హైదరాబాద్: బిహార్ రాష్ట్రంలోని పట్నాకు చెందిన అశ్విన్‌కుమార్.. యూట్యూబ్‌లో హ్యాకింగ్ పాఠాలు నేర్చుకుని సర్వర్లను హ్యాక్ చేసి సినిమా విడుదలకు ముందే డౌన్‌లోడ్ చేయడం సంచలనంగా మారింది. కొత్త సినిమా చూడాలనే కిక్‌తో పైరసీకి పాల్పడ్డాడు. వెబ్‌సైట్‌ల నిర్వాహకులు అతడి బ్యాంకు ఖాతాలో రూ.కోటి విలువైన క్రిప్టో కరెన్సీ జమచేశారు. క్రిప్టో ఖాతా పిన్ నంబర్ మరచిపోవటంతో అందులో డబ్బున్నా ఉపయోగించుకోలేని స్థితిలో ఉన్నాడు. గుజరాత్‌కు చెందిన మరో యువకుడి బ్యాంకు ఖాతా ఫ్రీజ్ చేయటంతో రూ.60 లక్షలు వాడుకునే అవకాశం లేకుండా పోయిందని హైదరాబాద్‌కు చెందిన ఓ పోలీసు అధికారి తెలిపారు. ఐ బొమ్మ రవి, తమిళనాడుకు చెందిన సుధాకరన్, పలువురు బిహార్ యువకులు ఇలాగే పైరసీ మాయలో పడి జైలుపాలయ్యారు.

పోటీపడి.. 200-300 మందికి పైగా యువకులు పైరసీ వెబ్‌సైట్లకు సినిమాలు విక్రయిస్తున్నట్టు నగర సైబర్‌క్రైమ్ పోలీసుల అంచనా. గతేడాది 10 మందిని అరెస్ట్ చేశారు. వీరిబ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లున్నా ఖర్చుచేయలేని దుస్థితి. గత కొన్నేళ్లలో కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లను ఉచితంగా చూసేందుకు వెయ్యికిపైగా పైరసీ వెబ్‌సైట్లు వచ్చాయి. వాటిలో ఐ బొమ్మ, బప్పం, తమిళ్‌రాకర్జ్ పోటీపడ్డాయి. థియేటర్లలో కొత్త సినిమాలు రికార్డ్‌చేసి పంపేందుకు కమీషన్ ఆశచూపి వందలాది మందిని ఏజెంట్లుగా మార్చుకున్నారు.

**గుర్తించలేకపోయిన బ్యాంకులు**

ఐ బొమ్మ రవి పక్కాగా పైరసీ నేరాలకు పాల్పడ్డాడు. వి.ప్రహ్లాద్, అంజయ్య, కాళిప్రసాద్‌లను భాగస్వాములుగా మార్చి సప్లయిర్స్ ఇండియా, హాస్పిటల్స్ ఇన్, ఈఆర్ ఇనోటెక్ కంపెనీలు ప్రారంభిం చాడు. అమెరికాలోని విదేశీయులతో కలిసి గెట్టింగ్ అప్ ఎల్ఎల్‌సీ కంపెనీ ముసుగులో పైరసీ సినిమాలతో రూ.కోట్లు కూడబెట్టాడు. బ్యాంకు ఖాతాల్లో రూ.3 కోట్లకు పైగా ఉన్నా... ప్రస్తుతం బెయిల్ ఖర్చులకు ఎదురుచూస్తున్నాడని పోలీసులు చెబుతున్నారు.

# 'మహా' వేగం



హైదరాబాద్ : సరిగ్గా నెల రోజుల్లోనే బ ృహత్ నగరం ఏర్పాటైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో 27 పుర, నగరపాలక సంస్థలు విలీనమయ్యాయి. పురపాలక శాఖను పర్యవేక్షిస్తున్న సీఎం అత్యంత సన్నిహితులతో చర్చించి ఈ అంశాన్ని మంత్రివర్గంలో చేర్చారు.

గతేడాదిలో.. నవంబరు 25న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో 27 శివారు పట్టణ స్థానిక సంస్థల విలీన తీర్మానం

డిసెంబరు 3న ఆర్డినెన్స్ జారీ

9న: డివిజన్ల పునర్విభజన ముసాయిదా విడుదల చేసిన జీహెచ్ఎంసీ

10: వారం గడువుతో ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ

16: డివిజన్ల పునర్విభజనపై చర్చకు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

17: ముగిసిన ఫిర్యాదులు, అభ్యంతరాల గడువు, అప్పటికే పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గడువు పొడిగించిన హైకోర్టు

23: 5,900ల ఫిర్యాదుల పరిశీలన. రాజకీయ పార్టీలు, పౌరసమాజం చేసిన సూచనలు బుట్టదాఖలు. నామమాత్రంగా కొన్ని పరిష్కారం. డివిజన్ల హద్దులు, పేర్లను సవరించి 300 డివిజన్లతో తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసిన జీహెచ్ఎంసీ

25: 12 జోన్లు, 60 సర్కిళ్లుగా జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ జోన్లకు కమిషనర్ల నియామకం, తర్వాత 60 సర్కిల్ కార్యాలయాలకు డిప్యూటీ కమిషనర్ల నియామకం.

సర్కిళ్లలో పారిశుద్ధ్య పర్యవేక్షణ బాధ్యతలను ఇంజినీరింగ్ విభాగానికి అప్పగిస్తూ.. డీఈఈల నియామకం, వారికి సహాయకులుగా ఏఈఈల నియామకాలు.

కేవలం నాలుగు రోజుల వ్యవధిలో సర్కిల్‌కు ఒకరు చొప్పున మెడికల్ అధికారుల నియామకం, పట్టణ ప్రణాళిక విభాగంలో 12 సీపీలు, 60 ఏసీపీల నియామకం.

తాజాగా సహాయ మున్సిపల్ కమిషనర్లు 60 మందికి పోస్టింగులు ఇచ్చారు. వీరు డీసీల కింద పనిచేస్తారు. ఇంజినీరింగ్ విభాగంలోనూ వెంటవెంటనే బదిలీలు చేశారు.

**మూడు కార్పొరేషన్‌ల దిశగా..**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర?న్‌కు సహాయకారిగా ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు జి.స ృజన, వినయ్ క ృషా?రెడ్డిలను నియమించారు. విశాల నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా మార్చి.. ఒక్కోదానికి ఒక్క కమిషనర్ నియామకం త్వరలో జరగనుంది.

**శాస్త్రీయత లేదనిపిస్తోంది**

- కేఎం లక్ష్మణరావు, విశ్రాంత ఆచార్యులు, జేఎన్‌టీయూ

జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ జరగడం మంచి పరిణామం. ఇది శాస్త్రీయంగా జరగాలి. అప్పుడే ప్రణాళిక పరమైన అభివ ృద్ధికి అవకాశం ఉంటుంది. పౌరుల కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేవలం ఓఆర్ఆర్ తరహాలో రాజకీయ, బ్యూరోక్రసీ ద్వారా జరగడం విచారకరం. ఇది భవిష్యత్తులో పలు సమస్యలకు కారణమవు తుంది. కేవలం స్థిరాస్తి ఒక్కటే ప్రామాణికం కాదని ప్రభుత్వాలు గ్రహించాల్సి ఉంటుంది.

# ప్రజా భాగస్వామ్యం.. ప్రగతికి సోపానం



హైదరాబాద్ : కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ నగరవాసులు మారాల్సిన అవసరం ఉంది. విలువైన జలాన్ని వ ృథా చేయొద్దు. ప్రజా రవాణాను వినియోగించి కాలుష్య కట్టడిలో కీలక పాత్ర పోషించాలి. స్వఛ్ నగరంగా మార్చడానికి సహకరించాలి. అందరూ భాగస్వాములు కావాలి.

నీరు వృథా చేస్తే 155313కి కాల్ చేయండి

గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కడైనా తాగునీటి వృథా గమనిస్తే పౌరులు 155313కు ఫోన్ చేయొచ్చు. జలమండలి 'ఎక్స్' ఖాతాలో ఫొటోలతో ట్యాగ్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రతి వేయి లీటర్ల నీటిని శుద్ధి చేసి నగరానికి తరలించడానికి జలమండలి రూ.70-80 వరకు ఖర్చు చేస్తోంది. ప్రజలకు రూ.10కే సరఫరా చేస్తోంది. అంత రాయితీతో ఇస్తున్న నీటిని జాగ్రత్తగా వాడుకోకుండా చాలామంది విచ్చలవిడిగా దుర్వినియోగం చేయడం దురదృష్టకరం.

కృషా?, గోదావరి, మంజీరా, జంటజలాశయాల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి దాదాపు 160-225 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరానికి సరఫరా చేసేందుకు ఏటా రూ.1,200 కోట్లు వరకు కరెంటు బిల్లులకు వెచ్చిస్తోంది. ప్రజల దాహార్తిని తీర్చుతోంది. సుదూరం నుంచి తరలించిన జలం వృథా అవుతోంది.

స్వఛతే.. మన బాధ్యత

గ్రేటర్ పరిధిలో 10 వేల కిలోమీటర్ల రోడ్లుండగా.. రోజూ 17 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు వాటిని శుభ్రం చేస్తున్నారు. 5,500 స్వఛ్ ఆటోలు ఇంటింటి చెత్త సేకరణలో పాల్గొంటున్నాయి. నిత్యం 2,500 చెత్తకుప్పలు ఏర్పడుతున్నాయి. వాటిని శుభ్రం చేసినా.. నిమిషాల వ్యవధిలోనే మళ్లీ పోగవుతున్నాయి.

ఇలా చేద్దాం: ఇళ్లు, దుకాణాలు, హోటళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను.. స్వఛ్ ఆటోలకు ఇవ్వాలి. దారిలో వెళ్తున్నప్పుడు, వాహనం నడుపుతున్నప్పుడు.. ఆహార వ్యర్థాలను తిని పడేయడం, రోడ్లపై ఉమ్మడం ఆపేయాలి. అప్పుడు శుభ్రంగా కనిపిస్తాయి.

ప్రజా రవాణాకు పట్టం కడదాం

నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్య నియంత్రణకు ఆర్టీసీ బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ సర్వీసులను వినియోగించుకోవాలి. జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్)లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరాలంటే ప్రజా రవాణాను మెరుగుపరచడమే ఏకైక మార్గమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్, ఇతర రవాణా సాధనాల్లో ఉమ్మడిగా చెల్లుబాటు అయ్యే కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# అన్నదాత.. ఆకాంక్షల కలబోత

జగిత్యాల : నూతన సంవత్సరంలో వ్యవసాయ రంగం 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా వర్ధిల్లాలని రైతులు కోరుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలకు గిట్టుబాటు ధరలు అందాలని ఆకాంక్షిస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పరంగా మద్దతును కోరుతున్నారు.

**దిగుబడులు పెరిగేలా కొత్త వంగడాలు**

జగిత్యాల, కూనారం, వరంగల్, రుద్రూరు పరిశోధన స్థానాల్లో వరి, కరీంనగర్‌లో మక్క, ఆదిలాబాద్‌లో సోయా, ముథోల్‌లో పత్తి, కమ్మర్‌ప ల్లిలో పసుపు పరిశోధనలు సాగుతున్నా ఇక్కడి రైతులు కోరుకున్న వంగడాల రూపకల్పన జరగలేదు. అన్ని పంటల్లోనూ చీడపీడలను తట్టుకొని సగటు దిగుబడులు పెరిగేలా సంకర రకాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తేవాలి. పొలాసలో ఆవాల పరిశోధన స్థానం, ఉ మ్మడి జిల్లాలో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాల్సి ఉంది. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుతో ఆధునిక సాంకేతికత విస్తరణకు అడుగులు పడతాయి.

**అప్పుడే తీపి కబురు**

ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద వ్యవసాయాధారిత పరిశ్రమ అయిన ముత్యంపేట చక్కెర కర్మాగారం పునరుద్ధరిస్తే చెరకు సాగు విస్తీర?ం 25 వేల ఎకరాలకు పెరుగుతుంది. వరి, మామిడి, పసుపు, మిరప, మక్క, నువ్వులు తదితర పంటల్లో ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ రుణాలిస్తే కర్షకులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది. పొలాస, వరంగల్ పరిశోధన స్థానాల్లోని వరి, మామిడి, మిరప, పసుపు పంటల ఉత్పత్తుల తయారీ ఇంక్యుబేషన్ సెంటర్లలో ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వాలి.

**విత్తనోత్పత్తికి కావాలి దన్ను**



ఉమ్మడి జిల్లా నేలలు విత్తనోత్పత్తికి అనుకూలం. ఇప్పటికే సూటి వరి, సంకర వరి, మక్క, పత్తి, ఆవాలు, జొన్న, సజ్జ తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నా ధరల చెల్లింపు, కొనుగోలు కంపెనీల కొర్రీలతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో ఒప్పంద సాగు చట్టాల అమలుతో మేలు చేకూరనుంది. కరీంనగర్ నుంచి జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌కు తరలించిన విత్తనశుద్ధి కర్మాగారాన్ని ఈ ఏడాదైనా రైతులకు అందుబాటులోకి తేవాలి.

**సహకార సేవలు విస్తృతం**

ఉమ్మడి జిల్లాలో 131 సహకార సంఘాలుండగా అన్నింటినీ ఎఫ్‌పీవో లు(రైతు ఉత్పాదక సంఘాలు)గా మార్చడం, కొత్తగా 20 వరకు ప్యాక్స్‌ల ఏర్పాటుతో రైతులకు మెరుగైన సేవలందుతాయి. 6.63 లక్షల మంది రైతుల్లో 35 శాతం మంది కూడా సభ్యులుగా లేనందున అందరినీ సంఘాల్లో చేర్చాలి. ఈ ఏడాది ఎన్నికల నిర్వహణ లేదా పాలకమండళ్ల నియామకంతో సాగుకు ఊతమివ్వాలి.

**పథకాలతో ప్రయోజనం**

కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకంలో అర్హుల నమోదుకు అవకాశమిస్తే కనీసం 90 వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు, యంత్రలక్ష్మి పథకం ద్వారా రూ.150 కోట్ల నిధుల విడుదల, 50 శాతం రాయితీపై ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాల సరఫరా, 25 మార్కెట్ యార్డులను ఈ-నామ్ పరిధిలోకి తేవడం, సాగు పనులను వి బీజీ రామ్ జీ(ఉపాధిహామీ) పథకంలో చేర్చడం వంటివి కర్షకులకు కలిసొస్తాయి.

# ఎవరిదీ పాపం..!

మిర్యాలగూడ : ఒక్కప్పుడు పిల్లలకు ఏమైనా అయితే చుట్టు పక్కల వాళ్ల మనసులు సైతం చలించి పోయేవి..ఇక సొంతింటి వారు కన్న వారి బాధను వరి?ంచలేము..కానీ నేడు పరిస్థితులు మారాయి. కనికరం, మానవత్వం మచ్చుకైనా కనిపించడం లేదు. కన్న బిడ్డలనే అమానుషం గా పక్క కాల్వలు, చెత్త కుప్పలో పడేసి..'కడుపు'దులు పుకొంటున్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు నిత్యం ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తూనే ఉన్నాయి.

**నాకెందుకీ శాపం..**

మీరు చేసిన తప్పో..ఒప్పో పనికి నాకు ఊపిరి పోశారు సరే.. మరి ఆడపిల్లనని అకారణంగా పుట్టానని ఎందుకమ్మా నా పట్ల అంత కర్కశత్వం చూపుతున్నావు. ఇన్ని నెలలు నన్ను కడుపులో భద్రంగా దాచుకున్నావు కదా..ఇప్పుడెందుకు భారమయ్యాను. ఆడపిల్లను అని సాకేందుకు భయం వేసిందా. నువ్వు కూడా నాలాగే ఆడపిల్లవే కదా. మరి నా పట్ల వివక్ష ఎందుకు చూపావు. మీరు చేసే తప్పులకు నన్ను ఎందుకు బలి చేశారు. ఇదే ఆలోచన నాడు మీ అమ్మ చేసి ఉంటే నేడు ఈ అదుతేమైన లోకాన్ని నువ్వు చూసే దానివా అమ్మా. నాకెందుకు ఆ భాగ్యం కలగకుండా చేశావు.



**ఏడాదికి.. నాకూ చివరి రోజే..**

ఏడాది చివరి రోజే నాకు సైతం అంతిమ దినం చేస్తావని అనుకోలేదు అమ్మా. నన్ను వదిలించుకొని..కొత్త సంవత్సరానికి నువ్వు ఏ విధంగా స్వాగతం పలుకుతామ్మా. నాకు జరిగిన ఈ పరిస్థితి వచ్చే కొత్త ఏడాదిలో మరే శిశువుకు జరగకుండా అధికారులు పటిష' చర్యలు చేపట్టాలి. కొత్త ఏడాదిలో అధికారులు సరికొత్త తీర్మానం తీసుకొని గరరేలోనే నా లాంటి శిశువులను తుద ముట్టించే ఘటనలకు స్వస్తి పలకాలి. అధికారులతో పాటు ప్రజలు సైతం మాలాంటి శిశువులకు అండగా నిలవాలి. మిర్యాలగూడలో పక్క కాల్వలో లభ్యమైన మ ృత శిశువు ఆత్మఘోషకు ఇచ్చిన అక్షర రూపం ఇదీ..

చురకలు



# మురుగు నీరు శుద్ధిచేసి.. మూసీలోకి వదిలేసి

హయత్‌నగర్ : చుక్క మురుగు చెరువులోకి చేరకుండా... వర్షపు, శుద్ధి చేసిన నీరే చెరువులోకి చేర్చి.. అటు నుంచి నేరుగా మూసీలోకి చేర్చుడానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. 2036 జనాభా లక్ష్యంగా ఎస్టీపీ(మురుగు శుద్ధి కేంద్రం)లను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవుటర్ రింగ్‌రోడ్డులోని పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ పరిధిలో మూడు, తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలో ఒకటి నిర్మించడానికి రూ.165.95 కోట్లు విడుదల చేశారు. ఈ పనులతో నగరానికి తూర్పు భాగంలోని బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, సాహెబ్‌నగర్, హయత్‌నగర్ సహా దాదాపుగా పాతికకు పైగా కాలనీల నుంచి దిగువనున్న కుంట్లూర్, పసుమాముల చెరువులోకి శుద్ధి చేసిన నీటిని తరలించడా



నికి చర్యలు తీసుకుంటారు..

**భవిష్యత్తులో మురుగు సమస్య తలెత్తదు**

ఎస్టీపీల నిర్మాణంతో భూగ ర్భ, చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని అపోహ చెందొద్దు. 2036, 2051 ఏళ్ల వరకు కాలనీలు, జనాభాకు అనుగుణంగా మురుగు సమస్య తలెత్తకుండా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యం. పకడ్బందీగా కాంక్రీట్‌తో నిర్మాణం చేస్తాం. మురుగు చెరువులో కలువకుండా చర్యలు, తీసుకుంటాం.

వినోద్‌కుమార్, డీజీఎం, ప్రాజెక్టు-1 జలమండలి

# గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్

హైదరాబాద్: అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీహబ్‌కు గూగుల్ కూడా తోడవడంతో గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానానికి మార్గం ఏర్పడింది. రాయదుర్గంలోని టీహబ్‌లోని ఆరో అంతస్తులో జోన్-4లోని పదివేల అడుగుల విస్తీర్ణంలో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచాన్ని మార్చే తదుపరి తరం కంపెనీలు ఇక్కడ ఇంక్యుబేట్ కాబోతున్నాయి. తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు, ప్రపంచస్థాయి ఆవిష్కరణలను కేంద్రంగా మారనుంది. మహిళా వ్యవస్థాపకులకు, టైర్-2 ఆవిష్కర్తలు, విశ్వవిద్యాలయాల్లోని ప్రతిభకు గూగుల్ నిపుణుల తోడ్పాటు లభిస్తుంది. ఇక్కడ స్టార్టప్‌ల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించారు. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఏఐ, మెషిన్ లెర్నింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. అంకుర సంస్థల కోసం ప్రత్యేక డెస్క్‌లు, సమావేశ గదులు, ప్రత్యేక క్యాబిన్‌లు, క్యూబిక్‌లు,



డిజిటల్ తెరల వంటి సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. ఎంపికైన ఆలోచనలకు ఉచితంగానే ఇక్కడ స్థలం కేటాయిస్తారు. వర్చువల్‌గా ప్రపంచంలోని వ్యవస్థాపకులతో, నిపుణులతో నెట్‌వర్క్ అందిస్తుంది. ఏఐ, డీప్ టెక్నాలజీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. 'స్టార్ట్, బిల్డ్, గ్రో' అనేది వీరి నినాదం. ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాంగణాన్ని, అందులో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణలో అంకురాలకు సంబంధించి ఆసక్తికర గణాంకాలను వెల్లడించారు.

2024లో ఇక్కడి స్టార్టప్స్ 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 160 శాతం అధికం.

మెడికల్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదైంది.

దేశంలోనే మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ ఆరోస్థానంలో ఉంది. వీరి ఆధ్వర్యంలో ఏర్పాటైన 531 అంకుర సంస్థలు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి.

గ్లోబల్ క్యాపబుల్ సెంటర్లు గత ఏడాది 70 వస్తే.. ఈ ఏడాది ఇప్పటికే 75 దాటాయి. 100 చేరుకోవడం లక్ష్యం.

# పల్లెలు గజగజ



జగిత్యాల : ఉత్తర భారతం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. బుధవారం తెల్లవారుజామున రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నాలుగు జిల్లాల్లోనూ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.6 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గింది. దీంతో పగలు కూడా చలి వాతావరణం నెలకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలివీ.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో 9.3, చింతకుంట ఏఆర్‌ఎస్‌లో 9.6 డిగ్రీలుగా నమోదయ్యాయి.

# అక్రమాల్లో సబ్‌రిజిస్ట్రార్లు



హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అవినీతి దాహం ముందు నిబంధనలు వెలవెలపోతున్నాయి. సబ్ రిజిస్ట్రార్లకు ఉన్న విచక్షణాధికారాలను వినియోగించుకుని అక్రమాలకు తెరతీస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసేద్దాం తర్వాత ఏమైతే అది కానీ అనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా భారీ మొత్తంలో లంచాలు మేస్తున్నారు. వీరికి కొందరు డాక్యుమెంట్ రైటర్లే దళారులుగా వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో ఆస్తుల విలువ, భూ వివాదాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు, డాక్యుమెంట్లలో లోపాలు, వివాదాస్పద ఆస్తులు, యజమానులు స్థానికంగా లేకపోవడం, జీపీఏ ద్వారా రిజిస్ట్రేషన్.. ఇలాంటి వేర్వేరు అంశాలను అవకాశాలుగా మలచుకుని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అవినీతికి తెరతీస్తున్నారు. ఇటీవల ఏసీబీ అధికారులు గ్రేటర్ పరిధిలో పలు కార్యాలయాల్లో కార్యకలాపాలపై నిఘా పెట్టి, పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అంతర్గత పరిశీలన చేసింది. ఈ పరిశీలనలో పలు అంశాలను గుర్తించినట్లు తెలిసింది.

**అక్రమాలు ఎన్నో..:**

అనధికార వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లతో పాటు దళారుల ప్రమేయం చాలాచోట్ల సీసీ టీవీలు పనిచేయడంలేదు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండదు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

అత్యవసర రిజిస్ట్రేషన్‌ల పేరుతో వసూళ్లు

ఈసీ, వాల్యుయేషన్ సర్టిఫికెట్, సెర్చ్ రిపోర్టులకు వసూళ

మార్కెట్ విలువలో మార్పులు. వాస్తవమైన మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ చూపడం, అండర్ వాల్యూయేషన్‌చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించడం అంశాల్లో భారీగా వసూళ్లు.

ఎలా ఉన్నా రిజిస్ట్రేషన్ ఇలా..

నకిలీ జీపీఏ, సేల్‌డీడ్‌లు, పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా..


యజమానులు నిజమైనవారేనా అని నిర్ధారించుకోకుండా

డూప్లికేట్ లేఅవుట్‌లు, నకిలీ సర్వే నెంబర్ల ఆధారంగా

భవన నిర్మాణ అనుమతులకు భిన్నంగా ఉన్నా

అనధికార ఫ్లోర్‌లలోని ప్లాట్లకు సైతం.

# ఆధ్యాత్మికం.. ఆహ్లాదం



మల్యాల : కొండగట్టు అంజన్న ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని దేవాదాయ శాఖ అధికారులు దృఢ సంకల్పంతో ముందుకు సాగుతుండగా మరోవైపు కొండపై అటవీ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో ఆ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించారు. కొండగట్టు గుట్టలపై అటవీ శాఖకు సంబంధించి దాదాపు వెయ్యి ఎకరాల భూములున్నాయి. వీటిలో టేకు తదితర చెట్లు దట్టంగా పెరిగాయి. దాదాపు 22 ఎకరాల్లో ఆలయం, పరిసరాలు విస్తరించాయి. గతంలో ప్రభుత్వ ఆధీనంలోని 363.22 ఎకరాల అసైన్డ్ భూములన్నింటినీ రెవెన్యూ శాఖ నుంచి ఆలయానికి స్వాధీనం చేశారు.

**సమన్వయంతో బహుళ ప్రయోజనాలు**

ఆలయ పరిసరాల్లోని ఆరెకరాల్లో చేపట్టిన పలు నిర్మాణాలు, ఖాళీ స్థలం అటవీ ప్రాంతానికి చెందినదేనంటూ కొన్ని నెలల క్రితం ఆ శాఖ ఉన్నతాధికారులు ఆలయ అధికారులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమైంది. అయితే అటవీ అధికారులే ఆలయానికి చెందిన స్థలం నుంచి గిరి ప్రదక్షిణ దారిని ఏర్పాటు చేశారని, ముందుగా అటవీ భూముల వివరాలను గెజిట్ ద్వారా వెల్లడించిన తర్వాతే పనులు చేపట్టాలని ఈవో శ్రీకాంతరావు వారికి నోటీసులు పంపడం చర్చనీయాంశమైంది. ఇటీవల అటవీ భూముల సర్వేను కూడా ఆలయ అధికారులు అడ్డుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో అటవీ, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కరించుకుంటే కొండగట్టు ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని భక్తులు కోరుతున్నారు.

**చేపట్టే పనులు ఇవీ..**

రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా కొండగట్టు విరాజిల్లుతుండటంతో ఆలయ పరిసరాలకు ఆనుకొని ఉన్న తమ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇటీవల అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ కొండగట్టుకు వచ్చిన సందర్భంగా ఈ విషయమై అధికారులతో చర్చించి వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే 'వై' జంక్షన్ సమీపంలోని అటవీ భూమిలో కుటీరాన్ని నిర్మించారు.

ప్రస్తుతం కొండగట్టులోని అటవీ ప్రాంతంలో కిలోమీటరు మేర నడక దారిని ఏర్పాటు చేయడంతో పాటు రూ.6 లక్షలతో నాలుగు చోట్ల కల్వర్టులు నిర్మించారు.

కొండగట్టు గిరి ప్రదక్షిణ దారిని విస్తరించనున్నట్లు తెలిసింది. గతంలో అటవీ ప్రాంతంలో వాచ్‌టవర్‌ను ఏర్పాటు చేయగా, ఆలయ ఈవో కార్యాలయ భవనం వెనుక వైపున రూ.16 లక్షలతో మరో 'వాచ్‌టవర్' నిర్మాణం చేపట్టారు.

అటవీ ప్రాంతానికి చెందిన స్థలాన్ని రూ.57 లక్షల వ్యయంతో చైన్ లింకింగ్ మెష్‌తో రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రధాన ద్వారం ఏర్పాటు చేయనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.

పర్యాటక ప్రదేశాలు తిలకించేందుకు వీలుగా బ్యాటరీతో నడిచే వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులకు జారుడు బల్లలు, ఊయలలు, ఇతర క్రీడా సామగ్రిని సమకూర్చనున్నట్లు పేర్కొంటున్నారు.

కొండగట్టు అర్బన్ పార్కు నిర్మాణం కోసం రూ.10 కోట్ల వరకు వెచ్చించడానికి తమ శాఖ సిద్ధంగా ఉందని అటవీ అధికారులు తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

ఈ ప్రాంతంలోని అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కొండగట్టు అర్బన్ పార్కు నిర్మించడానికి ఉన్నతాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేశాం. ఆలయ అధికారులు సహకరిస్తే అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించే పలు నిర్మాణాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

మొహినొద్దీన్, అటవీ శాఖ క్షేత్రాధికారి

# మహా నగరి.. ఆరోగ్య సిరి



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాన్ని వైద్య పర్యాటకంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేలా పర్యాటకశాఖ కార్యాచరణను రూపొందిస్తోంది. పదేళ్లలో వైద్యం కోసం వస్తున్న విదేశీయుల సంఖ్య రెట్టింపు అయింది. చికిత్స కోసం విదేశీయులు 2014 కేవలం 75 వేలమంది రాగా.. 2024 ఈ సంఖ్య 1.50 లక్షలకు పెరిగింది. నగరంలోని ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు, అత్యాధునిక సాంకేతికత, ఆసుపత్రుల్లో వసతులతో పాటు వైద్యానికి అయ్యే వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎక్కువమంది ఇక్కడికి వచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మరింత ఎక్కువమంది వైద్యం కోసం నగరానికి వచ్చేలా చేసేలా రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌ను వైద్య పర్యాటకం హబ్‌గా మార్చేలా దృష్టిసారించింది.

**వెల్‌నెస్ టూరిజానికి మరింత ప్రోత్సాహం**

ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించిన హెల్త్ టూరిజం సమిట్‌ను రాష్ట్ర నూతన పర్యాటక విధానం మేరకు వెల్‌నెస్ (మెడికల్) టూరిజాన్ని ప్రోత్సహించేలా నిర్వహించారు. ఆసుపత్రులు, వైద్య సంస్థలు, పర్యాటక ఆపరేటర్లు, విదేశీ ప్రతినిధులు, ఇతర దేశాల నుంచి ప్రతినిధులు, వైద్య నిపుణులు భాగస్వామ్యమయ్యారు. సదస్సులో వచ్చిన సూచనల మేరకు పర్యాటక శాఖ వైద్య పర్యాటకానికి కార్యాచరణను సిద్ధం చేస్తోంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, ఆంకాలజీ, ఫెర్టిలిటీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, కాలేయం సహా వివిధ స్పెషాలిటీలకు డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో వీటితో పాటు ఆయుర్వేదం, యోగా, యునానీ వంటి వాటికి వైద్యంలో ప్రాధాన్యం ఇచ్చేలా పర్యాటకశాఖ వివిధ సంస్థలతో చర్చిస్తోంది. ఆహ్లాదకర వాతావరణంలోని అనంతగిరిహిల్స్‌లో ప్రకృతి వైద్యం కోసం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌ను ఇందులో కీలకం చేయనున్నారు. వైద్యం కోసం వచ్చే వారి వీసా విధానం వైద్యం, వైద్య వసతులు, ఇతర అంశాల్లో తోడ్పాటును అందించడం వంటి అంశాల్లో పక్కా విధానం రూపొందిస్తారు.

# అతివ.. స్వయం ఉపాధి తోవ

మార్కండేయకాలనీ : మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు.. ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వశాఖ సంయుక్తంగా.. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లా మహిళా బాలిక సాధికారత కేంద్రం ఆధ్వరంలో ఎన్టీపీసీలోని విక్టరీ ఇన్‌స్టిట్యూట్‌లో 60 మంది మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, ఎలక్ట్రికల్ మిషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. చదువుకున్న మహిళలకు డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో కూడా అవకాశం కల్పిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి హాజరైన మహిళలు ఫ్యాషన్ డిజైన్, బొటిక్స్‌పై శిక్షణ పొందుతున్నారు. ఆరు నెలల శిక్షణ కాలం కాగా ప్రస్తుతం నాలుగు నెలల శిక్షణ పూర్తి చేస్తున్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారంతా స్వయం ఉపాధి, ప్రైవేటు, ప్రభుత్వ క్రాఫ్ట్ టీచర్లుగా ఉపాధి పొందవచ్చు.

నెక్ డిజైన్స్

స్వీవ్స్ ప్రిన్సెస్‌కట్ బ్యాక్‌లెస్‌బ్లౌజ్ హాల్టర్‌నెక్ జుబ్లా



పిల్లల టాప్స్, ఫ్రాక్స్, పట్యాల

ఎలక్ట్రికల్ మిషన్‌తో సులువుగా

మాది అంతర్గాం మండలం. మా ప్రాంతంలో బొటిక్ యంత్రం లేదు. ఏదైనా వర్క్ ఉంటే గోదావరిఖనికి వెళ్లాల్సిందే. ప్రస్తుతం జుబ్లా, ఫ్రాక్స్, కటింగ్, టాప్స్, పట్యాల, ఏకరూప దుస్తులు ఎలక్ట్రికల్ మిషన్‌తో సులువుగా కుట్టగలుగుతున్నా. బొటిక్ యంత్రంతో స్వయం ఉపాధి పొందాలని శిక్షణ పొందుతున్నాను.

స్రవంతి, అంతర్గాం

ఎవరి మీద ఆధారపడకుండా

మంథని నుంచి నిత్యం ఎన్టీపీసీ శిక్షణ కేంద్రానికి హాజరవుతున్నాను. కుట్టు మిషన్‌పై ఎలాంటి అవగాహన లేదు. ఇన్‌స్టిట్యూట్ శిక్షకురాలు వరలక్ష్మి మార్గదర్శకంలో చిన్నారుల ఏకరూప దుస్తులు, ప్రిన్సెస్‌కట్, స్టేట్ కటింగ్‌లో ప్రావీణ్యం పొందా. ఎవరి మీద ఆధారపడకుండా పీజీ డిప్లొమా కోర్సుల్లో రాణించి వ్యాపారం చేయాలన్నదే నా లక్ష్యం.

సంధ్య, మంథని

60 మందికి శిక్షణ

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు ఫ్యాషన్ డిజైన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ఉన్నత చదువులు, నూతన టెక్నాలజీ అనుగుణంగా ఫ్యాషన్ డిజైన్ పీజీ డిప్లొమా కోర్సు కూడా అందజేస్తున్నాం. ఇగ్నో విశ్వవిద్యాలయం నుంచి ధ్రువపత్రాలు పొందుతారు. దయ అరుణ, సమన్వయకర్త

# విజ్ఞాన ప్రదర్శనలు.. సృజనకు వేదికలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇందు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ చైతన్య జైని, ఏఎంఓ పెసర ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

18 తుది గడువు: విద్యార్థులు తమ పాఠశాల ఎంట్రీలను గూగుల్‌ఫాం లింక్ ద్వారా ఈనెల 18వ తేదీ రాత్రి 9 గంటల వరకు సమర్పించాలి. 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఒక థీమ్‌కు కేవలం ఒక ఎంట్రీ మాత్రమే అనుమతిస్తారు. కేవలం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మాత్రమే ఉంటుంది. ఆఫ్‌లైన్ ఎంట్రీ లేదు.

**ఇవీ లక్ష్యాలు..:** విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తిని రేకెత్తించటం, నూతన, వినూత్నమైన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఉపయోగపడతాయి. రీ సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచటం, సైన్స్ భావనలను వివిధ రూపాల్లో అనువర్తింప చేయటం

లాజికల్ రీజనింగ్ ద్వారా ప్రతి అంశంలో శాస్త్రీయ పద్ధతిని అనుసరించేలా ప్రోత్సాహం

విద్యార్థులు ప్రకృతిని అర్థం చేసుకునేందుకు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగటం, పరికల్పనలను రూపొందించట, ప్రయోగాలు చేయటం తదితర అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవటం.

దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యల నుంచి డేటాను సేకరించటం, దాన్ని విశ్లేషణ చేయటం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అలవరచుకోవటం. సైన్స్‌ను సమాజానికి అనుసంధానించటం, శాస్త్రీయ దృక్పత కోణంలో విస్తృత సామాజిక అవగాహన కోసం సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడతాయి. సైన్స్, గణితం అనేక విభిన్న వ్యక్తులు, సంస్కృతులు, సమాజాలు, పర్యావరణం ద్వారా ఎలా అభివృద్ధి చెందాయి, ప్రభావితమయ్యాయో విశ్లేషించటం.

వాతావరణ మార్పు, వ్యవసాయం, ఎరువులు, ఆహార ప్రాసెసింగ్, బయోటెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, సమాచారం, కమ్యూనికేషన్, రవాణా, క్రీడలు తదితర రంగాల్లో కొత్తమార్గాలను తెరవటం వంటి జీవిత సవాళ్లను ఎదుర్కోవటంలో సైన్స్, గణితం పాత్రను అభినందించటం.

2025-26 ఇతి వృత్తం

'వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ కోసం సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం

ఉప ఇతి వృత్తాలు రీ గ్రీన్ ఎనర్జీ

స్థిరమైన వ్యవసాయం

వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయాలు

ఉద్భవిస్తున్న సాంకేతికతలు

వినోద గణిత మోడలింగ్

ఆరోగ్యం, పరిశుభ్రత

నీటి సంరక్షణ, నిర్వహణ

సెమినార్ అంశం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించటం

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు, డీఎడ్/బీఎడ్ ఉపాధ్యాయ శిక్షణార్థులు కూడా తమ వినూత్నమైన బోధనాభ్యసన సామగ్రి భావనలకు వాస్తవ రూపం కల్పిస్తూ తయారు చేసిన ఎగ్జిబిట్స్ కూడా ప్రదర్శించవచ్చు. ఇవి మాత్రమే కాకుండా ఖమ్మం జిల్లా ప్రత్యేకంగా ఏఐ, రోబోటిక్స్ అనే అంశంపై కూడా పోటీలు నిర్వహిస్తోంది.

చురకలు

ఆదివారం 4 జనవరి 2026

## రూ.2 కోట్లతో శంకరమఠం అభివృద్ధి

తాడేపల్లిగూడెం : స్థానిక ఏలూరు రోడ్డు, చిన్న వంతెన దగ్గర గల శంకరమఠం, సర్వమంగళ అమ్మవారి ఆలయం అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మండప నిర్మాణ పనులు ఇటీవలే ప్రారంభించారు. ప్రతి సర్వమంగళ అమ్మవారికి నవావరణార్చన పేరుతో పూజలు నిర్వహిస్తుంటారు. ఈ పూజల్లో పాల్గొనడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. వారి సౌకర్యార్థం అమ్మవారి ఆలయం ఎదురుగా ముఖ మండపం నిర్మిస్తున్నామని.. మొత్తం రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఆలయ



ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వేమూరి రామం చెప్పారు.

ఆలయానికి సమీపంలో శంకరమఠానికి అనుసంధానంగా 'ముముక్షు భవనం' పేరుతో మూడంతస్తుల్లో వేద పాఠశాల నిర్మిస్తున్నారు. ఇందులో అర్చకుల గృహాలు,పాఠశాల, యాత్రికులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. అందులోనే ఉచిత అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వేద పాఠశాలకు ఎదురుగా ఉన్న స్థలంలో ఒక గోశాల కూడా నిర్మిస్తున్నామని.. ఇవన్నీ త్వరలో పూర్తి చేయాడానికి కృషి చేస్తున్నామని రామం వివరించారు.

## సింహపురికి పైవంతెనల శోభ

నెల్లూరు : నెల్లూరు నగరం చుట్టుపక్కల జాతీయ రహదారిపై నూతన వంతెనలు నిర్మాణంలో ఉన్నాయి. కొన్ని పూర్తి కానుండగా.. ఇంకొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ప్రమాదాలు తగ్గించేందుకు ఇవి దోహద పడనున్నాయి. కాగా పాత వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. నెల్లూరులో పెన్నానదిపై ప్రస్తుతం ఉన్న వంతెన 1954 నాటిది. ఇది శిథిలావస్థకు చేరడంతో రెండులైన్లతో కొత్త వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 99.48 కోట్లతో చేపట్టిన నిర్మాణం అవాంతరాలను అధిగమిస్తూ చివరి దశకు చేరుకుంది. నూతన సంవత్సరం మార్చి చివరి నాటికి ప్రారంభించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**ఎన్‌హెచ్ 47 రోడ్డును బలోపేతం చేసేలా..**

ప్రస్తుతం నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, వేదాయపాలెం, రైల్వేబ్రిడ్జి వాటి అనుసంధాన రోడ్లు, వంతెనలను బలోపేతం చేస్తూ పనులు సాగుతున్నాయి. ఇందుకోసం ఇరువైపులా వంతెనలపై రాకపోకలను ప్రస్తుతం నిలిపివేసి సుమారు రూ. 13.74 కోట్లతో పనులు చేస్తున్నారు. నూతన సంవత్సరం మార్చి తొలివారంలో పనులను పూర్తి చేయడానికి కసరత్తు జరుగుతోంది.



**చింతారెడ్డిపాలెం కూడలిలో అండర్‌పాస్**

తరచూ ప్రమాదాలు జరుగుతున్న చింతారెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారికి నూతన అండర్‌పాస్ మంజూరైంది. విజయవాడ, చెన్నై జాతీయ రహదారి కావడంతో ఇక్కడ రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నెల్లూరు ప్రజాప్రతినిధులు కేంద్ర అధికారులను ఒప్పించి నూతన అండర్‌పాస్ మంజూరు చేయించారు. రూ. 115 కోట్లతో పనులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియకు అధికారులు సిద్ధమయ్యారు.

**ఆరువరుసలతో..** జాతీయ ర.భ అధికారుల ఆధ్వర్యంలో నగరంలోని అయ్యప్ప ఆలయం దాటాక బుజ బుజనెల్లూరు వద్ద 5,(16)వ నెంబర్ జాతీయ రహదారిపై టీ జంక్షన్ వద్ద ఆరు వరుసల ఆకాశవంతెన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. 2024లో ప్రారంభమైన పనులకు రూ. 74.88 కోట్లు మంజూరయ్యాయి. దాదాపుగా 3.48 కిమీటర్లతో 50 మీటర్ల వెడల్పుతో పనులు చేస్తున్నారు. 2025 సెప్టెంబరుకే పూర్తి కావాల్సి ఉన్నా, వివిధ కారణాలతో ఆలస్యమవుతున్నాయి. ఈ పనులు కూడా నూతన సంవత్సరంలోనే పూర్తయి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

## అంతా ఆమోదమే..!

నెల్లూరు : 'ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులకు చెబుదామంటే.. ఫోన్ తీయడం లేదు.. వీటిపై వినతిపత్రాలు ఇస్తే.. కనీసం స్పందన లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రజల ముందు తలదించుకునే పరిస్థితి నెలకొంది' అని కార్పొరేటర్లు గగ్గోలు పెట్టారు. తమ డివిజన్లలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన 118 అంశాలతో మెయిన్ అజెండా, 53 సప్లిమెంటరీ, 16 టేబుల్ అజెండాలను ప్రవేశపెట్టి 187 తీర్మానాలను అజెండాగా ప్రకటించగా.. కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్న తర్వాత మొదటి సమావేశం కావడంతో కార్పొరేటర్లు అందరికీ సమయాన్ని కేటాయించారు. దీంతో తమ డివిజన్లలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

**ఆదాయం రూ.165 కోట్లు.. ఖర్చు రూ.120కోట్లు**నగరపాలకసంస్థ ఆదాయం, ఖర్చులను ఇన్‌ఛార్జి మేయర్ సభ్యులకు వివరించారు. కార్పొరేషన్‌కు రూ. 298 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంటే.. ఇప్పటి వరకు రూ. 77 కోట్లే వసూలయ్యాయని తెలిపారు. గత ఏడాది రూ. 165 కోట్లు ఆదాయం వస్తే.. రూ. 120కోట్లు ఖర్చు అయిందని వివరించారు. నెలకు జీతాలు, విద్యుత్తు బిల్లులు, యంత్రాలకు అద్దెలు రూ. 12.50కోట్లు అవుతున్నట్లు వివరించారు. నగరంలో అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు సంబంధిత కార్పొరేటర్లకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రస్తుతం వినియోగిస్తున్న అద్దె ట్రాక్టర్ల స్థానంలో ప్రభుత్వం 200 విద్యుత్తు ఆటోలను మంజూరు చేసిందన్నారు. కార్పొరేషన్ భాగస్వామ్యంతో నిర్వహించే పండగలకు కార్పొరేటర్లకు ప్రాధాన్యం ఇచ్చి భాగస్వామ్యం చేయాలని సూచించారు. అజెండాలోని అన్ని అంశాలు నగరాభివృద్ధికి రూపొందించబడ్డాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్, కోఆప్షన్ సభ్యులు చాట్ల నరసింహారావు, వహీదా, జమీర్, కమిషనర్ వైవో పాల్గొన్నారు.

# తీరం కంట్లో ఇసుక



మొగల్తూరు : సముద్ర తీరంలో అక్రమార్కులు సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో మొగల్తూరు మండలం పేరుపాలెంసౌత్ పరిధి మోళ్లపర్రు నుంచి నరసాపురం మండలం బియ్యపుతిప్ప వరకు 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో ఇసుక మేటలు తుపానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి తీర గ్రామాలకు సహజ రక్షణ కవచాల్లా ఉపయోగపడుతున్నాయి. కొన్నేళ్లకు ఈ ఇసుకకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

**ఆక్వా చెరువుల పేరిట..**

భవనాల పునాదులు, లేఅవుట్ల పూడికకు ట్రాక్టర్ ట్రక్కు ఇసుకను రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నారు. పలువురు ఆక్వా చెరువుల తవ్వకం పేరిట తీర ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్నారు. నరసాపురం మండలం చినమైనవానిలంక, కేపీపాలెంసౌత్, పేరుపాలెంసౌత్ గ్రామాల పరిధిలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతరం తవ్వకాలు జరుగుతున్నాయి. బీ మోళ్లపర్రు వద్ద ఉప్పుటేరు సముద్రంలో కలిసే ప్రాంతంలో ఇసుక భారీగా మేట వేసింది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు అక్కడ యంత్రాలతో తవ్వి తరలించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు.

**గ్రామాలకు ముప్పు**

వాతావరణ మార్పుల ప్రభావంతో రెండు దశాబ్దాలుగా సముద్రపోటు పెరుగుతుండటంతో తీర ప్రాంత గ్రామాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు తీరం వెంబడి మీటర్ల లోతు వరకు ఇసుకను తవ్వేస్తుండటంతో సమీప భూములు ఉప్పు కయ్యలుగా మారుతున్నాయి. గతంలో తీరప్రాంత గ్రామాల్లో ప్రజలు బావుల్లో నీటిని తాగేందుకు, ఇంటి అవసరాలకు వినియోగించేవారు. ఇసుక తవ్వకాలు, ఆక్వాచెరువుల ప్రభావంతో భూగర్భ జలాల్లో ఉప్పుశాతం పెరిగి అవి తాగేందుకు పనికిరావడం లేదు.

**చర్యలు చేపడతాం**

'సముద్రతీరంలో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.' అని మొగల్తూరు తహసీల్దారు కె.రాజకిశోర్ తెలిపారు.

# ప్రజా సమస్యలపై.. అక్షరమే అస్త్రమై!



పెనుగొండ : ప్రజా సమస్యలపై అక్షరాలే అస్త్రాలుగాలో ప్రచురితమైన కథనాలు యంత్రాంగాన్ని, పాలకులను కదిలించాయి. 2025లో నరసాపురం డివిజన్ పరిధిలో పలు సమస్యలకు కథనాలతో పరిష్కారం లభించింది. పెనుమంట్ర మండలంలో అల్పవిద్యుత్తు, స్తంభాలు దెబ్బతినడంతో తరచూ విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్న పరిస్థితులపై సెప్టెంబరులో ప్రచురితమైన కథనానికి యంత్రాంగం స్పందించింది. వివిధ ప్రదేశాల్లో కొత్తగా పరివర్తకాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. బ్రాహ్మణచెరువు- నౌదూరు ఆర్‌అండ్‌బీ రహదారి పాడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులపై పలు మార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించి ఉన్నతాధికారులకు నివేదించారు. నిధులు మంజూరు కావడంతో ఇటీవల రహదారుల పనులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు.

ఆచంట సీహెచ్‌సీ ప్రాంతంలో విద్యుత్తు సమస్యపైలో ప్రచురితమైన కథనాలకు వివిధ శాఖల అధికారులు స్పందించి సుమారు రూ. 5లక్షల ఖర్చుతో కొత్త పరివర్తకం ఏర్పాటు చేశారు.

నరసాపురం- మత్స్యపురి- భీమవరం ప్రధాన రహదారి సరిపల్లి- లిఖితపూడి గ్రామాల మధ్య అధ్వానంగా మారిన తీరుపైలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రూ. 12 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయించారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట! పాలకొల్లు పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్తు పరివర్తకాలు ప్రమాదకరంగా ఉన్న తీరుపైలో ప్రచురితమైన కథనాలు ఆ శాఖ అధికారులు స్పందించారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ఆయన సూచనల మేరకు విద్యుత్తు శాఖ రక్షణ చర్యలకు నిధులు మంజూరు చేసింది. పాలకొల్లు ఎంఎంకేఎన్‌ఎం, బీవీఆర్‌ఎం బాలికల, బీఆర్‌ఎంవీ ఉన్నత పాఠశాలలు, దేశాలమ్మ ఆలయం వెనుక, లయన్స్ నగర్, అచ్చుగట్లపాలెం ప్రాంతాల్లో 25 పరివర్తకాల చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. రూ. 12 లక్షలతో చేపట్టిన ఈ పనులను మే నెలలో పూర్తి చేశారు.

# అభివృద్ధి వెంట.. పరుగెడదాం

భీమవరం : కోటి ఆశలు మోసుకుంటూ కొత్త సంవత్సరం వచ్చేసింది. చేదు అనుభవాలు పాఠాలుగా, గత విజయాలు పునాదులుగా వేసుకుని మనో ధైర్యంతో జిల్లా ప్రగతికి ముందుకు సాగితే అన్నీ మంచి రోజులే. జిల్లా యంత్రాంగం కొత్త లక్ష్యాలు, ప్రణాళికలు నిర్దేశించుకోవాలి. ఆధునికత – సాంకేతికతతో పాటు నైపుణ్యాభివృద్ధి అందిపుచ్చుకుంటే అభివృద్ధి మన వెంటే.


**ఉన్నతికి స్త్రీకారం**

డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలను ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త కింద తీర్చిదిద్దేందుకు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వ్యాపార స్థాపనకు, అభివృద్ధికి నమోదైన సంఘా'లకు రూ. 205 కోట్ల వరకు రుణాలు ఇప్పించారు. మరో 2700 గ్రూపులకు అందించేందుకు ప్రణాళిక చేశారు. నూతనంగా ఏర్పాటైన సంఘాలకు రూ. 15 వేలు, ఆదర్శవంతమైన మండల సమాఖ్యలకు రూ. 5 లక్షల రివాల్వింగ్ ఫండ్ కింద అందిస్తున్నారు.

**నైపుణ్య సిద్ధిరస్తు** ఉన్నత చదువులు పూర్తిచేసిన యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. పెదమైనవానిలంకలోని డిజిటల్ కేంద్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్‌ఈ), ఎన్ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సోలార్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నారు. ఇది కాకుండా ఏఐ, డ్రోన్లు, ఎలక్ట్రికల్ రంగాల్లో ఇచ్చే శిక్షణను అందిపుచ్చుకోవాలి.

**మీసం మెలేసిన రొయ్య** ప్రభుత్వం ఆక్వా రంగానికి ఊతమివ్వడానికి మేతలపై 5 శాతం తగ్గించడంతో పాటు, నాబార్డు సహాయం, నాణ్యమైన సీడ్ అందించడం, ఎగుమతులు పెంచేందుకు చర్యలు చేపట్టింది. చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి విద్యుత్తు రాయితీ, బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఆక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

**గోదావరి వాసికి స్వఛజలం** ప్రజలకు స్వఛమైన తాగునీటిని



అందించనున్నాయి జల్‌జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాలు. జలనిధి పథకం (వాటర్ గ్రిడ్) ద్వారా విజ్జేశ్వరం నుంచి మంచినీటిని అందించే పనులు ప్రారంభమయ్యాయి. 16 మండలాల్లో 854 గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ. 1400 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**పర్యాటక హారం**

ఆకివీడు మండలం దుంపగడపలో కాటన్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. ఉప్పుటేరులో బోటింగ్, పేరుపాలెం దగ్గర 9 కి.మీ. మేర విస్తరించి ఉన్న సాగర తీరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. పేరుపాలెం బీచ్, పెదమల్లం రిసార్ట్స్, యలమంచిలిలంక, చించినాడ, నరసాపురం గోదావరి తీర ప్రాంతాలు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పుష్కరాల నేపథ్యంలో రూ. 1.8 కోట్లతో రేవుల సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

**పరిశ్రమయేవ జయతే**

పారిశ్రామికవేత్తల కోసం విస్సాకోడేరులో 9.78, లిఖితపూడిలో 9.09 ఎకరాలు సిద్ధం చేశారు. జీ ప్లస్ టు బహుళ అంతస్తుల భవనం నిర్మించి ప్లగ్ అండ్ ప్లే విధంగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు కల్పించనున్నారు. యలమంచిలిలో కొబ్బరి ఉత్పత్తుల మార్కెటింగ్, దువ్వలో ప్రింటింగ్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం ఒక్కో క్లస్టర్‌కు రూ. 10 కోట్లు మంజూరు చేయనున్నారు.

## తీరానికి మణిహారం.. ప్రగతికి బీజం

బిట్రగుంట: తీర ప్రాంతానికి ఫిషింగ్ హార్బర్ పెద్ద వెలుగు తెచ్చింది. 115.69 ఎకరాల విస్తీర్ణంలో రూ. 288.80 కోట్లతో ఏర్పాటుచేస్తున్నారు. ఇది దేశంలోనే పెద్ద ఫిషింగ్ హార్బర్ల జాబితాలో ఒకటిగా నిలవనుంది మూడు జిల్లాల్లో 25 వేల మంది ఉపాధికి ఆధారంగా మారనుంది బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో నిర్మిస్తున్న మత్స్య రేవు. కృషపట్నంలోని ఓడరేవు జాతీయ స్థాయిలో ఎదగడంతో ఆ ప్రాంతంలో చేపల వేటకు కష్టకాలం వచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మత్స్యకారులకు ఉపాధి తగ్గిపోయింది. దీంతో పొరుగు రాష్ట్రాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**వలసలకు చెల్లు..**

ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో చేపల వేట సాగించే మత్స్యకారులు వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశ స్థాయిలో గుర్తింపు పొందేలా ఫిషింగ్ హార్బర్‌లో వసతులు కల్పిస్తున్నారు. 1250 బోట్లు ఆగే జెట్టీ సిద్ధంగా ఉంది. 45 భవనాలు పూర్తి చేశారు. సోలార్ పార్క్ కూడా రానుంది. మత్స్యకారులకు సబ్సిడీతో మెకనైజ్డ్ బోట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏటా రూ. 800 కోట్ల మేరకు మత్స్య సంపద ఫిషింగ్ హార్బర్ నుంచి ఎగుమతులు జరిగే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు.

**అప్పుడే బీజం**

2014-19 సంవత్సరాల మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చేపల వేట సాగించే మత్స్యకారులకు ఉపాధి చూపాలన్న సంకల్పంతో జువ్వలదిన్నె పరిధిలోని చిప్పలేరు వద్ద ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేసింది. రూ. 288.80 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసింది. ఆ తరువాత ప్రభుత్వం పనులు ప్రారంభించినా పూర్తి చేయలేకపోయింది. వైకాపా ప్రభుత్వంలో కొంత మేరకు జరిగాయి. అసంపూర్తి పనులకు తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది.



**మరో వరం**

పొట్టి శ్రీరాములు నడయాడిన గ్రామం జువ్వలదిన్నె. దీంతో చారిత్రక ప్రాంతంగా గుర్తింపు దక్కింది. ఈనేపథ్యంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు కావడం ఈప్రాంతానికి మరో వరమైంది. ఈనేపథ్యంలో 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు ఈగ్రామాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దాలని నిర?యించారు. ఈమేరకు రూ. 110 కోట్లతో పనులు చేపట్టారు. గ్రామంలో స్మారకమందిరం తదితర పనులు ప్రారంభించారు. ఇవి చేస్తుండగానే సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. ఇవి పూర్తి చేయాలని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ సీఎం దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. పూర్తి చేస్తే జువ్వలదిన్నెకు మరో వైభవం వస్తోంది. పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతుంది.

## దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు

పీలేరు : అన్నమయ్య జిల్లాలో మేజర్ పంచాయతీల్లో ముందు వరుసలో ఉన్న పీలేరు పంచాయతీ దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణం విస్తీర?ం పది కిలోమీటర్లు ఉంది. పంచాయతీ జనాభా 45 వేలు ఉండగా 20 మంది వార్డు సభ్యులున్నారు. ఏడాదికి పంచాయతీ అన్ని పన్నులు కలుపుకుని రూ. 4 కోట్లు ఆదాయం చేకూరుతుంది. పదివేలకుపైగా గృహాలు, 80 వీధులు ఉన్నాయి. 1922లో పంచాయతీగా ఏర్పడినా 1965లో మేజర్ పంచాయతీగా ఏర్పడింది. పట్టణ పరిశుభ్రత కోసం 40 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, రాయచోటి పట్టణాలకు 60 కిలోమీటర్ల మధ్యలో పీలేరు ఉండడంతో రోజు రోజుకు అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. విద్య, వైద్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతానికి ఆర్టీసీ డిపోతో పాటు, రైల్వే స్టేషన్ సౌకర్యం కూడా ఉంది. పీలేరు నుంచి ఇతర పట్టణాలకు రైలు సౌకర్యం అందుబాటులో ఉంది.

పంచాయతీ పరిధిలో మదనపల్లె మార్గంలో కామాటంపల్లె, చిత్తూరు మార్గంలో బందార్లపల్లె, చిన్నరెడ్డివారిపల్లె, తిరుపతి మార్గంలో కోటపల్లె, కడప మార్గంలో కావలిపల్లె ఉన్నాయి.

నేరాలను విచారించేందుకు పీలేరులో 1865లోనే జూనియర్ సివిల్ న్యాయస్థానం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, 11వ అదనపు జిల్లా న్యాయస్థానం, స్పెషల్ కోర్టులు ఉన్నాయి.

విద్యా పరంగా 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 34 ప్రైవేటు యూపీ, ఉన్నత పాఠశాలలు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మూడు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెండు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు సౌకర్యంగా ఐదు వసతి గృహాలున్నాయి.

పీలేరు పట్టణానికి తాగునీటి సౌకర్యం కోసం అయ్యపునాయుని చెరువు, కొత్తపల్లె చెరువులు ఉన్నాయి. ప్రజలకు సౌకర్యంగా 24 బోర్ల నుంచి నీటిని పంపింగ్ చేసి గొట్టాల ద్వారా సరఫరా చేస్తున్నారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటే పీలేరు పంచాయతీ పరిధిలోని బోర్లకు భూగరజేలాలు అభివృద్ధి చెందుతాయి.

పీలేరు ఆర్టీసీ డిపోలో 92 సర్వీసులు నడుస్తున్నాయి. పీలేరు నుంచి చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, మదనపల్లె, రాయచోటి పట్టణాలతో పాటు శ్రీశైలం, బెంగళూరు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. విద్యుత్తు ఈఈ కార్యాలయం, పంచాయతీరాజ్ డీఈ, నీటిపాదరులశాఖ డీఈ,. గృహనిర్మాణశాఖ డీఈ కార్యాలయాలున్నాయి. ఆధ్మాతికంగా కోటపల్లె, కడప మార్గంలో సూర్యనారాయణరెడ్డి నగర్‌లో రెండు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు, మదనపల్లె మార్గంలో శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, పట్టణంలో కాశీవిశ్వేరాలయం, శిర్డీ సాయిబాబా ఆలయం, అభయహస్త వినాయకస్వామి ఆలయం, శ్రీరామాలయం, కోదండ రామస్వామి ఆలయం, ఆసుపత్రి ఆవరణలో శ్రీరౌద్రాల అంకాళమ్మదేవత ఆలయాలున్నాయి.

# ప్రాంతీయ ఆసుపత్రికి మహర్దశ!

నర్సీపట్నం : ప్రసూతి సేవల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో సేవలు మరింత మెరుగవుతున్నాయి. మాతాశిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ మరిన్ని సదుపాయాలను సమకూర్చుతున్నారు. ప్రతినెలా ఇక్కడ 300 పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. హైరిస్క్ కేసులను మూడు రోజుల ముందుగానే ఇక్కడి శిశుజనన నిరీక్షణ కేంద్రానికి తరలించేందుకు వీలుగా 30 పడకలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రానికి అవసరమైన భవనం నిర్మాణానికి రూ.2.10 కోట్లని డెక్కన్ ఫైన్ కెమికల్స్ యాజమాన్యం సామాజిక బాధ్యత కింద మంజూరు చేయడం, నిర్మాణ పనులకు సభాపతి అయ్యన్న కొబ్బరికాయ కొట్టడం తెలిసిందే. శరవేగంతో పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గర్భిణుల వెంట సహాయకులకు ఇక్కడే వసతి, భోజనం సమకూర్చుతారు. ప్రస్తుతం 150 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు విస్తరణ చేసేందుకు ప్రతిపాదన వెళ్లింది. అనుమతి లభించగానే తదనుగుణంగా సదుపాయాలు పెరుగుతాయి. ఆసుపత్రికి రోజూ వందలమంది ఔట్ పేషేంట్లు వస్తుంటారు. వీరికి ఇబ్బంది లేకుండా ఆరు ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రూ.9.5 కోట్లు ఖర్చుతో నిర్మించిన కొత్త భవనంలోనే ఔట్ పేషేంట్లకు వైద్య సేవలు అందించనున్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలను ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వారి కోసం ఇటీవల క్యాంటీన్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.



గతంలో అధికంగా కేసులను విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపించేవారు. ఇప్పుడు ఆసుపత్రిలోనే వైద్యం అందించేలా సదుపాయాలు పెంచారు. కేజీహెచ్‌కు పంపే కేసులు గణనీయంగా తగ్గిపోయాయి. ఎన్టీఆర్ వైద్యసేవ విభాగంలో సేవలు మెరుగుపర్చారు. సాధారణ శస్త్ర చికిత్సలు ఇక్కడే చేస్తున్నారు.

గర్భిణులకు 18 నుంచి 22 వారాల మధ్య స్కానింగ్ చేసేందుకు రూ.35 లక్షల ఖర్చుతో స్కానింగ్ యంత్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ యంత్రం ద్వారా స్కానింగ్‌లు చేస్తారు. రోజుకు కనీసం నాలుగైదు స్కాన్‌లు చేయాలన్నది మార్గదర్శకం. ఇప్పటి వరకు ఈ ఆసుపత్రిలో ఈ సదుపాయం లేదు. ప్రైవేటు ల్యాబుల్లో చేయించుకోవాల్సి వచ్చేది. రూ.2500 నుంచి రూ.3వేలు వరకు గర్భిణులు వెచ్చించాల్సివచ్చేది.

స్కానింగ్ పేదలకు భారంగా ఉండేది. ఇప్పుడా ఇబ్బంది తప్పింది. ఇటీవలే లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ మంజూరైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న లేబర్ పూర్వపు ఆర్టీపీసీ ల్యాబ్ భవనంలోకి మార్పు చేయనున్నారు. ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లోని పరికరాలన్నీ వైద్య కళాశాలకు ఇవ్వడంతో భవనం ఖాళీగా ఉంది. దీన్నిప్పుడు వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఆసుపత్రిలోని మురుగునీరంతా బయటకు పోయేలా ఇటీవల డ్రైనేజీలను అభివృద్ధి చేశారు.

కేజీహెచ్ నుంచి 12మంది చొప్పున పీజీ వైద్య విద్యార్థులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, ఆర్థో తదితర విభాగాల్లో సేవలు అందుతున్నాయి. జిల్లా బాలల సురక్షకేంద్రం ఇక్కడే ఉంది. దీంట్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# రూ.20 కిలో గోధుమ పిండి

కర్నూలు : కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుకగా రూ.20కే కిలో గోధుమ పిండి పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఇస్తున్న బియ్యం, చక్కెర, జొన్నలు, రాగులతో పాటు కొత్తగా జనవరి 1 నుంచి పట్టణ ప్రాంతాల్లోని కార్డుదారులకు కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. కర్నూలు నగరం, నంద్యాల పురపాలకలోని చౌక దుకాణాలకు గోధుమపిండి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని అన్ని చౌకదుకాణాల ద్వారా జనవరి నుంచి కార్డుదారులందరికీ గోధుమ పిండి పంపిణీ చేసేందుకు తొలుత సన్నాహాలు చేశారు. తాజాగా ముందు పట్టణ ప్రాంతాల్లో ఇవ్వాలని




నిర?యించారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతారు.

**1.20 లక్షల మందికి లబ్ధి**

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 1,13,398 మంది కార్డుదారులు ఉండగా 70 టన్నుల గోధుమ పిండి వచ్చింది. 70 వేల మందికి పంపిణీ చేయనున్నారు. నంద్యాల మున్సిపాలిటీలో 71,763 మంది కార్డుదారులు ఉండగా 50 టన్నుల వరకు పిండి వచ్చింది. 45-50 వేల మందికి గురువారం నుంచి అందించనున్నారు.

# కొత్త పొద్దు.. కొంగొత్త ఆశలు

కాలగమనంలో.. ఓ మజిలీ ముగిసింది!!
గడిచిన ఏడాదిలో.. గడించిన అనుభవాలు!!
కొత్త కోరికలు.. కొత్త ఆశలతో కొత్త పొద్దును ఆహ్వానిద్దాం
సవాళ్లని స్వీకరిద్దాం శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి!! నిరాశ నుంచి ఆశా శిఖరానికి..
ప్రస్థానం సాగిద్దాం!!

కాలమనే నిరంతర ప్రవాహంలో.. ఎన్నెన్నో సుడులు, మలుపులు.. ఒక చోట సెలయేరులా పరిగెత్తితే, మరోచోట జలపాతంలా దూకుతుంది.. ఇంకోచోట పిల్ల కాల్వ అవుతుంది. మనిషి జీవితమూ అంతే.!! ముసురుకున్న చీకట్లను చీల్చుకుంటూ వెలుగు బాటను వెతుక్కుంటూ ముందుకు సాగిపోవాలి.. ఆశల తీరానికి చేరుదాం.. ఆనందాల మజిలీలో సేద తీరుదాం.. జిల్లా ప్రజలు కొత్త వత్సరానికి ఘన స్వాగతం పలికారు. అర్ధరాత్రి యువత సందడి చేసింది.. సమయం 12:00 కాగానే రహదారులపై చేరుకుని కేరింతలు కొట్టారు. కేకులు కోసి ఆనందాన్ని పంచుకున్నారు.

# పురం.. పట్టు పరిశ్రమకు వరం



హిందూపురం : హిందూపురం ప్రాంతం పట్టు పరిశ్రమ రంగానికి (మల్బరీ) ప్రసిద్ధి. ఇక్కడ రైతులు సాగుచేసే పంట మొదలు కొని పండించిన పట్టుగూళ్ల ఉత్పత్తులను స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే అమ్ముకోవడం.. వీటిని రీలర్లు తీసుకొని వివిధ రకాల పట్టుదారం తయారు చేయడం.. దారం ఉపయోగించి చేనేత కార్మికులు మగ్గాల సాయంతో చీర నేయడం. పట్టణంలోనే పట్టుచీరలను సామాన్య వ్యాపారులు విక్రయించడం.. ఆ తర్వాత బడా పారిశ్రామికవేత్తలు కాంచీపురం, బెంగుళూరు, చెన్నై, మైసూరు తదితర పెద్ద నగరాలకు ఎగుమతి చేసి...రోజుకు రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు చేపడుతూ లాభాలను ఆర్జిస్తున్నారు. రైతులు, గ్రామీణ కూలీలు, రీలర్లు, చేనేత కార్మికులు, వ్యాపారులతో పాటు ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వానికి పన్నుల రూపేణ ఆదాయ వనరుగా ఉంది.

కిరికెరలో పట్టు పరిశోధనాభివృద్ధి సంస్థ: బెంగుళూరు రహదారిలో కిరికెర గ్రామం వద్ద 70 ఎకరాల విస్తీర?ంలో 1995లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు పట్టు పరిశోధనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేసే సీనియర్ శాస్త్రవేత్త ఒకరు డైరెక్టర్‌గా, ఐదుగురు శాస్త్రవేత్తలు పరిశోధనలతో మల్బరీ మొక్కలు, గుడ్లు ఇతరత్రా కొత్త వంగడాలు సృష్టించి.. ప్రయోగాత్మకంగా రైతులకు ఇస్తారు. మంచి దిగుబడులు వచ్చిన తర్వాత వాటిని రాష్ట్రంలోని ఇతర జిల్లాల రైతులకు చేరుస్తారు. ఇక్కడే పంట సాగుచేసి, పట్టుపురుగులను పెంపకం చేసి, అల్లిన గూళ్లను దిగుబడి రూపంలో గుర్తించడానికి 16మంది అధికార, అనధికార సిబ్బంది ఉన్నారు. 150 పట్టుపురుగుల జాతుల రకాలను సంరక్షిస్తారు. మల్బరీని ఆశించే చీడపురుగుల నియంత్రణకు మందులను కనుగొంటారు. డిగ్రీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థులకు పరిశోధనపై శిక్షణ ఇస్తారు.

**మార్కెట్:** హిందూపురంలో ఉన్న పట్టుగూళ్ల విక్రయ కేంద్రానికి రోజూ 4వేల క్వింటాళ్ల పట్టుగూళ్లను రైతులు తెచ్చి విక్రయిస్తారు.

రీలింగు యూనిట్లు: కొనుగోలు చేసిన గూళ్లను ఉడికించి పట్టుదారం తీయడానికి రీలర్లు స్థానికంగానే 20 రీలింగు యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు.

పట్టుచీరల తయారీ పరిశ్రమలు: ముద్దిరెడ్డిపల్లిలో పట్టుచీరల తయారీకి పారిశ్రామిక వ్యాపారవేత్తలు 30కుపైగా పరిశ్రమలు స్థాపించుకున్నారు. పరిసరాల్లో పెద్దరెడ్డిపల్లి, వీవర్స్‌కాలనీ, సోమందేపల్లి, తదితర చోట్లా పట్టుచీరల తయారీ మగ్గాలు వేల సంఖ్యలో ఉన్నాయి.

సాగు విస్తీర?ం: రాష్ట్రంలో 1.46 లక్షల ఎకరాల్లో మల్బరీ పంట సాగులో ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలోనే 54,146 ఎకరాల్లో సాగవడం గమనార్హం. హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో 30వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 80వేల రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

# అదిగో.. ఆశల వసంతం 2026



అనకాపల్లి : కొత్త సంవత్సరం ఎన్నెన్నో ఆశల వేదిక.. కొత్త అవకాశాలు, సవాళ్లను మోసుకుంటూ 2026 మన ముందుకు వచ్చేసింది. నూతన వత్సరం జిల్లా ప్రజలకు కొన్ని వరాలను తీసుకొచ్చింది. వీటిని సరిగ్గా వినియోగించుకోగలిగితే మరింత మందికి ప్రగతి కాంతులు అందుతాయి.

**పారిశ్రామిక వెలుగు...** అనకాపల్లి జిల్లాలో 2025లో పారిశ్రామికంగా కీలక అడుగులు పడ్డాయి. ఈ ఏడాది వాటిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో పలు ఒప్పందాలు జరిగాయి. ఇందులో భాగంగా కీలక సంస్థ అనకాపల్లిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయి. నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్ కంపెనీ ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇదే మండలంలో గ్లోబల్ టాయ్స్ పార్కు ఏర్పాటు పనులు ఈ ప్రారంభం కానున్నాయి. రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ సంస్థ సౌరవిద్యుత్తు పరికరాల తయారీ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాదే ఈ పరిశ్రమ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.

**చేరువలో చిరకాల స్వప్నం..** జిల్లా పరిధిలో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు పోలవరం ఎడమ కాలువ కాలువ పనులు చకచకా జరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం రూ. 331 కోట్లతో నిర్మాణాలు చేస్తున్నారు. ఇప్పటికే తుని-నర్సీపట్నం మధ్య అక్విడక్ట్ పనులు పూర్తయ్యాయి. తాండవ నదిపైనా నిర్మాణాలు పూర్తయ్యాయి. దీన్ని జిల్లాలోని కాలువకు అనుసంధానించేందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసి అన్నదాతలకు సాగునీరు అందించనున్నారు. ఇదే పూర్తయితే.. జిల్లాలోని వేలాది ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది.

**ఇక చకచకా..** అల్లూరి జిల్లా మీదుగా విజయనగరం నుంచి రాజమహేంద్రవరం వరకు 516-ఇ జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి అల్లూరి జిల్లాలోని అరకులోయ, పాడేరు మీదుగా వెళ్లనుంది. ఇప్పటికే జిల్లా పరిధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. హుకుంపేట దగ్గర బ్రిడ్జిపనులు జరుగుతున్నాయి. అరకు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ పనులు అవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇవి పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో ఇకపై జిల్లా ప్రజలు, పర్యాటకులకు రాకపోకలకు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.

**ఎంఎస్‌ఎంఈలతో స్థానికులకు ఉపాధి..** ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇప్పటికే అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇంకా ఏర్పాటు చేయలేదు. భూములు కేటాయింపు దాదాపు అన్నిచోట్లా పూర్తది. ఏపీఐఐసీ అధికారులు ఈ ఏడాది మౌలిక వసతులు కల్పిస్తే చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు ముందుకు రానున్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు కూడా ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి.

# రోగులకు అండగా... సేవలు మెండుగా!

నర్సీపట్నం : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగవుతున్నాయి. ఆధునిక వసతులు, నిపుణులైన వైద్యులు ఉండడంతో చాలామంది విశాఖపట్నం వెళ్లకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందుతున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో గతంలో నెలకు నాలుగైదు వందల ప్రసవాలు జరిగేవి. ప్రైవేటుగానూ ప్రసూతి సేవలు మెరుగుపడటంతో ఈ ఆసుపత్రికి ప్రసవాల కోసం వచ్చేవారు తగ్గుతున్నారు. పసికందులకు అవసరమైన వార్మర్లు, ఫొటో థెరపీ యూనిట్లు సైతం ప్రైవేట్ పిల్లల ఆసుపత్రుల్లో ఉంటున్నాయి. ఇటీవలి కాలంలోనే రెండు పిల్లల ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి.మానసిక ఒత్తిడి, వ్యసనాలు గుండెకు ముప్పు తెస్తున్నాయి. హృద్రోగ సమస్యలకు గతంలో విశాఖపట్నం వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వారానికి ఒకరోజు విశాఖ నుంచి గుండెవైద్య నిపుణులు వస్తున్నారు. ఓ ప్రముఖ గుండె వైద్యనిపుణుడు త్వరలో పెదబొడ్డేపల్లి ఆసుపత్రిలో చికిత్సలు అందించనున్నారు. అన్ని వసతులతో ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. రేడియాలజిస్టు, న్యూట్రిషన్ నిపుణులు సైతం పట్టణంలో సేవలు అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఫిజియోథెరపీ ఆసుపత్రులు పెరిగాయి. నగరాల్లో మాదిరి 24 గంటలు అందుబాటులో ఉండే కార్పొరేట్ మందుల దుకాణాలు సైతం పలుచోట్ల వెలిశాయి. ఇటీవలి కాలంలో యువ వైద్యులు ఎక్కువగా ఆసుపత్రులు తెరిచారు. ప్రత్యేక సందరాలేను అనుసరించి ఉచిత వైద్య శిబిరాలు సైతం నిర్వహించి రోగులకు సాంత్వన కలిగిస్తున్నారు. ఎం.ఆర్.ఐ స్కాన్ సదుపాయంతో గతేడాది నుంచి ఓ ల్యాబ్ పనిచేస్తోంది. కొత్తగా మరిన్ని ల్యాబ్‌లు వచ్చాయి. గతంలో ఒకరిద్దరే ఎముకుల వైద్య నిపుణులు ఉండేవారు. వీరిసంఖ్య ఇప్పుడు పెరిగింది. నర్సీపట్నం మన్యం ముఖద్వారం ఉంది. ఇక్కడి వైద్యులపై నమ్మకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకేవీధి, చింతపల్లి, కొయ్యూరు



మండలాల నుంచి సైతం రోగులు వచ్చి ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. దంత, కంటివైద్యులు సైతం పెరిగారు. ఆధునిక యంత్రాలతో ఇప్పుడు ఈ వైద్యం అందుతోంది. నగరాల్లో మాదిరి బహుళ అంతస్తుల్లో కార్పొరేట్ మాదిరి ఆసుపత్రులు ఏర్పాటు కావడం గమనార్హం.

# శుచి.. రుచి.. ఆరోగ్యం

నూజివీడు : ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన ఆరోగ్యకమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో 'స్మార్ట్ కిచెన్'ను ఏర్పాటు చేశారు. హరేకృష? మూమెంట్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రైస్ స్టీమర్లను సిద్ధం చేశారు. ట్రయల్ రన్ నిర్వహించారు. ఇందులోనే ఇడ్లీ కూడా తయారవుతుంది. చట్నీ తయారీ, కూరగాయలు కోసే యంత్రాలు, గంటలో మూడు వేల దోసెలను వేసే యంత్రాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ కిచెన్‌లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తాజా కూరలు నాణ్యమైన ముడి పదార్థాలతో భోజనం తయారు చేస్తారు. ఆహార పదార్థాల నిల్వ నుంచి వడ్డింపు వరకు పరిశుభ్రత, ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తామని ఏవో లక్ష్మణరావు



పేర్కొన్నారు. వంటగది పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల అభిప్రాయాలను స్వీకరించి అవసరమైన మార్పులు చేస్తామన్నారు. అకడమిక్ డీన్ చిరంజీవి, శ్రీకాకుళం ఇన్‌ఛార్జి రఘు, హరేకృష? మూమెంట్ పర్యవేక్షకుడు జానకీరామ్ మాట్లాడుతూ 50 నిమిషాల్లో అయిదు వేల మందికి ఆహారం సిద్ధం అవుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రి కొలుసు పార్థసారథిలతో కలిసి వీటిని ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందుకు అనుగుణంగా ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.

# చూసీ.. చూసీ.. సేతులెత్తేశారు!

కైకలూరు : జిల్లాలోని శిథిల వంతెనల చింత తీరడం లేదు. నిర్మించి మూడు దశాబ్దాలు గడిచిపోవడంతో సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. శ్లాబ్ నుంచి పెచ్చులూడి, పిల్లర్ల నుంచి రాళ్లు ఊడి పడుతున్నాయి. రక్షణ గోడలు బీటలు వారి, కూలిపోయి స్థితిలో ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేస్తే మరికొంత కాలం వినియోగించుకోవచ్చు. ఏళ్లుగా నూతన వంతెనలు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. అవి కూలితే గ్రామాల మధ్య బంధాలు తెగిపోతాయి.మండవల్లి పసలపూడి, చింతలపూడి, కొమ్మల్లమూడి, లేల్లాపూడి గ్రామాలను కలిపే గుడివాడ ఛానెల్‌పై 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన గోడల్లోని ఇటుక రాళ్లు బయటకు రాలి పడుతున్నాయి. రేపో మాపో కూలేందుకు సిద్ధంగా ఉంది.

**ఆందోళన కలిగిస్తున్న వారధులు**

మండవల్లి మండలం భైరవపట్నం, ప్రత్తిపాడు, తక్కెళ్లపాడు గ్రామాలను కలిపే పోల్‌రాజ్ డ్రెయిన్‌పై వంతెన బీటలు వారి, రక్షణ గోడలు కూలిపోయాయి. ఈ వంతెన మీదుగా 15వేల మంది ప్రజలు వెళు తున్నారు. బ్రిటిష్ కాలంలో ఉంగుటూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన వారధి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇక్కడ ఉన్న టోల్‌గేట్ ను తప్పించుకోవడానికి చాలా మంది వాహనదారులు దీన్నే వినియోగిస్తున్నారు. 20 పంచాయతీలు ఉంగుటూరు వచ్చేందుకు ఇదే ఆధారం.



కైకలూరు కోరుకొల్లు ఏఎంసీ మార్గంలో పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థ కు చేరింది. నిత్యం 40 టన్నులకు పైగా ఆక్వా ఉత్పత్తులు, బియ్యం లోడులతో వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ఇది కూలితే రెండు మండలాల్లోని 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. జల వనరుల శాఖ డీఈ శిరీష, రోడ్లు భవనాలు డీఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ శిథిల వంతెనల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు.

**సామర్థ్యాన్ని మించి వాడడం వల్లే**

మూడు దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు తగ్గట్టుగా వంతెలను నిర్మించారు. ఇప్పుడు 20 నుంచి 50 టన్నుల సామర్థ్యంతో వాహనాలు ప్రయాణిస్తుండటంతో వాటి సామర్థ్యం దెబ్బతింటోంది. అధికారులు వంతెన సామర్థ్యం, వెళ్లాల్సిన టన్నుల పరిమాణం సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు.

# ఉద్యమ పథం.. ఉపాధికి ఊతం

అల్లూరు: శతాబ్దాలుగా జిల్లాలోని అల్లూరు తీరం ఉప్పు తయారీకి ప్రసిద్ధి. ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలుగుతోంది. దీనికి స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యం కూడా ఉంది. నాడు రైతులు నీటిని తోడి ఉప్పు పండించేవారు. నేడు యంత్రాల ద్వారా మడులకు నీరు పెట్టి తయారుచేస్తున్నారు. ఆహారం నుంచి పారిశ్రామిక కేంద్రాలకు అవసరమయ్యే దాన్ని కూడా ఉత్పత్తి చేస్తున్నారు. రాజుల కాలం నుంచి ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాల్లో తయారీ ఉన్నట్లు తెలుస్తోంది. ఉప్పు గల్లు అమ్ముకుని జీవనం సాగిద్దామనే సామెత నుంచి ఉప్పు కొటారులపై రూ. లక్షలు సంపాదించే స్థాయికి చేరారు. సుమారు 20 సంవత్సరాల క్రితం క్వింటాల్ రూ.20 ఉంటే నేడు రూ.400 వరకు ధరలు పెరిగాయి. ఉప్పు వినియోగం పెరగడం, తయారీ ప్రాంతం ఇతర అవసరాలకు వినియోగించడంతో ఈ పరిస్థితి వచ్చింది. రాజుల కాలంలో ఉప్పు తయారీ కేవలం ఒక వృత్తిగా సాగింది. బ్రిటిష్ పాలకుల కాలంలో పన్నులు వేయాలని అలోచన రావడంతో స్థానికంగా వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆందోళనలు ప్రారంభించారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారు. ఆసమయంలో ఆయన ఇక్కడికి వచ్చి ఉప్పు సేకరించారు. నాడు అల్లూరులోని బాపూజీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈప్రాంత ప్రజల్లో ఉద్యమ కాంక్షను రగిలించారు. పట్టువదలని ఉప్పు తయారీదారులు ఉద్యమం కొనసాగించారు.

స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్యం అనంతరం తయారీ మరింత పెరిగింది. ఇస్కపల్లిలో ఉప్పు కార్యాలయం కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం లీజు విధానంలో రైతులకు భూములు కేటాయించింది. దీంతో ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాలు తయారీ కేంద్రాలుగా మారాయి. గతంలో బికెనాల్ ద్వారా ఇస్కపల్లి నుంచి ఎక్కువగా ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం సుమారు ఆరు వేల ఎకరాల్లో ఉత్పత్తి అవుతోంది. ఆరంభంలో సుమారు 200 ఎకరాల్లో సాగయ్యేది. కాలక్రమంలో ఆరు వేల ఎకరాలకు చేరుకుంది. ప్రస్తుతం దేశంలోనే అల్లూరు తీర ప్రాంత ఉప్పునకు మంచి పేరుంది. ఇక్కడి నుంచి ఐదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 50 వేల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు.

చురకలు



## ఐటీ సంస్థలొస్తున్నా.. అడ్డంకులెన్నో!

విశాఖపట్నం : ఐటీ దిగ్గజ సంస్థ 'కాగ్నిజెంట్'కు కేటాయించిన భూములకు సమీపంలో అభివృద్ధి చేయ తలపెట్టిన బృహత్తర ప్రణాళిక లోని కీలక రోడ్డు పనులకు అంతరాయం ఏర్పడింది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేలోపు నగరం నుంచి అక్కడికి వెళ్లేందుకు ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా వీఎంఆర్డీఏ ఏడు మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మిస్తోంది. జాతీయ రహదారిపై శివశక్తినగర్ నుంచి 'హరిత' నివాస సముదాయానికి వెళ్లే 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు కూడా ఇందులో ఉంది. ఈ 'హరిత' పక్కనే 'కాగ్నిజెంట్'కు 22.19 ఎకరాలు కేటాయించారు. శుక్రవారం ఇక్కడ సీఎం చంద్రబాబు భూమి పూజ చేయనున్నారు. కాగ్నిజెంట్‌కు సమీపంలోని మాస్టర్‌ప్లాన్ రోడ్డు చాలా కీలకమైంది. రోడ్డు విస్తరణకు తీసుకోదలిచిన భూములకు 21 మంది



యజమానులున్నారు. ముగ్గురికి ఇప్పటికే టీడీఆర్‌లు ప్రతిపాదించి స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పది మంది స్థలాలిచ్చేందుకు ముందుకొచ్చారు. మరో ఏడుగురు సానుకూలంగా స్పందించారు. అయితే వైకాపా మాజీ కార్పొరేటర్ కుటుంబానికి సుమారు 250 గజాల స్థలం ఉంది. ఈ ఒక్కరు స్థలం ఇవ్వడానికి ఆసక్తి చూపకపోవడంతో విస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ స్థలం వదిలి మిగిలిన చోట విస్తరణ పనులు త్వరలో చేపడుతామని వీఎంఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తయితే... ట్రాఫిక్ మళ్లింపునకు ఎంతో ఉపయోగపడుతుంది.

## ఇల కైలాసంలో.. డిజి'డల్' సేవలు

శ్రీశైలం : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో డిజిటల్ చెల్లింపులు అందుబాటులో లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానంలో వసతి విభాగం, దర్శనం టికెట్లు, ప్రసాదాలు, టోల్‌గేట్, పెట్రోల్ బంకు తదితరాల్లో డిజిటల్ సేవలు అందుబాటులో లేవు. క్షేత్ర పరిధిలోని సత్రాలు సైతం ఈ దూరంగా ఉన్నాయి. వ్యాపార సంస్థలు కొన్నింటికి మాత్రమే డిజిటల్ సేవలు ఉండగా మరికొన్నింటికి లేవు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా ఉండకపోవడంతో సర్వర్లు పనిచేయక డిజిటల్ సేవలు అందడంలేవు. క్షేత్ర పరిధిలో సిగ్నల్స్‌ను పెంచేందుకు దేవస్థానం అధికారులు, నెట్‌వర్క్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

**ఆర్జిత సేవలు:** రూ.150 నుంచి రూ.5వేల వరకు ఆర్జిత సేవలు, దర్శనాలు అందుబాటులో ఉన్నాయి. రూ.5వేలు గర్భాలయ అభిషేకం, రూ.1000 అమ్మవారి కుంకుమార్చన, చండీ హెూమాలు, రుద్రహెూమం, స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం తదితర సేవలకు ఆన్‌లైన్‌లోనే తీసుకోవాల్సి ఉంటుంది. దర్శనానికి వెళ్లేందుకు రూ.150, 300, 500, వీఐపీలకు సీఆర్‌వో ఆఫీసులో ఇచ్చే స్పర్శ దర్శనం టికెట్లకు సైతం డిజిటల్ సేవలు అందుబాటులో లేవు. తప్పనిసరిగా నగదు చెల్లించాల్సిందే.

**ప్రైవేటు సత్రాలు:** క్షేత్ర పరిధిలో సుమారు 60 వరకు ఉన్న కుల సత్రాల్లోనూ డిజిటల్ సేవలు లేవు.

**పెట్రోల్ బంకు:** క్షేత్ర పరిధిలో రెండు పెట్రోల్ బంకులు ఉన్నాయి. దేవస్థానం నిర్వహిస్తున్న భారత్ పెట్రోల్ బంకులో రోజుకు రూ.లక్షల విలువైన ఇంధన విక్రయాలు జరుగుతున్నా.. డిజిటల్ సేవలకు అనుమతి లేదు. మరోటి ఐవోసీ(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) నిర్వహించడంతో డిజిటల్ సేవలు అనుమతిస్తున్నారు.

వసతి విభాగం: క్షేత్ర పరిధిలో దేవస్థానానికి వందల సంఖ్యలో గదులు ఉన్నాయి. నిత్యం రూ.లక్షల్లో జరుగుతున్న లావాదేవీలకు నగదు



రూపంలోనే చెల్లించాల్సి ఉంది.

**ప్రసాద విక్రయ కేంద్రాలు:** నిత్యం 50వేలకు పైగా అమ్ముడు పోయే ప్రసాదాలతో పాటు స్వామి అమ్మవార్ల ప్రచురణల కేంద్రం, విభూది, కుంకుమ తదితర విక్రయ కేంద్రాల్లో సైతం నగదు చెల్లింపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**ఆదాయంగా మార్చుకొని:** క్షేత్ర పరిధిలోని ఏటీఎంలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. దీంతో భక్తులు నగదు తీసుకునేందుకు స్థానిక వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా రూ.వెయ్యికి రూ.30 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టోల్‌గేట్: శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద ప్రైవేటు బస్సులకు రూ.200, తెలంగాణ, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు రూ.125, లోడ్‌తో వచ్చే లారీలకు రూ.500, ఖాళీగా వచ్చే లారీలకు రూ.200, కారు, జీపు తదితర వాహనాలకు రూ.100, ఆటోలకు రూ.30 వసూలు చేస్తారు. నిత్యం వెయ్యికి పైగా వాహనాలు వస్తాయి. ఇక్కడ కూడా డిజిటల్ సేవలు అందుబాటులో లేవు.

## అడ్డదిడ్డంగా ఆపితే బాదుడే!

అనకాపల్లి : అనకాపల్లి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను ఇష్టం వచ్చినట్లు ఆపడంతో సమస్య తలెత్తుతోందని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలకు భారీ జరిమానా విధిస్తున్నారు.

అనకాపల్లిలోని ప్రధాన రహదారి, పూడిమడక రోడ్డు, పెరుగుబజార్, ఎన్టీఆర్ ఆసుపత్రి ఏరియా, పెరుగుబజార్, నెహ్రూచౌక్, రింగురోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో మరింత పెరుగుతుంది. ఈ సమయంలో ద్విచక్రవాహనాలు. కార్లు, ఆటోలను ఇష్టం వచ్చినట్లుగా పార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు హెచ్చరికలు జారీచేస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఇక నుంచి భారీ జరిమానా విధించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టి రాంగ్ పార్కింగ్ చేస్తున్న వాహనాలకు ఏకంగా రూ. 1535 జరిమానా విధించారు. ట్రాఫిక్ సమస్య తీవ్రతకు వాహనాల రాంగ్ పార్కింగే కారణమని గుర్తించాం. ఇప్పటివరకు హెచ్చరికలు జారీచేసినా మార్పురావడం లేదు. ఇక నుంచి జరిమానాలు విధించాలని నిర్ణయించాం. గతంలో రూ. 1000 ఉండేది. దీన్ని రూ.1535కి పెంచారు. దీన్ని వాహనదారులు గుర్తించాలి.
వెంకట నారాయణ, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ

# పప్పుసెనగ పండేనా?



ఉరవకొండ : ఎన్నో ఆశలతో పప్పుసెనగ పంట సాగు చేసిన అన్నదాతలను వాతావరణంలో మార్పులు నట్టేటా ముంచేలా ఉన్నాయి. ఎంతో శ్రమించి, రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటకు చీడపీడలు ఆశిస్తున్నాయి. దీనివల్ల ఆశించిన దిగుబడి దక్కక.. పెట్టుబడి కూడా వచ్చేలా లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలోని నల్లరేగడి నేలల్లో రబీ సీజన్‌లో పప్పుసెనగ పంట సుమారు 1.20 లక్షల ఎకరాల్లో సాగైంది. గతేడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ ఉరవకొండ, గుంతకల్లు, కణేకల్లు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో సాగు పెరిగింది. ఇప్పటికే రైతులకు ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు.

సాధారణంగా ఎకరాకు రూ.6 నుంచి 10 బస్తాల దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి 2 బస్తాలకు మించి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అకస్మాత్తుగా ఎండుతూ..**

ఆశాజనకంగా ఉన్న పంటకు అకస్మాత్తుగా ఎండు తెగులు ఆశిస్తోంది. దీంతో మొక్కలు ఎండుముఖం పట్టాయి. ప్రతికూల వాతావరణ ప్రభావంతో పచ్చపురుగు ఆశించి ఆకులను తినేస్తోంది. ఖరీదైన మందులు పిచికారీ చేసినా నియంత్రణ కావడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు పురుగు మందుల దుకాణాదారులు నాసిరకం మందులు అధిక ధరలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాగైతే కనీసం పెట్టుబడులు కూడా దక్కేలా లేవు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం. కాపు దశలో ఉన్న పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**సస్యరక్షణ చర్యలతోనే నివారణ: ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి**

జిల్లాలోని పప్పుసెనగ పంటకు ఎండు తెగులు సోకుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు అందించాలని ఏఓలను ఆదేశించాం. ఎండుతెగులు నియంత్రణకు కాపర్ ఆక్సిక్లోరైడ్.. లీటరు నీటికి 3 గ్రాముల పొడిని కలిపి పిచికారీ చేయాలి. ప్రాథమిక దశలోనే తెగులు సోకిన మొక్కలు తొలగిస్తే వ్యాప్తి తగ్గుతుంది. పచ్చపురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ ఎకరాకు 125 గ్రాములు ఇమామెక్టిన్ బెంజాయెట్ 90 గ్రాముల చొప్పున పిచికారీ చేస్తే తెగుళ్లు నింత్రించవచ్చు.

# మార్కెట్ యార్డు నిర్మాణం.. చదునులో మాయాజాలం



పుట్టపర్తి : కొన్ని నిర్మాణాలు ప్రజలకు ఉపయోగపడేవైతే.. మరికొన్ని పనులు కొందరి జేబులు నింపుకొనేందుకు పనికొస్తాయి. నల్లమాడలో నిర్మిస్తున్న పుట్టపర్తి మార్కెట్‌యార్డు పనులే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని చదును చేయడానికే రూ.కోట్లు ఖర్చు చేశారంటే.. దీనివెనుక ఎలాంటి ప్రయోజనం ఉందో అందరికీ అర్థమవుతోంది. గత వైకాపా ప్రభుత్వం పుట్టపర్తికి వ్యవసాయ మార్కెట్ యార్డును కేటాయించింది. అప్పటికే కొత్తచెరువులో ఉప వ్యవసాయ మార్కెట్ ఉండటంతో పుట్టపర్తికి సంబంధించి నల్లమాడలో నిర్మించాలని ఏఎంసీ నిర్ణయించింది. తీర్మానం మేరకు స్థల సేకరణ చేపట్టారు. అరవవాండర్లపల్లి తండా వద్ద సర్వే నంబర్లు 1363, 1364, 1365లో మొత్తం 14.10 ఎకరాలను 2020లో కేటాయించారు.

**నిధులు కరిగినా.. కనిపించని ప్రయోజనం**

మార్కెట్ యార్డు నిర్మాణానికి కేటాయించిన ప్రాంతంలో స్థలం చదునుకు రూ.3 కోట్లు, భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు, ప్రహరీకి రూ.2.50 కోట్లతో 2021లో ప్రతిపాదనలు పంపారు. గుట్ట ప్రాంతంలో స్థలం కేటాయించడంతో చదును చేసేపనిని కడపకు చెందిన ఓ గుత్తేదారుకు అప్పగించారు. సదరు గుత్తేదారు మొస్తరుగా చదును చేసి రూ.2.85 కోట్లు బిల్లు చేసుకున్నాడు. ఎకరాకు దాదాపు రూ.20.21 లక్షలు ఖర్చు చేశారన్నమాట. చదును పేరుతో నాడు కొందరు వైకాపా నాయకులు నిధులు కొట్టేసేందుకు ఇలా చేశారనే ఆరోపణలున్నాయి.

**పరిహారం ఊసేదీ?**

సదరు భూమిని తమకు ప్రభుత్వం 1987లో ఇచ్చిందని, పరిహారం ఇవ్వాలని 11 మంది రైతులు 2020 నుంచి ఆందోళన చేస్తున్నారు. నేటికీ భూములు తమ పేరుమీదే ఉన్నాయని, న్యాయం చేయలేదని కోరుతున్నారు. పలుమార్లు కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదులు అందించారు.

**స్వాధీనం చేసుకోలేని పరిస్థితి**

పనులు దక్కించుకున్న గుత్తేదారు భవన నిర్మాణ పనులను మరొకరికి సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చినట్లు తెలిసింది. సదరు గుత్తేదారు 2023లోనే భవన నిర్మాణం పూర్తి చేసినా.. భూమి చదును పనుల్లో జరిగిన అవకతవకలు తేలనిదే బిల్లులు ఇవ్వలేమని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గుట్ట వాలు ప్రాంతంలో ఉండటంతో ప్రహరీ నిర్మాణం సాధ్యం కాదని ఇంజినీర్లు తేల్చి చెప్పడంతో ప్రభుత్వం సదరు పనులూ రద్దు చేసింది. కూటమి ప్రభుత్వంలోనైనా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు స్పందించి అవకతవకలు తేల్చి రైతులకు పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది.

**విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాం**

నరసింహమూర్తి, జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీ

భూమి చదును వ్యవహారంపై ఈ ఏడాది ఏప్రిల్ 24న విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాం. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. వారి ఆదేశాల మేరకు భవనం స్వాధీనం చేసుకుంటాం. రైతుల పరిహారం విషయం రెవెన్యూశాఖ పరిధిలో ఉంది.

# ప్రయాస లేకుండా చేతికి పత్రం

తిరుపతి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు ఏటా జీవన ప్రమాణ పత్రం పొందాలి. వాటి కోసం పింఛనుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా తంటాలు పడేవారు. ఆ పద్ధతికి స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం 'జీవన్ ప్రయాణ్ యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దాని ద్వారా సులువుగా ధ్రువపత్రాన్ని పొందేలా ప్రణాళిక సిద్ధం చేసింది.

**ధ్రువపత్రం పొందడం ఇలా..**

యాప్‌లో ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదు చేయగానే పింఛనుదారుల పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి.
పేరు, పీపీవో సంఖ్య, బ్యాంకు డిపార్ట్‌మెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు పొందుపరచాలి.

తర్వాత ఫేస్ స్కాన్ చేస్తే లైవ్ సర్టిఫికెట్ జనరేట్ అనే సందేశం వస్తుంది. గతంలో జీవన పత్రం పొందిన వారు వివరాలను కొత్తగా నమోదు చేయాల్సి ఉంటుంది.


**రిజిస్ట్రేషన్ విధానం ఇదీ...**

గూగుల్ ప్లే స్టోర్‌లో 'జీవన్ ప్రయాణ్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆధార్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదు చేసి లాగిన్ అవ్వాలి. చరవాణికి వచ్చిన ఓటీపీ ఎంటర్ చేయగానే ముఖ ధ్రువీకరణ అడుగుతుందిఅనంతరం పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సక్సెస్ అనే సందేశం వస్తే రిజిస్ట్రేషన్ పూర్తయినట్లే.

**వీరికి ఊరట..**

గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు ఇతర దూర ప్రాంతాల నుంచి వృద్ధులు ఈ పత్రాల కోసం సమీప పట్టణాలకు వస్తుంటారు. యాప్ రావడంతో వారికి ప్రయాస తగ్గనుంది.

**మూడు ప్రత్యేక కౌంటర్లు..**



డిసెంబర్‌లోగా కేంద్ర, ఫిబ్రవరిలోగా రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు పత్రాలు సమర్పించాలి. తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయంలో జనవరి నుంచి 3 నమోదు కేంద్రాలు , యూనియన్ ప్రతినిధులు వేరేగా కౌంటర్లు ఏర్పాటు చేస్తారు.- లక్ష్మీకర్ రెడ్డి, డీటీఓ

జిల్లాలో వివరాలు..

ఉప ఖజానా కార్యాలయాలు - 12

పింఛనుదారులు - 17,626

## స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32-సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్-పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్-2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

## గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ-పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ. 523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ-పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్-2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్-1, ఫేజ్-2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ-పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

## తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

చురకలు



# వరి... ఆశలు ఆవిరి!

త్రిపురాంతకం : విత్తు నుంచి పంట దశ వరకు అన్నదాతలు పలు రకాలుగా మోసాలకు గురవుతూ అన్ని విధాలా నష్టాలపాలవుతున్నారు. త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన రైతులు పల్నాడు జిల్లా వినుకొండలోని ఓ ప్రైవేటు విత్తన దుకాణంలో ఎంటీయూ–1010 రకం వరి విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1,200 చొప్పున 72 బస్తాలు కొనుగోలు చేశారు. ఖరీఫ్ వరి కోతలు కోసే ముందుగా నారుమడిని సిద్ధం చేసి పొలంలో చల్లిన వరి విత్తనాల మొలక శాతం తగ్గింది. దీంతో 30 కిలోల సంచి విత్తనాలను నారుమడిగా పెంచితే ఎకరాకు సరిపోవాల్సి ఉండగా, అరకొరగా



మొలకెత్తడంతో అర ఎకరాకు కూడా సరిపోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే దుకాణంలో కొన్న మరో రకం వరి విత్తనాల నారుమడి ఏపుగా పెరిగి మెండుగా ఉందని రైతులు అంటున్నారు. మొలక శాతం క్షీణించిన ఎంటీయూ–1010 రకం వరి విత్తనాలతో నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

**తీవ్రంగా నష్టపోయా..**

రబీలో 13 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు ఎంటీయూ–1010 రకం వరి విత్తనాలు 13 బస్తాలు రూ.15,600కు కొన్నాను. పొలంలో విత్తనాలు చల్లగా మొలకశాతం తగ్గడంతో నారు పలచగా మొలిచింది. దుకాణదారునికి విషయం చెప్పడంతో పరిహారం ఇప్పిస్తానని చెప్పి ఇంతవరకు పట్టించుకోలేదు. దీంతోపాటు దుక్కులు, విత్తనాల కొనుగోలు ఖర్చులు సైతం నష్టపోవాల్సి వచ్చింది.

బద్దిగం వెంకటేశ్వరెడ్డి, బాధిత రైతు

# ఇక్కడ ఫిట్‌నెస్ లేదు!

ఒంగోలు : ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ).. వాహనాలకు సంబంధించి అత్యంత కీలక పత్రం. ఏదైనా వాహనం రోడ్డెక్కాలంటే రవాణాశాఖ జారీ చేసే ఈ పత్రం తప్పనిసరి. రవాణా, వ్యక్తిగత వాహనాలకు ప్రతి ఏటా తప్పకుండా ఎఫ్‌సీ చేయించాల్సిందే. ఇందుకోసం జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో నిత్యం వాహనాలు బారులుతీరుతాయి. గత వారం రోజులుగా జిల్లాలో ఎఫ్‌సీ జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఎఫ్‌సీ జారీ చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖ నుంచి వేరు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడమే కారణమని తెలుస్తోంది.

**ఏర్పాటు పూర్తి కాలేదు**

జిల్లాలో ఎఫ్‌సీ జారీ చేసే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను ఓ ప్రైవేటు ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. దీనిని మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. నిబంధనల మేరకు డిసెంబరు 1వ తేదీ నుంచి ఎఫ్‌సీ జారీ ప్రక్రియ ఏటీఎస్ సెంటర్ ద్వారా జరగాల్సి ఉంది. జిల్లాకు కేటాయించిన ఏటీఎస్ సెంటర్ ఇప్పటికీ సిద్ధం కాకపోవడంతో జిల్లాలోని వాహనాలకు ఎఫ్‌సీ జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. నవంబరు నెలాఖరులోపు స్లాట్ బుక్ చేసుకున్న వాహనాలకు ఒంగోలులోని డీటీసీ కార్యాలయంలోనే ఎఫ్‌సీలు జారీ చేయాల్సి ఉ



ంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో పత్రాల జారీ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. దీంతో వాహన యజమానులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**తప్పని ఇబ్బందులు**

ఏదైనా వాహనం ఎఫ్‌సీ లేకుండా రోడ్డు మీదకు రావడం నేరం. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమాని, చోదకుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే బీమా సైతం వర్తించదు. దీంతో ఈ ఏడాది డిసెంబరులో ఎఫ్‌సీ పొందాల్సిన వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఏటీఎస్ కేంద్రం ఇప్పటికీ సిద్ధం కాకపోయినప్పటికీ ఒంగోలు డీటీసీ కార్యాలయంలో ఎఫ్‌సీ జారీ చేసే ప్రక్రియను నిలిపివేశారు. దీంతో వాహనదారులు ఎఫ్‌సీ కోసం సమీప ప్రాంతాలైన గుంటూరు, నెల్లూరుతో పాటు పశ్చిమ ప్రాంత వాసులు నంధ్యాల, కడప జిల్లాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. గుండ్లాపల్లిలోని ఏటీఎస్ కేంద్రం పూర్తిస్థాయిలో సిద్ధం కాకపోవటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఉపరవాణా కమిషనర్ ఆర్.సుశీల చెబుతున్నారు.

# పునరావాసం.. పరిహాసం!

బేస్తవారపేట: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అటు ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాక, ఇటు పునరావాస కాలనీల్లో కనీస మౌలిక వసతుల్లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్థవీడు మండలం కాకర్ల గ్యాప్ పరిధిలోని ప్రాజెక్టు ముంపు గ్రామాలైన లక్ష్మీపురం, కృష్ణా నగర్, సాయిరాంనగర్, వాసులకు బేస్తవారపేట మండలం ఒందుట్ల సమీపంలో 117 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అక్కడ మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12.84 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు కేవలం రూ.4 కోట్ల మేర పనులు మాత్రమే పూర్తి చేశారు. నేటికి ఒక్క గృహ నిర్మాణం జరగలేదు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో చిల్లచెట్లు పెరిగిపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూరకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**అన్నీ అరకొర పనులే**అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.3.7 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.1.70 కోట్లతో పనులు పూర్తిచేశారు.

తాగునీటి సరఫరా నిమిత్తం రూ.49.5 లక్షలు మంజూరైనా రూ.25 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు మాత్రమే నిర్మించారు. చిన్నపిల్లల పార్కు ఏర్పాటుకు రూ.35.5 లక్షలు కేటాయిస్తే ఇప్పటివరకు రూ.17.5 లక్షల పనులు చేపట్టి వదిలేశారు.

రూ.33 లక్షలతో చేపట్టిన పశువైద్యశాల భవన నిర్మాణం పునాది స్థాయిలోనే నిలిచిపోయింది

# గోడు విని.. గూడు నిలబెట్టి



చిత్తూరు : రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చాక నాటి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్థాంతరంగా నిలిపేసింది. చివరకు పేదల గృహ నిర్మాణాలపైనా తన ప్రతాపం చూపింది. అప్పట్లో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించకుండా కక్ష తీర్చుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఈ పథకంపై దృష్టి సారించింది. ప్రస్తుతం వాటికి బిల్లులు చెల్లించేందుకు కసరత్తు జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పంలో ఇటీవల మరోదఫా సర్వే చేశారు. తొలుత వీరికి బిల్లులు మంజూరు కానున్నాయి.

**51,827 మందికి లబ్ధి**

ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో బిల్లులు రాని లబ్ధిదారులకు ఆ మొత్తం వచ్చేలా చర్యలు చేపట్టారు. అప్పట్లో ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. 2019లో తెలుగుదేశం అధికారం కోల్పోయే నాటికి తిరుపతి జిల్లాలో 23,484 గృహ నిర్మాణాలకు రూ.39.06 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చిత్తూరులో 28,343 ఇళ్లకు రూ.46 కోట్లు రావాలి. మొత్తంగా 51,827 మందికి రూ.85.06 కోట్లు చెల్లించాలి.

**యాప్‌లో నమోదు..**

గతేడాది ఆయా గృహాల వద్దకు వెళ్లి ప్రస్తుత స్థితిని తెలిపేలా యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఒకవేళ బిల్లు రాకున్నా పేదలే సొంతంగా డబ్బు ఖర్చు పెట్టుకుని పూర్తి చేయించుకుని ఉంటే ఆ వివరాలు కూడా పొందుపరిచారు. 2019 నాటికి గృహ నిర్మాణ స్థితి, ఇప్పుడు పూర్తయిన ఇంటి ఫొటోను అప్‌లోడ్ చేశారు. సర్కార్ నుంచి రావాల్సిన మిగతా మొత్తాన్ని పేదల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇప్పటికీ పూర్తి కాని లబ్ధిదారుల ఖాతాలు క్రియాశీలకంగా ఉన్నాయా? లేదా? అని తెలుసుకోవడానికి తొలుత వారి ఖాతాల్లో ఒక్క రూపాయి జమ చేయనున్నారు. ఎలాంటి ఇబ్బంది లేదనుకుంటే మిగతా మొత్తం విడుదల చేయనున్నారు. రెండు– మూడు నెలల్లో నగదును గృహ నిర్మాణదారులకు చెల్లించాలని కసరత్తు చేస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో బిల్లులు రావాల్సిన ఇళ్లు 28,343

బకాయిలు రూ.46 కోట్లు

# బజ్జున్న.. బొజ్జన్నకొండ అభివృద్ధి!




అనకాపల్లి : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా ఉంది బొజ్జన్నకొండ అభివృద్ధి పరిస్థితి. కేంద్రప్రభుత్వం కొన్నేళ్ల క్రితం పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు విడుదల చేసింది. కానీ.. ఈ నిధులు వినియోగించుకోవడంలో నాటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో బొజ్జన్నకొండ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది.

అనకాపల్లి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న బొజ్జన్నకొండ కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ పరిధిలో ఉంది. కొండపైన, గుహలోపల శిల్పసంపద, బుద్ధుని విగ్రహాలు, ధ్యాన మందిరాలు, బౌద్ధ భిక్షువుల ఆవాసాలు ఆకట్టుకుంటాయి. ప్రాచీన బౌద్ధ శిల్పకళా సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరొందిన ఈ ప్రదేశం ప్రస్తుతం అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. దీనికి పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రూ. 7.5 కోట్లు విడుదల చేసింది.

కేంద్ర నిధులతో ధ్యానమందిరం, వసతుల కేంద్రం, లేజర్‌షో, సౌండ్ అండ్ లైటింగ్ షో, పార్క్, రహదారులు, లైట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ పనులను అప్పట్లో ఉన్న వైకాపా ప్రభుత్వానికి అప్పగించింది. కొన్ని పనులు చేసిన గత సర్కారు మధ్యలో వదిలేసింది. దీంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.1.27 కోట్లతో నిర్మించిన వసతుల కేంద్రం నిరుపయోగంగా మారింది. లేజర్ షో ఏర్పాటు చేసినా..ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్తు దీపాలకు రక్షణ లేకపోవడంతో అవికాస్తా దొంగలపాలయ్యాయి. పర్యాటకులకు మార్గనిర్దేశం చేసేలా లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు పనులు మొదలు పెట్టనే లేదు. పనుల్లో నిర్వహణ లోపం అడుగడుగునా కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. వచ్చిన పర్యాటకులకు కనీసం తాగేందుకు నీరు లేని పరిస్థితి దాపురించింది.

పర్యాటక సీజన్ ప్రారంభమై నెల దాటుతున్నా.. ప్రజల తాకిడి అంతంతమాత్రంగానే ఉంది. ఈ కొండకు రోడ్డు గుంతలమయంగా మారడం. క్వారీల లారీలు అధికవేగంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడంతో పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు.

గతంలో రోజూ సుమారు 300 మంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం వంద మంది కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

**ముందుకు కదలని దస్త్రాలు..**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో బొజ్జన్నకొండను అభివృద్ధి చేసేందుకు సవివర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపొందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో.. జిల్లా పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. ఇవి పంపించి.. ఏడు నెలలు పైనే అవుతున్నా దస్త్రాలు ముందుకు కదలడం లేదు.

# వినరు.. పలకరు

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రోజుకు సుమారు 200 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. వీరికి ఓపీ సేవలు ఆలస్యంగా అందుతున్నాయి. కొంతకాలంగా శస్త్రచికిత్సల సంఖ్య తగ్గిపోయింది. ఈ విభాగంలో ఎనిమిది వైద్యులకు గాను ఇద్దరే ఉన్నారు. దీంతో ఓపీ, ఐపీ సేవలు, శస్త్రచికిత్సలు చేయడం కష్టంగా మారింది. ఇక్కడ మొక్కుబడి వైద్యం చేస్తుండటంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈఎన్‌టీ వైద్యం ఖర్చుతో కూడుకున్నది కావడంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది.

**తగ్గిపోయిన శస్త్రచికిత్సలు**

సర్వజన వైద్యశాల ఈఎన్‌టీ ఓపీకి రోజుకు 150 నుంచి 200 మంది చొప్పున నెలకు 5 వేల మందికిపైగా రోగులు వస్తుంటారు. ఈ విభాగంలో రోజూ 200 నుంచి 250 మంది ఐపీ సేవలు పొందేవారు. ప్రతినెలా ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద 150కి పైగా శస్త్రచికిత్సలు చేసేవారు. గత ఆరు నెలలుగా ఓపీ తగ్గ అడ్మిషన్లు లేవు. శస్త్రచికిత్సలు కూడా 80కే పరిమితం అయ్యాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఆరు నెలలుగా ఇద్దరే దిక్కు**

ఈఎన్‌టీ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఇద్దరు, నలుగురు అసిస్టెంట్లు చొప్పున ఎనిమిది మంది వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో ఆరు నెలలుగా ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నారు. వారు పీజీ విద్యార్థుల సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు.



రోజూ ఓపీ, ఐపీ చూడటంతో పాటు వారంలో రెండుసార్లు సదరం క్యాంపులు నిర్వహించడం, శస్త్రచికిత్సలు చేయడం వీరికి కష్టంగా మారింది.

పీజీలపై తీవ్ర ప్రభావం

ఈఎన్‌టీ విభాగానికి 8 పీజీ సీట్లు ఉన్నాయి. మూడేళ్లకు గాను సుమారు 24 మంది పీజీలు ఉన్నారు. ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ లేకపోవడంతో ఉన్న ఒక్క అసోసియేట్ ప్రొఫెసరే పీజీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో రాబోయే రోజుల్లో ఎన్‌ఎంసీ నుంచి ఉన్న పీజీ సీట్లు పోయే ప్రమాదం ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం– డాక్టర్ హరికిషన్, ఈఎన్‌టీ హెచ్‌వోడీ

జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న వైద్యులు పదోన్నతులపై వెళ్లిపోయారు. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. పీజీలు, సీనియర్ రెసిడెన్సీల సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరత గురించి డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం.

# ఇంగిలాయి... లాభమేనోయి

మండవల్లి : ఆక్వా రంగంలో రైతులంతా వనామీ రొయ్యలు, తెల్లచేపల సాగుతో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందుల నుంచి విముక్తి పొంది స్థిరమైన ఆదాయాన్ని సాధించేందుకు మండవల్లి మండలం భైరవపట్నంకు చెందిన కూనపరాజు నాగరాజు కొత్త రకం చేపల సాగుపై దృష్టి సారించారు. పూర్వం కొల్లేరు ప్రాంతంలో విరివిగా లభించి నేడు కనుమరుగైన ఇంగిలాయి(సింగి) చేపలను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. మంచి దిగుబడులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**వనామీతో విసుగు చెంది..**

రైతు నాగరాజు నాలుగేళ్లుగా వనామీ రొయ్యల సాగులో ఒడుదొడుకులతో విసుగు చెందారు. డిమాండ్ ఉన్న చేపల సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లోని ఆక్వానెస్ట్ హేచరీ సహకారంతో మండవల్లి మండలం గన్నవరంలో రెండెకరాల్లో ఇంగిలాయి చేపల సాగు చేపట్టారు. సాధారణంగా ఇతర చేపలు, పురుగులను వేటాడి తినే ఈ చేపలకు ఫ్లోటింగ్ పెల్లెట్‌ను అలవాటు చేయడంతో



ఇబ్బందులు తగ్గినట్లు చెప్పారు.

**కోల్‌కతా మార్కెట్‌కు..**

ఇంగిలాయి చేపల్లో ఔషధ గుణాలు ఉన్నట్లు బెంగాలీల నమ్మకం. దీంతో కోల్‌కతా నుంచి నేరుగా వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క ఆకివీడు, భీమవరంలో ఉన్న ట్రేడర్స్ సైతం కోల్‌కతాకు బతికి ఉండగానే చేపలను ఎగుమతి చేస్తున్నారు. నాగరాజు ఎనిమిది నెలల సాగు కాలంలో నాలుగు సార్లు పట్టుబడి చేసి ఏకంగా 9.5 టన్నుల దిగుబడి సాధించారు. కిలోకు రూ.320 నుంచి 350 వరకు మార్కెట్ ఉంటుంది. మంచినీటి సదుపాయం ఉంటే ఆరు నెలల్లోనే పట్టుబడి చేసే వీలుంటుంది.

**ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం**

మూడెకరాల్లోపు ఉన్న చిన్న చెరువుల్లో ఇంగిలాయి చేపల పెంపకం ఎంతో అనువుగా ఉంటుంది. ప్రతి 15 రోజులకు మంచినీటి మార్పు చేయాలి. కొంగలు, కాకుల నుంచి రక్షణకు చెరువుపై వలలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. అన్ని కలిసి వస్తే ఖర్చులన్నీ పోయి ఎకరానికి రూ.2 లక్షల వరకు లాభం సాధించవచ్చు. మార్కెటింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేవు.' అని కూనపరాజు నాగరాజు తెలిపారు.

# పల్లె వైద్యం.. కాసుల కష్టం


ఆదోని: ప్రభుత్వ ఆస్పత్రులకు అభివృద్ధి నిధులు అందలేదు. దీంతో అప్పు చేసి వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మూడు, ఆరు నెలలకోసారి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా నిధులు విడుదల చేయాల్సి ఉంది. రెండు త్రైమాసికాలు దాటిపోయాయి.. 2025 సంవత్సరం ముగింపునకు చేరినా.. నయా పైసా అందలేదు. దీంతో రోగులకు అవసరమైన తాగునీరు మొదలుకొని శుభ్రతకు వినియోగించే ఫినాయిల్ వరకు అప్పుచేసి కొనాల్సి వస్తోంది. లేదంటే వైద్యులు, సిబ్బంది జేబు నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆదోని మండలం పెద్దతుంబలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 50– 60 మంది రోగులు వస్తారు. ఇక్కడి ల్యాబ్‌లో రోగుల నుంచి సేకరించిన నమూనాలు, వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్ లేదు. ఫార్మసీ విభాగంలోని పెద్ద రిఫ్రిజిరేటర్లో భద్రపర్చాల్సి వస్తోంది. ఆ గది నిత్యం తెరిచి ఉండదు. అవసరమైన ప్రతిసారి అక్కడి వెళ్లి తెచ్చుకోవడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

**ఏ కేంద్రానికి ఎంతిస్తారు**

ఏడాదికి సీహెచ్‌సీకి రూ.3– 4 లక్షలు, పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు, పట్టణ ఆరోగ్య కేంద్రానికైతే రూ.50 వేలు కేటాయిస్తారు. వీటితో రోగులకు తాగునీటి వసతి కల్పించడం, ఫినాయిల్, స్టేషనరీ కొనుగోలు, ఓపీ చీటీలు, ఓపీ దస్త్రాలు, కంప్యూటర్ మరమ్మతులు, ప్రింటర్ క్యాట్రిడ్జ్, అంతర్జాల బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

అత్యవసర సమయంలో మందుల కొనుగోలు, ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులకు అత్యవసరమైతే రవాణా ఖర్చులు భరించాలి.

జిల్లా కేంద్రం నుంచి ఔషధాలు తెచ్చుకునేందుకు రవాణా ఖర్చులు, ఆస్పత్రుల్లో చిన్నపాటి మరమ్మతులు చేయించడం, గ్రామాలకు వ్యాక్సిన్ల తరలింపు, పైఅధికారులు సందర్శనకు వచ్చినప్పుడు ఏర్పాట్లు.. తదితర



వాటికి వీటి నుంచే వెచ్చించాల్సి ఉంటుంది.

సొంత డబ్బుతో పీహెచ్‌సీల నిర్వహణ

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పీహెచ్‌సీకి ఈ ఏడాది నిధులు రాకపోవడంతో కర్నూలు నుంచి మందులు తెచ్చుకునేందుకు.. పేపర్లు, ప్రింటర్ ఇంకులు, అంతర్జాల బిల్లలకు ఇప్పటి వరకు వైద్య సిబ్బంది రూ.50 వేలు సొంతంగా వెచ్చించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని యర్రగుంట్ల పీహెచ్‌సీలో ఇన్వర్టరు పాడవడంతో వైద్యులే రూ.4 వేల వరకు సొంత డబ్బు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు.

పడకండ్ల పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్వహణకు సిబ్బంది ఇప్పటి వరకు రూ.40 వేలు వెచ్చించారు. అహోబిలం పీహెచ్‌సీ సిబ్బంది రూ.30 వేలు ఖర్చుచేసి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

సీహెచ్‌సీలు 18

పీహెచ్‌సీలు 87

పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 47

చురకలు



## గ్లామర్ తో కట్టిపడేస్తున్న కేతికా శర్మ..

ఈ మధ్యకాలంలో కాస్త సమయం దొరికితే చాలు హీరోయిన్స్ వెకేషన్ కి వెళ్తున్నారు. కొంతమంది ఫ్యామిలీతో వెళ్తే మరికొంతమంది సింగిల్ గా వెళ్లి తమ సమయాన్ని ఎంజాయ్ చేస్తూ ఉంటారు. ఇంకొంతమంది ఫ్రెండ్స్ తో వెళ్తూ అక్కడి వీధులు చుట్టేస్తూ మరింత ఆనందాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు చాలామంది షిప్ ప్రయాణం చేస్తూ అక్కడే తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరో బ్యూటీ కూడా షిప్ లో ప్రయాణిస్తూ తన అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను ఉక్కిరిబిక్కిరి చేసింది. తన అందాలతో కుర్రాళ్లకు గాలం వేస్తూ చెమటలు పట్టించింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ బ్యూటీ కేతిక శర్మ. తాజాగా వెకేషన్ కి వెళ్ళిన ఈమె సముద్ర యానం చేస్తూ షిప్ నుండి కొన్ని ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అందులో ఈమె షేర్ చేసిన ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమ్మడి అందాలకు ఫిదా అవుతున్నారు. చాలా రోజుల తర్వాత కేతిక శర్మ మంచి గ్లామర్ ట్రీట్ ఇచ్చిందని కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేతిక శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ హల్చల్ చేస్తున్నాయి. చాలా రోజుల తర్వాత కేతిక ఇలా అందాలు ఆరబోయడంతో కామెంట్ బాక్స్ లో అభిమానులు ఫైర్ ఎమోజీలతో నింపేస్తున్నారు. 1995 డిసెంబర్ 24న ఇండియాలోని న్యూఢిల్లీలో జన్మించిన ఈమె చదువు పూర్తి అయిన



తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ డబ్స్ మాష్ వీడియోల ద్వారా సోషల్ మీడియాలో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. ఈ వీడియోలతోనే దర్శకుల కంట్లో పడి కెరియర్ ను మొదలుపెట్టింది .తొలిసారి 2021లో పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరీ హీరోగా నటించిన రొమాంటిక్ అనే సినిమాలో హీరోయిన్గా అవకాశం దక్కించుకొని.. నటన రంగ ప్రవేశం చేసింది. ఈమె నటనపై విమర్శకులు ప్రశంసలు కురిపించడమే కాకుండా ఆశాజనకంగా నటించింది అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఇక అదే ఏడాది నాగశౌర్య హీరోగా నటించిన లక్ష్య అనే సినిమాలో కూడా హీరోయిన్గా అవకాశాన్ని దక్కించుకుంది. ఈ సినిమాకి కూడా విమర్శకుల ప్రశంసలు లభించాయి. ఇక 2022లో మెగా హీరో పంజా వైష?వ్ తేజ్ హీరోగా వచ్చిన రంగ రంగ వైభోగంగా సినిమాలో హీరోయిన్గా నటించింది. ఇక తర్వాత సాయి ధరంతేజ్ యాక్సిడెంట్ తర్వాత తన మేనమామ పవన్ కళ్యాణ్ తో కలిసి నటించిన బ్రో సినిమాలో సాయి ధరంతేజ్ సరసన నటించింది. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్ల సాధించిన ఐదవ చిత్రంగా నిలిచింది. ఇక ఇటీవల రాబిన్ హుడ్, సింగిల్ వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె విజయ్ 69 మూవీలో కూడా నటిస్తోంది. ఇలా ప్రస్తుతం ఈమెకు సంబంధించిన కొన్ని విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి

## ఎలాంటి హడావిడి లేకుండా బుట్టబొమ్మ బర్త్ డే పార్టీ

అనిఖా సురేంద్రన్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. మలయాళ నటి అయిన అయిన అనిఖా బాల నటిగానే కెరీర్ ను స్టార్ట్ చేసింది. 2010లో మలయాళ సినిమా కదా తుడారున్నుతో నటిగా పరిచయమైన అనిఖా ఆ తర్వాత యెన్నై అరిందాల్, విశ్వాసం లాంటి సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించింది. 2013లో 5 సుందరికల్ సినిమాలో తన పాత్రకు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డును గెలుచుకున్న అనిఖా తర్వాత కేవలం మలయాళంలోనే కాకుండా తమిళ, తెలుగు సినిమాల్లో కూడా నటిస్తోంది.

**21 ఏళ్లు పూర్తి చేసుకున్న బుట్టబొమ్మ...** తెలుగులో బుట్టబొమ్మ అనే సినిమాను చేసిన అనిఖా రీసెంట్ గా 21 ఏళ్లు పూర్తి చేసుకుంది. అయితే తన బర్త్ డే పార్టీని అనిఖా భారీగా కాకుండా తన ఇంట్లోనే ఫ్రెండ్స్ తో కలిసి చాలా సాదాసీదాగా సెలబ్రేట్ చేసుకుంది. ఈ పార్టీలో అందరూ ఎలాంటి హడావిడి లేకుండా చాలా సరదాగాగా



కనిపించారు. మామూలుగా సెలబ్రిటీలు ఎవరైనా తమ పుట్టినరోజుల ను చాలా గ్రాండ గా సెలబ్రేట్ చేసుకుంటారు. కానీ అనిఖా మాత్రం అందరికీ భిన్నంగా చాలా సైలెంట్ గా చేసుకుంది. బర్త్ డే పార్టీ ఫోటోలను అనిఖా సోషల్ మీడియాలో షేర్ చేయగా ఆ ఫోటోల్లో బుట్టబొమ్మ బ్లాక్ డ్రెస్ లో కేక్ పక్కన నిలబడి ఎంతో అందంగా కనిపించింది. అంతేకాదు, ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జరిగిన పార్టీ కావడంతో ఆ ఫోటోలు కూడా చాలా నేచురల్ గా అనిపిస్తున్నాయని నెటిజన్లు ఆ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు.




## ఏంటిది రాజా సాబ్ ..అక్కడ సౌండ్ లేదే!



ప్రభాస్..వరుస పాన్ ఇండియా సినిమాలతో దేశ వ్యాప్తంగా మారుమోగుతున్న పేరిది. బాహుబలి తరువాత పాన్ ఇండియాస్టార్‌గా మారిన ప్రభాస్ అప్పటి నుంచి అదే తరహా సినిమాలుచేస్తూ తన మార్కెట్‌ని సుస్థిరం చేసుకుంటున్నాడు. వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దేశ వ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరిస్తూ ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ అనిపించుకుంటున్నాడు. తెలుగు సినిమా మార్కెట్‌ని రికార్డు స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా పాన్ ఇండియా వైడ్‌గా భారీ మార్కెట్‌ని క్రియేట్ చేసి ఎంత మంది నిర్మాతలకు, హీరోలకు, డైరెక్టర్లకు ఫేమ్‌ని, పాపులారిటీని తెచ్చి పెట్టాడు. దేశ వ్యాప్తంగా ఒకే ఒక్క సినిమాతో బాక్సాఫీస్ వసూళ్లని, సినిమా మార్కెట్ స్వరూపాన్నే సమూలంగా మార్చేయడంతో ఇండియా వైడ్‌గా ప్రభాస్‌కు భాఈ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. బాహుబలి ఏర్పడిన క్రేజ్‌ని, మార్కెట్‌ని ప్రభాస్ ఇప్పటిక అదే స్థాయిలో కంటిన్యూ చేస్తూ వస్తున్నాడు. నెట్టింట భారీ ట్రోల్‌కు గురైన ఆదిపురుష్ లాంటి సినిమాకు కూడా దేశ వ్యాప్తంగా భారీ ఓపెనింగ్స్ వచ్చాయంటే దానికి ప్రభాస్ క్రేజే కారణం. అంతగా ఇండియన్ మార్కెట్‌ని, ప్రేక్షకుల్ని ప్రభాస్ ప్రభావితం చేశాడు. దేశ వ్యాప్తంగా మంచి మార్కెట్ ఏర్పడటంతో ప్రభాస్ తన ప్రతి సినిమా ప్రమోషన్స్ సౌత్‌తోపాటు నార్త్‌లోనూ భారీ స్థాయిలో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నాడు. దీంతో తను నటించిన సినిమాలకు దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ భారీ ఓపెనింగ్స్ లభిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని ది రాజా సాబ్ టీమ్ పూర్తిగా విస్మరించిందా? అనే అనుమానాలు కలుగుతున్నాయనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ది రాజా సాబ్. ప్రభాస్ చేసిన తొలి హారర్ కామెడీ సినిమా ఇది. అంతే కాకుండా సలార్, కల్కి 2898 ఏడీ వంటి వరుస బ్లాక్ బస్టర్స్ తరువాత ప్రభాస్ నుంచి వస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ ఇది. అలాంటి సినిమా ప్రమోషన్స్ విషయంలో ది రాజాసాబ్ టీమ్ ఇంత సైలెంట్‌గా ఉండటం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రభాస్ సినిమా అంటే దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ భారీ స్థాయిలో ప్రమోషన్స్ ఉంటాయి. కానీ ఈ సినిమా విషయంలో ఇంత వరకు టీమ్ ఉత్తరాదిలో ప్రమోషన్స్ స్టార్ట్ చేయకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభాస్ నటించిన ఒకటి అర సినిమాలు దక్షిణాదిలో డిజాస్టర్ అనిపించుకున్నా ఉత్తరాదిలో భారీ వసూళ్లని రాబట్టాయి. ఆ విషయాన్ని ద ృష్టిలో పెట్టుకుని నిర్మాతలు ఉత్తరాదిలో భారీగా ప్రమోషన్స్ ప్లాన్ చేసి వసూళ్లు భారీగా వచ్చేలా చూస్తుంటారు. కానీ ది రాజాసాబ్ టీవ్ం మాత్రంఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారేంటనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ప్రమోషనల్ ఖర్చు విషయంలో వెనుకాడరనే పేరున్న నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ %--%ది రాజాసాబ్%--% ఉత్తరాది ప్రమోషన్స్ విషయంలో ఇలా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారేంటని అంతా అవాక్కవుతున్నారు. ఈ మూవీ ప్రమోషన్స్ కోసం ఇప్పటికే ముంబయిలో ఓ భారీ ఈవెంట్‌ని నిర్వహించాల్సింది. సినిమా రిలీజ్‌కు టైమ్ దగ్గరపడుతున్నా PeopleMedia నిర్మించిన తొలి భారీ పాన్ ఇండియా మూవీ అయినా అక్కడ సౌండ్ చేయకుండా సైలెంట్ కావడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా ఉత్తరాదిలో ప్రమోషన్స్ మొదలు పెట్టి సైండ్ పెంచితే రాజాసాబ్ అక్కడ వసూళ్ల వర్షం కురిపిస్తుందని, బాలీవుడ్‌కు ఇష్టమైన హారర్ కామెడీ జోనర్ కాబట్టి భారీ వసూళ్లు ఖాయమని అక్కడి ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి టీమ్ ఇప్పటికైనా తేరుకుని ప్రమోషన్స్ స్పీడప్ చేస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

## పోటీని తట్టుకుని ఆ సినిమా నెగ్గుతుందా?




కన్నడలో సీనియర్ హీరో అయిన శివ రాజ్ కుమార్ అక్కడ స్టార్ హీరో అయినప్పటికీ తెలుగు ఆడియన్స్ కు బాగా దగ్గరైంది మాత్రం రజినీకాంత్ జైలర్ మూవీ వచ్చాకే. ఆ తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలో గౌర్ నాయుడు అనే కీలక పాత్ర చేస్తూ తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఆయన్ని అందరూ ప్రేమగా శివన్న అని పిలుచుకుంటారనే సంగతి తెలిసిందే. అయితే జైలర్ కంటే ముందు కూడా ఆయన తెలుగు సినిమాలో నటించారు కానీ ఆ క్యారెక్టర్లు పెద్దగా ఆడియన్స్ కు రీచ్ అవలేదు. గౌతమీపుత్ర శాతకరి? మూవీలో బుర్ర కథ సాంగ్ కు డ్యాన్స్ చేసిన శివన్నకు ఆ సినిమాలో బాలయ్యతో ఎక్కువగా సీన్స్ ఉండవు. అందుకే ఆ పాత్ర ఎవరికీ పెద్దగా గుర్తులేదు. ఇదిలా ఉంటే ఆయన నటించిన 45 అనే మూవీ గత వారం కన్నడలో రిలీజైంది.

**విమర్శకుల ప్రశంసల్ని అందుకున్న 45..** ఈ మూవీలో శివన్నతో పాటూ ఉపేంద్ర కూడా నటించారు. అర్జున్ జన్య అనే డైరెక్టర్ ఈ మూవీతో డెబ్యూ ఇవ్వగా, క్రిటికల్ పాయింట్ తో తెరకెక్కిన 45 మూవీతో డైరెక్టర్ విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నారు. డిసెంబర్ 25న రిలీజైన ఈ సినిమాకు కన్నడలో కలెక్షన్స్ బానే ఉన్నప్పటికీ సినిమాకు సూపర్ హిట్, బ్లాక్ బస్టర్ టాక్ అయితే రాలేదు. కానీ సినిమా చూసిన వాళ్లంతా 45 మూవీ బావుందని, కొత్తగా ట్రై చేశారనే అంటున్నారు.

అలాంటి విభిన్న సినిమా న్యూ ఇయర్ సందరరేగా జనవరి 1న తెలుగులో రిలీజవుతుంది. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రిలీజవుతున్న ఈ సినిమాలో శివ రాజ్ కుమార్ అమ్మాయి వేషం వేసి అందరినీ ఆకట్టుకున్నారు. కన్నడలో ఎన్నో గొప్ప గొప్ప ప్రశంసలు అందుకున్న 45 మూవీ మరి తెలుగులో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. అయితే ఈ మూవీతో పాటూ జనవరి 1న వనవీర, సైక్ సిద్ధార్థ, సఃకుటుంబానాం లాంటి సినిమాలు కూడా ఉన్నాయి. పోటీ ఉన్నప్పటికీ 45 మేకర్స్ సినిమాను పెద్దగా ప్రమోట్ చేయలేదు. ఎలాంటి ప్రమోషన్స్ లేకుండా రిలీజవుతున్న ఈ మూవీ మరి పోటీని తట్టుకుని 45 ఏ మేర నిలబడుతుందో చూడాలి.

## బ్లాక్ డ్రెస్‌లో 'రాజాసాబ్' బ్యూటీ.. గ్లామర్ హీట్ మామూలుగా లేదుగా..

'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో మాస్ ఆడియెన్స్?ను తన గ్లామర్‌తో కట్టిపడేసిన బ్యూటీ నిధి అగర్వాల్. వెండితెరపై తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట హీట్ పుట్టిస్తున్నాయి. ప్రముఖ డిజైనర్ తరుణ్ తహల్యాని డిజైన్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్‌లో నిధి అగర్వాల్ స్టన్నింగ్‌గా కనిపిస్తున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో నిధి నలుపు రంగు డ్రెస్ లో నెవ్వర్ బిఫోర్ అనేలా దర్శనమిచ్చారు. ముఖ్యంగా ఆ డ్రెస్‌కు ఉన్న కోర్సెట్ స్టైల్ బ్లౌజ్, దానిపై ఉన్న మెరిసే వర్క్ ఆమె గ్లామర్‌ను రెట్టింపు చేసింది. మోడ్రన్ గౌన్‌లా ఉన్న ఈ డ్రెస్ డిజైన్ ఆమె పరౌక్ట్ గ్లామర్‌ను ఎలివేట్ చేస్తోంది. స్టైలింగ్ విషయంలోనూ నిధి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. హెవీ జ్యువెలరీ జోలికి వెళ్లకుండా, కేవలం నలుపు రంగు హ్యాంగింగ్ ఇయర్ రింగ్స్ ధరించి చాలా క్లాసీగా రెడీ అయ్యారు. జుట్టును లూజ్‌గా వదిలేసి, మినిమల్ మేకప్‌తో తన న్యాచురల్ అందాన్ని హైలైట్ చేశారు.



కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, ఆ కాన్ఫిడెన్స్ చూస్తుంటే 'పరౌక్ట్' లుక్ అంటే ఇదేనేమో అనిపిస్తుంది. ఇక కెరీర్ విషయానికి వస్తే, గత ఏడాది నిధి అగర్వాల్ 'హరిహర వీరమల్లు' సినిమాలో కనిపించారు. పవన్ కళ్యాణ్ సరసన నటించినా, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఆ సినిమా ఫలితం కాస్త నిరాశపరిచినా, నిధి మాత్రం తన తదుపరి ప్రాజెక్టులపైనే పూర్తి ఫోకస్ పెట్టారు. నెక్స్ట్ ఆమె ప్రభాస్ సరసన మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' సినిమాలో కనిపించనున్నారు. ఈ సినిమా పైనే నిధి భారీ ఆశలు పెట్టుకున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమా కావడంతో, ఇది కచ్చితంగా తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సోషల్ మీడియా లో మాత్రం నిధి క్రేజ్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. రాబోయే రోజుల్లో 'రాజాసాబ్'తో ఆమె ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి.

## నిజ జీవిత పాత్రలో తమన్నా ట్రబుల్స్

నిజ జీవిత పాత్రల్లో నటించాలంటే చాలా సవాళ్లను ఎదుర్కోవాలి. నిజ కథలు, నిజ జీవిత పాత్రలకు ప్రత్యేకించి అభిమానులు ఉంటారు. వారిని సంతృప్తి పరిచేలా తారలు నటించి మెప్పించాల్సి ఉంటుంది. దానికోసం చాలా కసరత్తు చేయాలి. అయితే ఇప్పుడు నిజ జీవిత పాత్రలో నటించేందుకు సిద్ధమవుతున్న తమన్నా తాను ఎలాంటి సవాల్ కి అయినా సిద్ధమేనని పేర్కొంది. గల్లీబోయ్ ఫేం సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు అభిజీత్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సినీ నటుడు వి శాంతారామ్ జీవతకథతో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి చిత్రపతి వి శాంతారామ్ అని పేరు పెట్టారు. ఇందులో ప్రతి ఫ్రేమ్ లో తమన్నా తనను తాను నిరూపించుకోవడానికి ఆస్కారం ఉంది. సిద్ధాంత్-తమన్నా ఇద్దరూ నిజ జీవిత పాత్రలలో కనిపిస్తారు. తమన్నా పాత్ర కథనాన్ని నడిపించే కీలకమైన పాత్ర. ఇది నిజంగా సవాలుతో కూడుకున్న పాత్ర. ప్రేక్షకులు ఆమెను కొత్త కోణంలో చూడగలుగుతారు కాబట్టి తమన్నా కూడా ఉత్సాహంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ చిత్రం



మరాఠా, హిందీలోను రూపొందనుంది. అభిజీత్ గతంలో డాక్టర్ కాశీనాథ్ ఘనేకర్ (2018) అనే బయోపిక్ ని రూపొందించారు. చిరస్మరణీయమైన మరాఠీ చిత్రం నటసామ్రాట్ (2016)కి అతడు దర్శకుడు. టేబుల్ నెం 21 (2013), వజీర్ (2016), బ్రీత్ (2018) వంటి హిందీ సినిమాలకు అతడు రచయితగా పని చేసారు.

**శాంతారామ్ సేవలు అనన్య సామాన్యం:** భారతీయ చిత్ర పరిశ్రమకు వి. శాంతారామ్ అందించిన సేవలు అపారమైనవి. ఈ చిత్రంతో యువతరం దాని గురించి నేర్చుకుంటుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారు. కొల్హాపూర్‌లో కడు పేదరికంలో జన్మించిన ఈ వ్యక్తి, పూణేలోని బాబూరావు పెయింటర్ వద్ద పని చేస్తూ, ఫిలింమేకింగ్ లో మెళకువలు నేర్చుకున్నాడు. అటుపై జనక్ జనక్ జనక్ పాల్ బాజ్ (1955), దో ఆంఖేన్ బరా హాత్ (1957) వంటి చిత్రాలతో హిందీ చిత్ర పరిశ్రమలో మరపురాని ముద్రను వేసాడు. ఈ చిత్రం ప్రేక్షకులకు ఆయన ఒక ట్రెండ్‌సెట్టర్ ఎలా అయ్యాడో చెబుతుంది. ఈ బయోపిక్ జ్ఞానోదయం కలగజేయడంలోనే కాదు.. ఎంతో వినోదాత్మకంగా, నాటకీయంగాను ఉంటుందని చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M), DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536